రైతులోకం

సంపుటి : 47 * సంచిక : 9 * విజయవాడ * మే 2016 * పేజీలు : 44 * వెల : రూ. 15/-



కారల్ మార్క్స్ జయంతి
1818 మే 5

భారతదేశంలో నిప్పుల సముద్రాలు
పర్యావరణ దృశ్య ప్రయోగశాల
అందించిన చిత్రం

వడదెబ్బకు గురై నోటితో
గాలి పీల్చుకుంటున్న ఆవులు

పత్తికొండలో దేవాదాయ కౌలురైతులు, కౌలురైతుల సమస్యలపై ధర్నాలో
ప్రసంగిస్తున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య

మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద దేవాదాయ కౌలురైతులు, కౌలురైతుల సమస్యలపై
ధర్నాలో ప్రసంగిస్తున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్

కాకినాడ కలెక్టరేట్ వద్ద దేవాదాయ కౌలురైతులు, కౌలురైతుల సమస్యలపై
ధర్నాలో ప్రసంగిస్తున్న కౌలురైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చెల్లుబోయిన కేశవశెట్టి

శ్రమజీవులకు

కార్మిక దినోత్సవ
శుభాకాంక్షలు

CI

2015 డిసెంబరు 23న శ్రీ చంద్ర రామలింగయ్య, శ్రీమతి సూర్యాంబగార్ల మనవడు చి॥ అవినాష్ రుషి, చి॥ల॥సౌ॥ కౌముదిల వివాహము జరిగిన సందర్భముగా వరుడి తండ్రి శ్రీ చంద్ర ఆనంద్ (సి.ఆర్.కె. రావ్), తల్లి శ్రీమతి దుర్గాభవాని వరుడి అన్న శ్రీ అభిషిక్త్, వదిన శ్రీమతి స్రవంతి గార్లు రైతులోకానికి వివాహ కానుకగా 25 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. వారికి రైతులోకం యాజమాన్యం కృతజ్ఞతలు తెలియచేస్తున్నది.

సంపాదకీయం

దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతులను ఆదుకోవాలి !

రాష్ట్రంలో దేవాదాయ - ధర్మాదాయ కౌలు రైతుల సమస్యలు కడుదుర్భరంగా మారాయి. ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించడానికి ఏమాత్రం చొరవ చూపకపోగా అధిక బారాలు మోపుతున్నది. గతంలో ఇచ్చిన జి.ఓ.లను కూడా అమలు జరపకుండా కొత్త జి.ఓ.లను ప్రకటించింది. గత ప్రభుత్వంలో సాధించకున్న జి.ఓ. నెం. 379 ద్వారా కొన్ని హక్కులు లభించాయి. వాటిని సైతం కాలరాసి నేటి ప్రభుత్వం జి.ఓ. నెం. 341, 465లను ప్రకటించి కౌలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. దేవాదాయ కౌలు రైతులకు నష్టం కలిగించే నిబంధనలను తొలగించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇప్పుడు వచ్చిన కొత్త దేవాదాయ శాఖా మంత్రి రైతుల నెత్తిన పిడుగులాంటి నిర్ణయాలు విధిస్తున్నారు. దేవాదాయ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దేవాదాయ రైతులను సైతం కాషాయికరణ చేయటానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. హిందువులు కాని రైతులు హిందు దేవాలయాల భూములు కౌలుకు చేయ్యకూడదని క్రిష్టియన్స్, ముస్లిం మతస్థులకు చెందిన రైతులను భూముల నుండి తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. భారతదేశం లాంటి సెక్యులర్ దేశంలో ఇలాంటి నిబంధనలు విధించడం ప్రమాదకర పరిణామం. అంటే ముస్లింలు, క్రిష్టియన్స్‌లలో 90% దళిత, పేద రైతులే ఉన్నారు. వారిపై ఇలాంటి ఆంక్షలుపెట్టి భూములనుండి లాక్కోవడం అత్యంత దారుణం.

ఆంధ్రప్రదేశ్‌లో బి.జె.పి. లాంటి మతతత్వ పార్టీ స్వాత్రంతం వచ్చిన తరువాత ఏనాడు అధికారంలో లేదు. తొలిసారి భారతీయ జనతా పార్టీకి చెందిన 4 శాసనసభ్యులలో ఇద్దరు మంత్రులుగా వెలగబెడుతున్నారు. వారిలో ఒకరైన మాణిక్యాలరావు గారు దేవాదాయ శాఖామాత్యులుగా పనిచేస్తున్నారు. ఆయన గారి సూచనలే ఇతర మతాలకు చెందిన దళిత, పేద రైతులకు భూములు ఇవ్వకూడదని ఆంక్షలు విధించారు. ఆంధ్రప్రదేశ్‌లో మత్వతత్వ పార్టీ అయిన భారతీయ జనతా పార్టీని అధికారంలో భాగస్వామిగా పెట్టుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పాపంలో పాలుపంచుకుంటున్నారు. సెక్యులర్ పార్టీగా చెప్పకునే తెలుగుదేశం పార్టీ దాని అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ అంక్షలను రద్దు చేసి దళిత, పేద కౌలు రైతులకు న్యాయం చేయ్యాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతులు 25 లక్షల మంది ఉంటే ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో 16 లక్షలకు పైగా కౌలు రైతులున్నారు. వీరిలో దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతులు లక్ష ఇరవై వేల మంది ఉన్నారు. మూడులక్షల ఢెభై వేల ఎకరాలు వారి చేతిలో భూమి ఉన్నది. 2011లో కౌలు రైతులకు మేలు చేసే చట్టం ప్రకారం రుణ అర్హత కార్డులు ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 5 లక్షల మందికి మాత్రమే రుణ అర్హత కార్డులు ఇస్తే ఒక లక్ష మందికి రుణాలు బ్యాంకులు మంజూరు చేశాయి. ఈ రుణ అర్హత కార్డు ప్రకారం భ్యాంకులలో రుణాలు ఇవ్వడం, ఇన్‌పుట్ సబ్సిడీలు మంజూరు చేయడం, పంటల భీమా పథకంలో చేర్చడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పడు నష్ట పరిహారం చెల్లించటం లాంటి ప్రయోజనాలు చేకూరుతాయి. రైతు ఆమోదించినట్లు అంగీకార పత్రం ఇస్తేనే వారికి అప్పలు బ్యాంకులవారు ఇస్తారు. దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతులకు ఏవ్వరికి రుణ అర్హత కార్డులు ఇవ్వలేదు. ఈ రైతులకు దేవస్థాన యాజమాన్యం వేలం పాటలు పెట్టి లీజు అగ్రీమెంటులు ఇస్తారు. మరి వారికి బ్యాంకులు ఎందుకు అప్పలు ఇవ్వడం లేదు? కౌలు దారులకు ఇచ్చే ప్రయోజనాలు ప్రభుత్వం వీరికి ఎందుకు కలిగించడం లేదు?

ప్రకృతి వైపరీత్యాలైన తుఫానులు, వరదలు, కరువు కాటకాలు వచ్చినప్పడు దేవాదాయ - ధర్మాదాయ రైతులకు శిస్థు రద్దు చేయాలి. గతంలో వై.యస్.రాజవేఖర్‌రెడ్డి ప్రభుత్వ హాయంలో ' ఓగ్నీ ' తుఫాను సంబవించిన సందర్భంగా దేవాదాయ - ధర్మాదాయ కౌలు రైతులకు 100% శిస్థులను రద్దు చేస్తూ నాడు జి.ఓ. జారీ చేయటం జరిగింది. నాడు ఎక్కువమంది రైతులకు ప్రయోజనం చేకూరింది. ఇప్పడు ప్రభుత్వం కూడా అది అమలు జరపటానికి చర్యలు చేపట్టాలి. దాని కోసం దేవాదాయ - ధర్మాదాయ కౌలు రైతులు వారి హక్కులు సాధించుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన సమయం అసన్నమైంది.

రావుల వెంకయ్య
ప్రధాన సంపాదకులు

రైతులోకం

మే 2016

సంపుటి - 47 **సంచిక - 9**

వెల రూ. 15/-

పేజీలు : 44

ప్రధాన సంపాదకులు
రావుల వెంకయ్య

సంపాదకులు
కొల్లి నాగేశ్వరరావు

కార్యనిర్వాహక సంపాదకులు
కె.వి.వి. ప్రసాద్

సంపాదకవర్గ సభ్యులు
పి. గంగాభవాని
కె. జగన్నాథం

మేనేజిమెంట్ కమిటీ
పి. రామచంద్రయ్య (కన్వీనర్)
ఎన్. గురవయ్య
కొమ్మన నాగేశ్వరరావు
ఆర్. జగ్గారావు
ఎ. కాటమయ్య

మార్కెటింగ్ మేనేజర్
ఎం. రాజేంద్రప్రసాద్

సలహా మండలి
డా॥ కె.ఆర్. చౌదరి
రిటైర్డ్ అర్థశాస్త్ర ప్రొఫెసర్
ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
డా॥ సోమసుందర్ మర్ల
ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఐ.సి.ఎ.ఆర్.
ఆచార్య చేకూరి నరసింహారావు
ప్రొ॥ ఎమెరిటస్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
సి.వి. సర్వేశ్వరశర్మ
అధ్యక్షులు, కోనసీమ సైన్స్ పరిషత్
సంగిరెడ్డి హనుమంతరెడ్డి

చిరునామా :
రైతులోకం
రైతు భవన్, 210, అమృత ఎస్టేట్స్
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500 029
Mail : ryotulokam@gmail.com

విషయ క్రమం ...

1. పశువులలో వడదెబ్బ - చికిత్స - తీసుకోవాల్సిన జాగ్రత్తలు 3
   - డా॥ పి. రవికాంత్‌రెడ్డి, డా॥ సిహెచ్. గిరినాథ్, డా॥ డి. శ్రీనివాసకుమార్
2. అధిక దిగుబడులు సాధించిన గోదావరి వరి రైతులు శ్రీ సేద్యం - మర్ల సోమసుందర్ 4
3. వేసవిలో పాల ఉత్పత్తి తగ్గకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు - డా॥ యం. కాశిరెడ్డి, డా॥ సిహెచ్. వరప్రసాదరావు, యం.వి. కృష్ణాజీ, యం. రవివెంకన్నబాబు 5
4. అమెరికా అడుగుపెట్టడంతో ... ప్రమాదంలో పడనున్న క్యూబా వ్యవసాయం 8
   - సంగిరెడ్డి హనుమంతరెడ్డి
5. మామిడి తోటల్లో సస్యరక్షణ - కొన్ని సూచనలు - సి.వి. సర్వేశ్వరశర్మ 11
6. పొలాలలో నిప్పు - భూమికే ముప్పు - హనుమంతరెడ్డి 13
7. లాభాల బాటలో పెయ్యల పెంపకందారులు - కె. వీరభద్రరావు 14
8. వేసవిలో భూసార పరీక్షలు - ఆవశ్యకత 15
   - డా॥ ఓ. శారద, శ్రీ జి. రమేష్, డా॥ జి. శివనారాయణ
9. మామిడి కోత - ఎగుమతుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు 16
10. శాస్త్రీయ సోషలిజానికి మార్గదర్శి కారల్ మార్క్స్ - ఎం.సి. వెంకటేశ్వర్లు 19
11. గోగు 21
12. కానుగ 24
13. దేశ వ్యవసాయరంగంపై ఆర్థిక సంస్కరణల ప్రభావాలు 26
    - ఆర్.ఎస్. యాదవ్ (అనువాదం : బుడ్డిగ జమిందార్)
14. విత్తన సరఫరా ఆవశ్యకత - వి. రాంనర్సింహారావు 30
15. మే మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు 31

రైతు ఉద్యమ వార్తలు - కె.వి.వి. ప్రసాద్, మల్నీడి యల్లమందారావు

16. దేవాదాయ భూముల సాగుదారుల కౌలు రద్దు చేయాలి ! 32
17. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి దళారుల దోపిడీని అరికట్టాలి ! 33
18. లోపాలమయం 'ముటుకుల సాగునీటి పథకం' 33
19. సుబాబుల్, జామాయిల్, సరుగుడు రైతులను ప్రభుత్వం విస్మరించడం దారుణం 34
20. జి.ఓ. నెం. 341 ఉపసంహరించాలని కోరుతూ... 35
21. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఏరువాక పనులు ప్రారంభం 35
22. కౌలురైతుల హక్కులు పరిరక్షించాలని కోరుతూ... 36

ఎడిటర్ పేరుతో రచనలు,
కన్వీనర్, రైతులోకం పేరుతో చెక్కులు, డి.డి.లు పంపాలి.

పశువులలో వడదెబ్బ - చికిత్స - తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా॥ పి. రవికాంత్ రెడ్డి, పిహెచ్.డి., పశుపోషణ విభాగం; డా॥ సిహెచ్. గిరినాథ్, టీచింగ్ ఫ్యాకల్టీ; డా॥ డి. శ్రీనివాసకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్
ఎన్.టి.ఆర్. కాలేజ్ ఆఫ్ వెటరినరీ సైన్స్, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, గన్నవరం. ఫోన్స్ :7386247618,9701107022

భారతదేశం ఉష్ణమండల అయన రేఖతోన్నస్థితిలో ఉండడం వలన, 45, డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు 48 - 50 డిగ్రీల సె. వరకు నమోదైన సంఘటనలూ ఉన్నాయి. కావున పశువులు వడదెబ్బకు గురయ్యే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి. అందువలన వడదెబ్బ గురించి పశు పోషకులు అవగాహన కల్పించుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నది.

వడదెబ్బ ప్రక్రియ :

వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువైనప్పుడు, మెదడులోని హైపోథలామస్ అనే భాగం స్వేద గ్రంధుల మీద పర్యవేక్షణ కోల్పోతుంది. దానివలన స్వేద గ్రంధులు, చెమటను అధికంగా ఉత్పతి చేస్తాయి. చెమట ద్వారా శరీరంలోని ధాతువులు, ఉప్పు ఎక్కువగా కోల్పోయి జీవక్రియ దెబ్బతింటుంది. శరీరం ఉష్ణోగ్రత పెరిగి, శ్వాస, గుండె, నాడి, మూత్రపిండాల విధులు తగ్గిపోయి, పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి కోమాలోకి జారుకొని, శ్వాస ఆడక మరణిస్తాయి.

వడదెబ్బ తగలడానికి ముఖ్య కారణాలు :

- ★ గాలిలో తేమ శాతం అధికంగా వుండటం
- ★ వాతావరణ ఉష్ణోగ్రత పెరగడం
- ★ ఎక్కువ పశువులను పాకలోసామర్ధ్యానికి మించి ఉంచడం
- ★ నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు
- ★ వడగాలుల వలన మరియు
- ★ పశువుల వత్తిడికి లోనవడం వలన

లక్షణాలు :

ఆవులలో శరీరం ఉష్ణోగ్రత 103° సెల్సియస్‌కి మించుతుంది.

చర్మం మృదుత్వం తగ్గిపోయి, గట్టిపడుతుంది.

నోటితో గాలి పీల్చుకోవడం మరియు నోటి వెంట చొంగ కారడం జరుగుతుంది.

ఆవులలో పాలదిగుబడి, పునరుత్పత్తి మరియు చూడు కట్టే శాతం తగ్గి, గర్భస్రావం అయ్యే అవకాశం వుండగా, ఎద్దులలో వంధ్యత్వం వస్తుంది.

తీవ్రత ఎక్కువైనప్పుడు పక్షవాత లక్షణాలు సంభవించి, క్రమంగా కోమాలోకి వెళ్లి మరణిస్తాయి.

చికిత్స :

వడదెబ్బకి గురైన పశువులను వెంటనే నీడప్రాంతానికి మార్చి, వీలైతే ఫ్యాన్లు లేదా కూలర్ల సహాయంతోచల్లని గాలిని అందించాలి.

బాగా ఎండగా ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితోపలుమార్లు కడగాలి.

చల్లని నీరు త్రాగడానికి అందుబాటులో ఉంచి, నొప్పులను తగ్గించడానికి నొప్పి నివారణ (అనాల్జేసిక్) మందులను వాడాలి.

రక్తంలోకి డెక్స్ట్రోజ్ సెలైన్ మరియు లవణద్రావణాలు (ఎలక్ట్రోలైట్స్) ఎక్కించాలి.

నివారణ :

వేసవిలో పశువులని 10 గం. నుండి 3 గం.ల మధ్య మేతకు బయటకి వదలకూడదు.

చల్లని త్రాగునీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి.

రోజుకు 3-4 సార్లు చల్లని నీటితో కడగడం లేదా నీటి చెరువులు, గుంటలున్న చోటా నీళ్లలోనికి వదలాలి.

కొట్టాలను బాగా ఎత్తుగా నిర్మించుకొని, పైన ఎండుగడ్డితో కప్పి, ఎండగా ఉన్న సమయాలలో దాని మీద నీళ్లు చల్లుతుండాలి.

పశువుల పాకలలో వడగాలి వస్తున్న దిక్కుల్లో గోనెసంచులు కట్టి నీళ్ళు చల్లుతుండాలి. నీటి శాతం ఎక్కువగా ఉన్న మేపు (పచ్చిగడ్డి, పాతర గడ్డి, హైడ్రోఫోనిక్స్ గడ్డి) పెట్టాలి.

మరీ ఎక్కువగా దాణా లేదా ఉడికించిన ధాన్యాలు పెడుతున్నప్పుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండ వేడిమికి గురైన పశువులలో వచ్చే అజీర్తి సమస్యలను నివారించవచ్చు. ✧



నీటికుంటలో ఈదులాడుతూ సేదతీరుతున్న బర్రెలు - వడదెబ్బ సోకటంవలన చొంగ కార్చుతున్న పశువు - చెట్ల నీడలో సేదతీరుతున్న ఆవులు

తక్కువ నీటితోనే అధిక దిగుబడులు సాధించిన

గోదావరి వరి రైతులు... శ్రీ సేద్యం



మర్ల సోమసుందర్
ప్రధాన శాస్త్రవేత్త
(బయోటెక్నాలజీ)
ఇండియన్ కౌన్సిల్ ఫర్



వరి సాగులో నిత్యం నీరు నిలబడాలని, లేనిచో అధిక దిగుబడులు కష్టమని సాధారణంగా భావిస్తాము. గత సంవత్సరంలో వర్షాలు తగినంతగా పడకపోవటం వలన ఎగువన మహారాష్ట్రలో గోదావరిలోకి నీరు చాలినంతగా చేరలేదు. రాజమండ్రి దవళేశ్వరం బ్యారేజీ వద్ద నీరు సమృద్ధిగా చేరకపోవటంతో ఉభయ గోదావరి జిల్లాల్లోని వరి సాగుకు రబీ సీజన్‌లో నీటి సరఫరా ప్రశ్నార్థకమే అయింది.

ఉభయ గోదావరి జిల్లాల్లో గోదావరి నీటితో దాదాపు 9 లక్షల ఎకరాల్లో రబీలో వరి సాగవుతుంది. గత సంవత్సరం నవంబరు నాటికి దీనిలో 70 శాతం ఆయకట్టుకు మాత్రమే నీరివ్వగలమని ప్రభుత్వ నీరు పారుదల శాఖ భావించింది. సాధారణంగా 120 నుండి 130 టి.ఎమ్.సి ల నీటితో సాగయ్యే ఆయకట్టు వరి సాగు కేవలం 80 టి.ఎమ్.సి లతోనే సర్దుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాగా రైతాంగం, లాకు కమిటీలు, నీటి పారుదల శాఖ, సమిష్టి కృషితో ఉన్న నీటినే సద్వినియోగం చేసుకొని పరిస్థితినుండి గట్టెక్కగలిగారు. దవళేశ్వరం బ్యారేజీకి దిగువన తూర్పు గోదావరిలో వెలిచేరు, అత్తిగపాడు, వేమగిరి, వానపల్లిలోను, పశ్చిమ గోదావరిలో దొంగవారి పాలెం వద్ద గోదావరిలో నీటిని ఎత్తిపోశారు మోటార్ల సహాయంతో మండలాల్లో రైతులు ఒప్పందం ప్రకారం వంతుల వారీగా నీరు పంచుకొన్నారు. జనవరి - ఫిబవరి ప్రాంతాల్లో వరి పంట పొట్టమీదున్న సమయంలో సీలేరు విద్యుత్ రిజర్వాయరులో నిల్వ ఉంచిన నీటిలో 8 టి.ఎమ్.సిల వరకు నీరు మళ్ళించి. మరీ వరి పంటను కాపాడుకోగలిగారు.

ఫలితంగా ఈ రోజు వరి సాగు చేసిన రైతులందరూ ఎకరానికి 45 నుండి 50 బస్తాలు (70 బస్తాలు) దిగుబడి సాధించుకోగలిగారు. రైతాంగం ఆనందముగా ఉన్నారు. ఎలా సాధ్యపడింది?

వరి సాగులో నారు మళ్ళనుండి కోతలకు ఒక వారం ముందు వరకు పొలంలో 15 అంగుళాల వరకు నీరు నిల్వ ఉండాల్సింది. లేనిచో మంచి దిగుబడులు రావని రైతాంగం భావిస్తారు. కానీ వరి సాగుకు అధిక నీరు కావల్సి ఉన్నా, నిత్యం నీరు నిలవ బెట్టనక్కరలేదు. నీటిని అత్యవసరమైన పెరుగుదల దశల్లో (నారు, పిలకలు తొడిగే, పొట్టమీదుండి, వెన్ను వేసేటప్పుడు, పాలు పోసుకొని గింజ గట్టి పడేటప్పుడు) తప్పని సరిగా నీరు అందిస్తూ, ఆరు తడి పంటలు వలె సాగు చేయవచ్చును. సరిగ్గా రైతాంగం ఇష్టపడక పోయినా అదే జరిగింది. ఫలితంగా సాధారణంగా నీరు నిల్వబెట్టిన సాగుకంటే దఫదఫాలుగా 'ఆరుతడి' పద్ధతిలో సాగిన సాగుతో అధిక దిగుబడి లభించింది.

పరిమితమైన నీటి లభ్యతతో కూడా వరిసాగును అధిక దిగుబడులతో సాగే లాభదాయక 'శ్రీ' (Sri) సాగు గురించి తెల్సుకుందాం.

శ్రీసాగు

శ్రీ (సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్, Sri) ను ప్రథమంగా ఫాదర్ హెన్రీడీలేలానీ మెడగాస్కర్ దేశంలో రూపొందించారు.

సాధారణంగా వరిసాగులో ఎప్పుడూ నీరు నిల్వ ఉంటుంది. ముఖ్యంగా మనం అర్థం చేసుకోవల్సినది. వరి నీటిలో బ్రతికేదయినా, నీటి మొక్క (అక్వాటిక్) కాదు. నీరు పొలంలో ఎల్లప్పుడూ నిల్వ ఉంచటంతో ఆశించిన పెరుగుదల ఉండదు. నీరు నిత్యం నిల్వ ఉండటంతో వేళ్ళకు కావల్సిన ఆక్సిజను (గాలి) లభించక 70 శాతం వరకు వేళ్లు కుళ్ళిపోతాయి. ఫలితంగా మొక్కకు కావల్సిన పోషకాలు లభించక పెరుగుదల ఆశించిన విధంగా లేక దిగుబడులు తగ్గిపోతాయి. అధిక వ్యయంతో వినియోగించిన ఫాస్పరస్ (డిఎపి) వంటి ఎరువులు సైతం నీటిలో వృధాగా కొట్టుకు పోతాయి.

కాగా శ్రీసాగులో నీరు దఫదఫాలుగా ఇచ్చి, పొలాన్ని ఆరబడుతూండటం వలన వేళ్ళు బలంగా, లోతుకు చొచ్చుకొని పోయి పోషకాలను అధికంగా నేలనుండి పీల్చుకొంటాయి. కలుపు కూడా తక్కువ. శ్రీ సాగు, ఒక వరి వంగడానికి పరిమితంకాదు సాంబమషూరి, తెల్లహంస, మార్టేరు 1010, తెల్లహంస, స్వర్ణ వంటి రకాలతో అధిక దిగుబడులు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో సాధింపబడినవి. శ్రీసాగులో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఉదాహరణకు ఎకరానికి సాధరణంగా వినియోగించి 25 కిలో గ్రాముల విత్తనానికి బదులు

వేసవిలో పాల ఉత్పత్తి తగ్గకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ యం. కాశిరెడ్డి, డా॥ సిహెచ్. వరప్రసాదరావు,
యం.వి. కృష్ణాజీ, యం. రవివెంకన్నబాబు
కృషి విజ్ఞాన కేంద్రం, దరిశి, ప్రకాశం జిల్లా.



వేసవిలో పాడి పశువుల్లో పాల దిగుబడి, గ్రామాలలో పాల సేకరణ తగ్గుతాయి. డెయిరీలో పాలకు పాలపొడి కలిపి టోన్డ్‌పాలు తయారీచేసి వినియోగదారులకు సరఫరా చేస్తారు. ఈ కొరతను అవకాశంగా తీసుకొని కొందరు సింథటిక్ పాలు తయారు చేసి మార్కెట్లో అమ్ముతారు.

వేసవిలో పాలు తగ్గటానికి కారణాలు :

ఈనే పశువుల సంఖ్య తగ్గుతుంది. పచ్చిగడ్డి కొరత మూలంగా పోషక విలువలు లేని వరిగడ్డి లాంటి ఎండు మేతలు ఎక్కువగా వాడతారు. తాగునీరు లభించడం కూడా కొన్ని ప్రాంతాలల్లో కష్టం. మండుటెండలలో పశువులలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. అంతర పరాన్నజీవుల ఉధృతి పెరుగుతుంది. పాల దిగుబడులు మరియు పాలు ఉత్పత్తి తగ్గుతాయి.

పాల దిగుబడి తగ్గకుండా చర్యలు :

మెట్టప్రాంత రైతులు తమ బోర్లు, బావులు కింద స్వల్ప నీటి తడులతో సాగుచేయుటకు అనువైన స్వల్పకాలిక ఏకవార్షిక రకాలు ఎస్.ఎస్.జి 59-3 హర్యానా జొన్నరకాలు, రాజ్‌కో బాజ్రా, ఆఫ్రికన్

---

2 కి.గ్రా సరిపోతుంది. అలాగే నారును 25 నుండి 30 రోజుల వయస్సులో కాక, కేవలం 8 నుండి 12 రోజుల వయస్సు నారును కుదురుకు ఒక్కొక్క మొక్కనే నాటాలి.

ఈ క్రింది పట్టికలో వివిధ సాగు అంశాలు విశదీకరింపబడినది.

సాధారణ సాగు

1. ఎకరానికి 20 నుండి 25 కి గ్రా. విత్తనం అవసరం
2. 25 నుండి 30 రోజుల వయస్సు నారు ఉపయోగిస్తారు.
3. నారుని ప్రధాన పొలంలో దగ్గర దగ్గరగా నాటుతారు. చదరపు మీటరుకు ఖరీఫ్‌లో 33 మొక్కలు, రబీలో 44 మొక్కలు, కుదురుకు 2 లేక 3 చొప్పున దట్టంగా నాటుతారు.
4. ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడుతారు.
5. ఎప్పుడూ నీరు నిల్వబెడ్తారు పొలంలో
6. కలుపు ఎక్కువ. కూలి ఖర్చులు ఎక్కువ.

శ్రీ సాగు

1. ఎకరానికి 2 కి.గ్రా. (రెండు) విత్తనం చాలు
2. కేవలం 8 నుండి 12 రోజుల వయస్సు గల నారుని వాడాలి. నారుని సున్నితంగా మట్టితో సహా పీకి నెమ్మదిగా జాగ్రత్తగా నాటాలి.
3. ఎటుచూసినా 25 సెం.మీ ఉండేలా, కుదురుకు ఒక మొక్క వచ్చేలా, చ.మీ వైశాల్యంలో 16 మొక్కలు ఉండేలా నాట్లు వేయాలి.
4. రసాయనిక ఎరువుల కంటే అధిక పాళ్ళలో సేంద్రీయ (పశువుల పెంట లేక కంపోస్టు) ఎరువులను విధిగా వాడాలి.

కలుపు తీసే సాధనం

5. నీరు దఫదఫాలుగా ఇస్తూ, నేల తడిగా ఉండేలా మొత్తం తడులు మొక్క పెరుగుదలలో ముఖ్యమైన సమయాలకు ఇవ్వాలి..
6. హేండు వీడరు ఉపయోగించి (మనిషి పొలంలో దొర్లించుకుంటూ వెళ్ళే చక్రం) కలుపు నివారించాలి. రసాయన కలుపు మందులువాడరు. ✧

టాల్ యొక్క జొన్న వగైరాలకు విత్తుకొని, సకాలంలో కోసి కత్తిరించి పశువులకు మేపొచ్చు. అదే విధంగా పప్పుజాతి గ్రాసాలైన అలసంద, పిల్లి పెసర మొదలైన వాటిలో మేలైన రకాలు సాగుచేసి, సకాలంలో కోసి, వాడవచ్చు.

సుబాబుల్, అవిసెలాంటి చెట్ల లేత కొమ్మలను కోసి మేప వచ్చును. ఈ చెట్లు ఆకుల్లో 10 నుండి 12 శాతం మాంస కృత్తు లుంటాయి.

వరిగడ్డి చొప్పలు ఎక్కువ పరిమాణంలో వాడాల్సి వస్తే, యూరియా ద్రావణ పిచికారి చేసి బాగా ఆరిన తరువాత మేపవచ్చు. దీనివలన పోషక విలువలు బాగా పెరుగుతాయి. వరిగడ్డిపై 60 లీటర్ల నీటిలో 4 కిలోల యూరియా కలిపి పిచికారి చేసి మాగవేస్తే, పోషక విలువలు లేని వరిగడ్డిలో 5 శాతం మాంసకృత్తులు లభిస్తాయి.

కొన్ని సందర్భాలలో పశువులకు తాగునీరు లభించడం కూడా కష్టమవుతుంది. ఇలాంటి పరిస్థితులలో పశువులకు రోజుకు 3 సార్లు వాటి వసతివద్దనే నీరు ఏర్పాటు చేయాలి. అజొల్లా కూడా ఉత్పత్తి చేసి దాణాకు ప్రత్యామ్నాయంగా పశువులకు వాడవచ్చు.

వాతావరణ ఉష్ణోగ్రత 10 డి.ఫా. పెరిగితే వెన్నశాతము 0.1 నుండి 0.2 శాతం తగ్గే అవకాశముంది. కాబట్టి పశువుల గొట్టాలపై మధ్యాహ్నం నీరుచల్లడం, పశువుల షెడ్లలో పంకాలు, ఫాగర్స్ ఏర్పాటు చేయడం, పశువుల శరీరంపై గోనె సంచులు కప్పి తరుచుగా నీరు చల్లడం, గేదెలను కుంటల్లో నీటి మడుగుల్లో కొంతసేపు ఉంచడం వగైరా చర్యలు చేపట్టడం ద్వారా పశువులపై వసతి ప్రభావం తగ్గించ వచ్చు. అంతర పరాన్నజీవుల నిర్మూలనకు మందులు వాడడం. గొంతువాపు లాంటి అంటువ్యాధుల నివారణ టీకాలు వేయడం మేలు. పితికిన పాలను క్యాన్లలోపోసి, క్యాన్ల చుట్టూ గోనెసంచులు చుట్టి తడిపి చల్లని వాతావరణం కల్పిస్తే పాల నాణ్యత దెబ్బతినదు. పాలు చెడిపోకుండా వుంటాయి. వీలైనంత త్వరగా పాలను శీతలీకరణ కేంద్రాలకు చేర్చడం ఉత్తమము.

పాలకొరత నివారణ చర్యలు :

ఆంధ్రప్రదేశ్‌లో పాడి గేదెల సంఖ్య ఎక్కువ. వాటిపై వాతావరణ ప్రభావం ఎక్కువ. వేసవిలో ఈనే గేదెలు తక్కువ. ఆవులు సంవత్సరం పొడవునా ఈనుతాయి. వేసవిలో గేదె పాల ఉత్పత్తి తగ్గుతుంది. వాతావరణం తీవ్రత వలన గేదెలు ఎదకు రాకపోవడం, మూగ ఎద వగైరా సమస్యలను ఎదుర్కొంటాం. పశుపోషకాలు జూన్, జూలై మాసాలలో చూడికట్టినా శ్రద్ధ తీసుకొంటే గేదెలు వేసవిలో కూడా ఈనుతాయి. వేసవి పాడి పశుపోషకునికి లాభసాటిగా ఉంటుంది. ఆవులు సంవత్సరం పొడవునా వేసవిలో కూడా ఈనడం వలన, వేసవిలో కూడా ఆవుపాలు సాధారణంగా లభిస్తాయి.

పశుగ్రాసాల లభ్యత :

వేసవిలో పశుగ్రాసాల లభ్యత తగ్గుతుంది. వర్షకాలం గ్రాసాలు సమృద్ధిగా లభిస్తాయి. వేసవిలో ఎదురవుతున్న గ్రాసాల కొరతను దృష్టిలో పెట్టుకొని వానకాలం, చలికాలం మేతనిచ్చే పంటలు సాగుచేసుకొని సకాలంలో కోసి, మాగుగడ్డిగా (సైలేజి) ఎండు గడ్డిగా నిల్వచేసుకోవడము అవసరము. దాని కొరకు ముందే పశుపోషకులు ప్రణాళిక రూపొదించుకొని అమలు పరుచుకోవాలి.

లేగదూడల సంరక్షణ మరియు వాటి యాజమాన్యంలో మెళుకువలు

పాడి పరిశ్రమ అభివృద్ధికి దూడల పెంపకం పునాది లాంటిది. నేటి లేగదూడలు రేపటి పెయ్యలు. రేపటి పెయ్యలే రోబోయే తరం పాడి పశువులు. పశుపోషణలో మిగిలేది దూడ - పేడ అని మన పెద్దవారు అనుభవంతో చెప్పి దూడల పోషణకు ఇవ్వవలసిన ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తుంటారు. పాడి - పరిశ్రమ లాభాల బాటలో నడవాలంటే శాస్త్రీయ పద్ధతిలో లేగ దూడల పోషణ చేపట్టి, అధిక పాల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పశువులను అభివృద్ధి చేసుకోవాలి. ఎక్కువ వ్యయ ప్రయాసలతో పాడి పశువులను కొనుగోలు చేసుకునే బదులు, మేలు జాతి పెయ్యదూడలకు సరియైన పోషణ అందించినట్లైతే చౌకలో మంచి పాడి పశువులను పొందవచ్చు.

దూడ పోషణ పశువు గర్భములో నుండే ప్రారంభించాలి. పశువు ఆరు నెలల గర్భముతో ఉన్నప్పటి నుండి దూడ పోషణ కొరకు అధికంగా రెండు కిలోల దాణా మేపితే దూడ బలంగా ఆరోగ్యంగా పుడుతుంది. పశువు తొమ్మిదవ నెల చూడితో ఉన్నప్పుడు నట్టల నివారణ మందును ఇచ్చినట్లైతే దూడలకు నట్టలు సోకకుండా కాపాడుకోవచ్చు.

దూడ పుట్టిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- పశువు ఈనే ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలి. నేలపై మెత్తటి గడ్డిని పర్చి ఉంచితే మంచిది.
- దూడ పుట్టినే వెంటనే ముక్కు రంధ్రాలు మీద ఉన్న పొరను మరియు నోటిలోని జిగురును తుడిచి శ్వాస ఆడేటట్లు చేయాలి.

శ్వాస ఆడకపోతే రొమ్ముభాగం మీద మర్ధన చేయాలి. ఒక్కోసారి లేగదూడ ముందు కాళ్ళ బదులు వెనుక కాళ్లు ముందుగా బయటకు వచ్చే పొజిషన్‌లో ఈనినప్పుడు, తల్లి శరీరంలోకి ద్రవాలను దూడలు సంగ్రహించే ప్రమాదముంది. ఆ సమయంలో దూడ వెనుక కాళ్లను గాలిలోకి పైకియెత్తి తలక్రిందకు చేయటం ద్వారా దూడ శ్వాసకోశ నాళాల్లోకి, పొట్టలోనికి చేరిన ద్రవాలు ముక్కు ద్వారా బయటకు వస్తాయి. తద్వారా దూడ శ్వాస సరిగా తీసుకొంటుంది.

- ✧ సాధారణంగా ఈనగానే తల్లి, దూడ శరీరాన్ని నాకి శుభ్రం చేస్తుంది. అలా కాని పక్షంలో శుభ్రమైన గోనే పట్టాతో గాని లేదా ఎండు గడ్డితోగానీ శరీరంపై రుద్ది శుభ్రం చేయాలి.
- ✧ పుట్టిన గంటలోపే దూడకు జున్నుపాలు త్రాగించి, జున్నుపాలు త్రాగిన గంటలోపు విరోచనం కాకపోతే ఎనీమా చేయుట మంచిది.
- ✧ దూడ పుట్టిన వెంటనే కాళ్ళగోళ్ళు గిల్లి వేయాలి.
- ✧ బొడ్డు నరానికి దారంకట్టి, కొత్త బ్లేడుతో గాని, కత్తెరతోగానీ పొడవుగా వ్రేలాడుతున్నా బొడ్డునరంకోసి టింక్చర్ అయోడిన్ పూయాలి. ధనుర్వాతం రాకుండా వెంటనే దూడకు టి.టి. ఇంజెక్షన్ కూడా ఇస్తే మంచిది.
- ✧ పుట్టిన 4వ రోజు విటమిన్ 'ఎ' 2 యం.యల్. ఇవ్వటం మంచిది.

జున్నుపాల ప్రాముఖ్యత :

దూడ పుట్టిన తర్వాత లేచి నిల్చున్న వెంటనే లేదా గంటలోపు జున్నుపాలు త్రాగించాలి. త్రాగించడం ఆలస్య మైనట్లయితే దూడకు జున్నుపాలలో గల యాంటిబాడీలను జీర్ణించుకొనే శక్తి తగ్గిపోతుంది. కొందరు మాయ వేసేంత వరకు జున్నుపాలు త్రాగించరు. ఇది మంచి పద్ధతి కాదు. దూడకు పాలు ఇచ్చేటందుకు తల్లిపాలు చేపుకొనేటందుకై ఆక్సిటోసిన్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. కావున దానివలన మాయ కూడా తొందరగా పడిపోతుంది. జున్నుపాలలో అధిక మోతాదులో తేలికగా జీర్ణమయ్యే మాంసకృత్తులు, విటమిన్ 'ఎ' మరియు వ్యాధినిరోధక శక్తిని కలిగించే యాంటి బాడీలు ఉంటాయి. ఈ యాంటి బాడీస్ దూడలకు దాదాపు అయిదు నెలల వయస్సు వరకు రోగ నిరోధక శక్తిని కలిగించి దూడ త్వరగా పెరగటానికి ఉపయోగపడతాయి.

ఈనిన పశువు మరణించిన సందర్భాలలో దూడ స్వయంగా పాలు త్రాగలేని సందర్భాలలో లేదా ఏ ఇతర కారణాల వల్లనైనా దూడలకు జున్నుపాలు లభ్యంకాని పరిస్థితులలో "కృత్రిమ జున్ను పాలు" తయారుచేసి త్రాగించాలి. ఒక లీటరు పాలు, మూడు కోడిగ్రుడ్లు, మూడు టీస్పూన్‌ల కాడ్‌లివర్ ఆయిల్, నాలుగు స్పూన్‌ల ఆముదము కలిపిన మిశ్రమాన్ని రోజుకు మూడుసార్లు దూడలకు త్రాగించాలి. అలాగే తల్లి నుండి సీరం సేకరించి దూడలకు ఇంజెక్షన్ చేయించాలి.

దూడల ఆహారం :

దూడకు తన శరీర బరువులో పదవ వంతు పాలు త్రాగించుట అవసరం. అంటే 3 నెలల వయస్సు వచ్చేవరకు రోజుకు కనీసం 3-4 లీటర్ల పాలు త్రాగించాలి. 3 నెలల వయస్సు వచ్చిన తర్వాత దూడకుపాలు త్రాగించవలసిన అవసరం లేదు.

గడ్డి, దాణా మీద పోషించవచ్చు. పాలు చేపడానికి దూడలను వదిలే అలవాటు ఉన్న పశువులలో పునరుత్పత్తి ఆలస్యమవుతుంది. దూడలను మొదట్లోనే తల్లిదగ్గర నుంచి వేరుచేసి పోలను విడిగా పాత్రలలో త్రాగించినట్లయితే పశువుల త్వరగా యదకు వస్తాయి. ఈనిన తర్వాత 90 రోజుల్లో గర్భాధారణ చేయించనచో పశువుల్లో చూడికట్టే శాతం కూడా ఎక్కువగా ఉంటుంది.

- ✧ దూడలకు పాలు మొదటి వారం రోజుల్లో రోజుకు మూడుసార్లు, తర్వాత రెండు సార్లు త్రాగించాలి. పారుడు లక్షణాలు కనిపిస్తే పాలు తగ్గించాలి.
- ✧ యాంటి బయాటిక్ మందులు దూడ పుట్టిన మొదటి వారంలోనే వరుసగా 3.5 రోజులు పాలతోగాని లేక మజ్జిగతో గాని త్రాగిస్తే పారుడు రోగం రాదు.
- ✧ దూడ పాలు త్రాగిన తర్వాత మూతికి కొంచెం ఉప్పు రాయటం మంచిది. మట్టి తినకుండా దూడకు నోటికి చిక్కం పెట్టాలి.

దూడలకు ప్రత్యేక దాణా :

దూడలకు త్వరగా జీర్ణమయ్యే మరియు పెరుగుదలకు కావలసిన పోషక పదార్థాలను అందించగల దాణాను 2 వారాల వయస్సు తర్వాత మేపవచ్చు. కొంచెం దాణా నాలుక మీద రాస్తే అది క్రమంగా దాణాకు అలవాటు పడుతుంది. దూడల దాణాలో D.C.P- 20 శాతం, T.D.N- 70శాతం ఉండాలి. దూడల దాణాలో ఎక్కువ మాంసకృత్తులు, తక్కువ పీచు పదార్థాలు ఉండాలి. దూడలకు దాణా ఈ వయస్సులో అందివ్వటం ప్రారంభించుట వల్ల జీర్ణకోశ వ్యాధులు సోకే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

దూడలకు దాణాను ఈ క్రింద చూపిన పదార్థాలను ఆయా పాళ్లలో కలిపి తయారు చేసుకోవచ్చును.

1. జొన్నలు, మొక్క జొన్నలు మొదలగు ధాన్యము: 40 పాళ్లు
2. వేరుశనగ పిండి : 30 పాళ్ళు
3. తవుడు : 10 పాళ్ళు
4. చేపల పొడి : 7 పాళ్ళు
5. బెల్లపు మడ్డి : 10 పాళ్ళు
6. ఖనిజ లవణ మిశ్రమాలు : 3 పాళ్ళు

✧

అమెరికా అడుగుపెట్టడంతో... ప్రమాదంలో పడనున్న క్యూబా వ్యవసాయం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి
అఖిల భారత అభ్యుదయ వేదిక
జాతీయ కార్యదర్శి
సెల్ : 9490204545

సోషలిస్ట్ క్యూబా లో 'సుస్థిర వ్యవసాయం' కొనసాగుతున్నది. ఇప్పుడు అమెరికా - క్యూబా సంబంధాలు సడలించబడ్డాయి. వీటి అమలుతో క్యూబా వ్యవసాయం, పెద్ద 'పారిశ్రామిక వ్యవసాయం'గా మారే ప్రమాదముంది. 2016 మార్చ్ నెలలో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, మంది మార్బలంతో క్యూబా "ఉల్లాసయాత్ర"కు వెళ్ళి వచ్చారు. ఈయాత్ర ప్రపంచ పరిశీలకుల ఆలోచనలను, ఉత్సాహాన్ని, వేడిని పెంచింది. అమెరికా - క్యూబా సంబంధాల సాధారణీకరణ క్యూబాలో అమెరికా పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని, క్యూబా ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందుతుందని, క్యూబన్ల జీవన పరిస్థితి మెరుగుపడుతుందని (ఇప్పుడు అధ్వాన్నంగా ఉన్నట్లు!) ఇరు దేశాల ప్రజలు విశ్వసించారు.

జీవావరణ వ్యవసాయం (ఆగ్రోఎకాలజి) :

1970 వ దశకం చివరి సం.రాలలో లాటిన్ అమెరికాలో జీవావరణ వ్యవసాయం (ఆగ్రోఎకాలజి) ప్రారంభించబడింది. ఇది కాలుష్యాన్ని నివారించి, పర్యావరణాన్ని కాపాడే వ్యవసాయ పద్ధతి. పర్యావరణాన్ని పాడుచేసి భూమండలాన్ని వేడెక్కించేసాంకేతిక, ఆధునిక పారిశ్రామిక వ్యవసాయానికి భిన్నమైనది. జీవావరణ వ్యవసాయంలో సుస్థిర విధానాలను వినియోగిస్తారు. ఆధునిక పాశ్చాత్య పరిజ్ఞానం, సాంప్రదాయక ప్రావీణ్యతల మేలుకలయిక ఈ పద్ధతి. ఒక్కమాటలో చిన్న, సన్నకారు రైతులతో స్థానిక, సాంప్రదాయక వ్యవసాయ ఉత్పత్తులను అధిక మోతాదులో సాధించే ఉత్తమ వ్యవసాయ పద్ధతి. 1991లో తన ఆర్థిక భాగస్వామి సోవియట్ యూనియన్ పతనమయిన తర్వాత క్యూబా ఈ పద్ధతిని ఒక అవసర మైన వ్యవసాయ పద్ధతిగా అభివృద్ధి చేసు కుంది. ఫలితంగా క్యూబా వ్యవసాయం ప్రపంచానికే తలమానిక మైన జీవావరణ వ్యవసాయంగా రూపుదిద్దుకుంది. పర్యావరణానుకూల వ్యవసాయం లాటిన్ అమెరికాలో చిన్నకారు గ్రామీణ రైతులకేగాక పట్టణ వ్యవసాయ దారులకు కూడా సంతృప్తికరమైన ఆర్థిక, పర్యావరణ, సామాజిక, రాజకీయ మార్పులకు, లాభాలకు కారణ మయింది. ఈ వ్యవసాయం క్యూబాలో కూడా విస్తృత ప్రాతిపదికన సుస్థిర వ్యవసాయానికి, ఆర్థిక, సామాజిక మార్పులకు అవకాశాలను కల్పించింది. తక్కువ పెట్టు బళ్ళతో ఆరోగ్యకరమైన ఆహారపదార్థాల అధిక శాతం ఉత్పత్తి సాధ్యపడింది. దీనితో స్థానిక స్వావలంబన, ప్రకృతి వనరుల పరిరక్షణ, పునరుత్పత్తి సాధించబడ్డాయి. రైతు సంఘాలు బలోపేతమయ్యాయి. మోసపూరిత వ్యవసాయవ్యాపారాలను సృష్టించిన నూతన ఉదారవాద, ఆధునిక విధానాలను సవాలు చేశాయి. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను పెంచాయి. లాటిన్ అమెరికా వ్యవసాయ సమాజాలకు కొత్త రాజకీయ రహదారులు తెరవబడ్డాయి. పర్యావరణ వ్యవసాయ పద్ధతిలో క్యూబా సాధించినంత విజయాన్ని ప్రపంచంలో ఏ దేశమూ సాధించలేదు. 1988 నుండి 1994 వరకు క్యూబాలో పంటల ఉత్పత్తి చాలా తక్కువగా ఉండేది. పర్యావరణ అనుకూల వ్యవసాయం మొదలు పెట్టిన తర్వాత 1994 నుండి 2007 వరకు ఆహారోత్పత్తి బాగా పెరిగింది. అంతే కాదు ఈ మధ్య కాలంలో వ్యవసాయ రసాయనాల వాడకం కూడా విపరీతంగా తగ్గింది. ఈ వివరాలను ఈ క్రింది పట్టికలో పరిశీలించ గలరు.

పంటల దిగుబడి, వ్యవసాయ రసాయనాల ఉపయోగంలో మార్పులు

పంట	ఉత్పత్తి శాతంలో మార్పు		వ్యవసాయ రసాయనాల ఉపయోగశాతంలో మార్పు
	1988 నుండి 1994నుండి	1994వరకు 2007వరకు	1994నుండి 2007వరకు
కూరగాయలు	-65	-145	-72
చిక్కుడు కాయలు	-77	-351	-55
వేళ్ళు, దుంపలు	-42	-145	-85

క్యూబాలో వ్యవసాయ విప్లవం :

1959 లో క్యూబా విప్లవం తర్వాత అనేక దశాబ్దాల వరకు సామ్యవాద దేశాల కూటమి క్యూబాకు వాణిజ్యపరంగా చేదోడు వాదోడుగా నిలిచింది. 30% వ్యవసాయ భూమిలో చెరుకు పండించి ఎగుమతి చేసేవారు. క్యూబా 'ప్రపంచ పంచదార పాత్ర' అని పేరు గాంచింది. 57% ఆహారపదార్థాలను దిగుమతి చేసుకునేవారు. రైతులు ఎక్కువ ట్రాక్టర్లను ఉపయోగించేవారు. పురుగు మందులు, ఎరువులు అధికంగా వాడేవారు. ఇవన్నీ సోవియట్ కూటమి దేశాల నుండి సరఫరా అయ్యేవి. 1980ల నాటికి వ్యవసాయ తెగుళ్ళు పెరిగాయి. భూసారం తగ్గింది. వరి లాంటి ప్రధాన పంటల దిగుబడి తగ్గుముఖం పట్టింది. 1990లలో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, ఆ కూటమితో వ్యాపారం పతనమయింది. ట్రాక్టర్ల, యంత్ర విడి భాగాల,

పురుగు మందుల, ఎరువుల, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి ఆగిపోయింది. ఆహారోత్పత్తులు కుప్పకూలి పోయాయి. లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల కంటే కూడా క్యూబా సగటు ఆహారోత్పత్తి దిగజారిపోయింది. అప్పుడు క్యూబా రైతులు, క్యూబా శాస్త్రజ్ఞుల సాయంతో జీవావరణ వ్యవసాయ పద్దతులను పాటించడం మొదలు పెట్టారు. పెట్రోలు, విడిభాగాలు లేక ఆగిపోయిన ట్రాక్టర్ల స్థానాన్ని వేల సంఖ్యలో ఎద్దులు ఆక్రమించాయి. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువుల వాడకం, రసాయన పురుగు మందులకు బదులు జీవావరణ పురుగుమందుల వాడకం మొదలయింది. ఇదే సమయంలో క్యూబా విధాన కర్తలు కొత్త వ్యవసాయ పద్దతులను, వికేంద్రీకరణ విధానాలను అమలుచేశారు. ఇవి కొత్త ఉత్పత్తి ప్రక్రియలను ప్రోత్సహించాయి. దీనితో రైతులు బృందాలుగాఏర్పడి, ఉమ్మడిగా పంటలు పండించి, సామూహిక, సహకార పద్దతిలో మార్కెట్లకు సరఫరా చేసే విధానాన్ని అలవాటు చేసుకున్నారు. రైతుల ఆర్థిక స్థాయి పెరిగింది. విదేశాల నుండి దిగుమతి చేసుకునే రసాయన ఉత్పాదకాల మీద, పరికరాల మీద క్యూబా వ్యవసాయం అధార పడడం ఆగిపోయింది. ఫలితంగా ఆహారోత్పత్తి తిరిగి పుంజుకుంది. 1996 నుండి 2005 వరకు క్యూబా లో సగటు ఆహారోత్పత్తి 4.2% వార్షిక అభివృద్ధిని చవి చూసింది. ఈ సమయంలో లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలలో ఆహారోత్పత్తి స్థంభించింది.2000 సం.రాల మధ్య కాలానికి పని కోల్పోయిన ప్రభుత్వ సంస్థలను వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉపసంహరించింది. వ్యర్థంగా ఉన్న ప్రభుత్వాధీనంలోని పొలాలను రద్దు చేసింది. పట్టణ, పట్టణ శివార్లలో 2,600 నూతన లఘు వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటును ఆమోదించింది. నిరుపయోగంగా పడి ఉన్న 30 లక్షల హెక్టార్ల (75 లక్షల ఎకరాల) ప్రభుత్వ భూములలో వ్యవసాయానికి అనుమతి నిచ్చింది. 1990 ల ఆర్థిక సంక్షోభ సమయంలో వెలుగులోకి వచ్చిన పట్టణ ఉద్యానవనాలు ప్రధాన ఆహార వనరులుగా తయారయ్యాయి. ఈ రోజు క్యూబాలో 50,000 హెక్టార్ల (1,25,000 ఎకరాల) నిరుపయోగంగా ఉండిన భూమిలో 383,000 పట్టణ వ్యవసాయ క్షేత్రాలు అభివృద్ధి చెందాయి. వీటిలో 15లక్షల టన్నుల కూరగాయలు పండుతాయి. అత్యధిక ఉత్పాదక సామర్థ్యం గల పట్టణ వ్యవసాయ క్షేత్రాలలో, ఎలాంటి కృత్రిమ రసాయనాలు వాడకుండానే, ప్రతి చ.మీ. కు 20 కిలోల ఆహారం పండుతుంది. ఇది ప్రపంచం లోనే అత్యధిక దిగుబడి. హవానా, విల్లా క్లారా వంటి నగరాలలో ఉపయోగించే 50 నుండి 70 శాతం తాజా కూరగాయలను ఈ పట్టణ క్షేత్రాలు అందిస్తాయి.

అమెరికా సంబంధాలతో నష్టం :

క్యూబా వ్యవసాయంలో అమెరికా పెట్టుబడులు మేలుకు బదులు చేటు చేస్తాయి. ఇప్పుడు అమెరికా వ్యవసాయ - వాణిజ్య సంస్థలతో సంబంధాలను జాగ్రత్తగా నిర్వహించకపోతే క్యూబా వ్యవసాయం యాంత్రిక, పారిశ్రామిక స్థితికి దిగజారే అపాయముంది. ఈ పద్ధతిలో యంత్రాలను విరివిగా వాడుతారు. రసాయనిక ఎరువుల, మందుల ఉపయోగమెక్కువ. జన్యుపరివర్తిత పంటలు సాంప్రదాయ పంటలను రూపుమాపుతాయి. దీనితో తాము సాధించిన విప్లవాత్మక లాభాలు శూన్యమై రైతులు యథాస్థితికి చేరుకుంటారు.

విదేశీ మార్కెట్ల ప్రవేశంతో నష్టాలు :

2014లో 'క్యూబా కోసం అమెరికా వ్యవసాయ అధికార కూటమి' ఆరంభించారు. అమెరికా - క్యూబా వాణిజ్య నిషేధాన్ని ఎత్తి వేయడం దీని ఉద్దేశ్యం. వందకు పైగా వ్యవసాయ సంస్థలు, వాణిజ్య బృందాలు ఇందులో పాల్గొన్నాయి. మిగిలిన క్రమబద్ధీకరణలను సరళీకరిస్తే, వాణిజ్య ప్రతిబంధకాలను తొలగిస్తే క్యూబాకు అమెరికా వ్యవసాయ ఎగుమతులు 120 కోట్ల డాలర్లకు చేరుకుంటాయని విశ్లేషకులు అంచనా వేశారు. క్యూబా వ్యవసాయ మార్కెట్‌ను అమెరికా వ్యవసాయ వాణిజ్య రంగం స్వాధీనం చేసుకోవాలను కుంటున్నది. 2014 డిసెంబర్‌లో అమెరికా - క్యూబా సంబంధాలు కొంత సరళీకరించబడ్డాయి. విదేశీ మార్కెట్లు కొంత మేరకు క్యూబాలో అడుగు పెట్టాయి. 2015, నవంబర్‌లో అమెరికా వ్యవసాయ కార్యదర్శి టామ్ విల్సాక్ అమెరికా పార్లమెంటు అలబామా (మహిళా) ప్రతినిధి టెర్రీ సెవెల్ హవానా వ్యవసాయ దారుల సంత ను సందర్శించి, పర్యటించారు. తమ పంటలను, వ్యవసాయోత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయమని, విదేశీయుల పర్యాటక (జ్ఞానోల్లాస) మార్కెట్లకు తరలించమని విపరీతంగా ఒత్తిళ్ళు పెరిగాయి. ఉత్పత్తిలో అధిక భాగం దేశ ప్రజలకు, స్థానిక మార్కెట్లకు అందుబాటులో లేకుండా పోయింది. పర్యాటకుల ఆహారావసరాలను తీర్చడానికి తరలించబడుతున్నది. వారికోసం వారికి అనుకూలమైన సేంద్రీయ ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయమని ఒత్తిడి చేస్తున్నారు. తమ వస్తువులను క్యూబాలో అమ్ముకోవడానికి అమెరికా వాపార రంగానికి తలుపులు బార్లా తెరవాలని అమెరికా అధ్యక్షుడు ఒబామా ఆశిస్తున్నారు. మార్చ్, 21న ఆయన క్యూబాను సందర్శించిన సందర్భంగా హవానాలో అమెరికా వ్యవసాయ కార్యదర్శి టామ్ విల్సాక్ క్యూబా వ్యవసాయ మంత్రి గుస్తావ్ రోడ్రిగ్జ్ రోలెరో వ్యవసాయ రంగంలో ఆలోచనల, పరిశోధనల భాగస్వామ్యాన్ని పెంచుకోవడానికి అంగీకార పత్రం పై సంతకాలు చేశారు. "క్యూబా ప్రజల ఆరోగ్యకర, సురక్షిత, పోషకాహార అవసరాలను తీర్చడానికి అమెరికా ఉత్పత్తి దారులు ఉవ్విళ్ళూరుతున్నారు. ఈ అంగీకార పత్రం ఇరు దేశాల ప్రజల బంధాలను, వాణిజ్య సంబంధాలను పెంచుతుంది. క్యూబా ప్రజలందరి మానవ హక్కులకు మా మద్దతును

ప్రకటిస్తున్నాము. (ప్రపంచ మానవులందరినీ నట్టేటముంచిన అమెరికా, మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించే అమెరికా మానవత్వం పరిఢవిల్లిన క్యూబాలో ప్రజలకు మానవ హక్కులకు మద్దతునిస్తుందట! దీనికి మించిన జోక్ ఇంకొకటుండదు.) ఇరు దేశాల వ్యవసాయరంగాలను అభివృద్ధి వైపు పయనింప చేస్తుంది." అని విల్బాక్ వివరించారు. అమెరికా వ్యవసాయ వాణిజ్య సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెట్టుబడి పెట్టే సందర్భాలలో అవి అక్కడి ఆర్థికరంగ అధీనతను కోరుకుంటాయి. కొన్ని కార్పొరేషన్ల చేతుల్లో భూకేంద్రీ కరణను ప్రోత్సహిస్తాయి. చిన్న స్థాయి ఉత్పత్తి వ్యవస్థను తమకు అనుకూలంగా ప్రామాణీకరించుకుంటాయి. ఈ మార్పుల ఫలితంగా భూమి రైతుల చేతుల నుండి మాయమవుతుంది. స్థానిక, సాంప్రదాయక పంటలు, సాంప్రదాయక వ్యవసాయ పద్ధతులు త్యజించబడతాయి. 1990 ల తర్వాత బ్రెజిల్, పరాగ్వే, బొలీవియా లలో విస్తరించిన జన్యు పరివర్తిత పంటలు, వ్యవసాయ ఇంధనాలు ఈ దుష్ఫలితాలకు మంచి ఉదాహరణ. క్యూబాలో, పర్యావరణ వ్యవసాయ చిన్న కమతాల సముదాయంతో, సంక్లిష్ట సామాజిక అమెరిక వ్యాపించి ఉంది. గత కొన్ని దశాబ్దాలలో 3,00,000 మంది రైతులు పరస్పరం ముఖాముఖి పరిజ్ఞాన మార్పిడితో, వ్యాప్తితో ఈ సమాజాన్ని నిర్మించుకున్నారు. క్యూబాలో అమెరికా 'పారిశ్రామిక వ్యవసాయ విధానం' ప్రవేశిస్తే ఈ 'వ్యవసాయ జ్ఞానసముదాయ సమాజం' సమాప్తమవుతుందని విజ్ఞులు భయపడుతున్నారు. క్యూబా అనుసరిస్తున్న పంటల వైవిధ్యం విచ్ఛిన్నమై స్థానిక పరిపుష్ట ఆర్థిక రంగం, ఆహార భద్రత నాశనమవుతాయి. చిన్నకారు రైతుల స్థానాన్ని పెద్ద వ్యాపారస్తులు ఆక్రమిస్తారు. వ్యవసాయం వాణిజ్య, ఎగుమతి పంటలవైపు పయనిస్తుంది. వ్యవసాయ నిరుద్యోగం పెరుగుతుంది. చిన్నకారు రైతులు ఎగుమతి పంటల వ్యవసాయ మార్కెట్‌లో వాటా సంపాదించడం తప్పుకాదు. అయితే స్థానికంగా ఆహారోత్పత్తిలో వారి పాత్ర నిరాదరణకు గురికాకూడదు. రైతులు పండించగల ఆహారోత్పత్తులను దిగుమతి చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకొని ప్రభుత్వం రైతులకు రక్షణ కల్పించాలి.

ఇప్పటికే క్యూబా కోడి మాంసం, సోయాబీన్ వంటి కొన్ని ఆహారోత్పత్తులను అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్నది. 2000 సం.లో క్యూబాకు వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను చట్టబద్ధం చేసిన తర్వాత అమెరికా వ్యవసాయ అమ్మకాల విలువ 500 డాలర్లను దాటింది. అయితే 2008 లో 65.80 కోట్ల డాలర్ల నుండి 2014 నాటికి 30 కోట్ల డాలర్లకు అమ్మకాలు పడిపోయాయి. యూరోపియన్ యూనియన్, బ్రెజిల్‌లకు కోల్పోయిన తమ వ్యవసాయ అమ్మకాల మార్కెట్ వాటాను అమెరికన్ కంపెనీలు క్యూబా ద్వారా తిరిగి పొందాలనుకుంటున్నాయి. తమ ప్రజల ఆహారావసరాలను తీర్చడానికి క్యూబా ఏ స్థాయిలో దిగుమతులపై ఆధారపడి ఉన్నది అన్న విషయంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. క్యూబా ప్రజల 'కెలోరిక్ ఇన్ టేక్'లో 60% నుండి 80% వరకు దిగుమతులుంటాయని అమెరికా వ్యవసాయ శాఖ అంచనాలు కట్టింది. నిజానికి కోటి పది లక్షల తన జనాభాకు సరిపడా ఆహారాన్ని పర్యావరణ వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించుకునే శక్తి సామర్థ్యాలు క్యూబాకున్నాయి. క్యూబాలో 60 లక్షల హెక్టార్ల (150 లక్షల ఎకరాల)-సమతల భూమి, ఇంకొక 10 లక్షల హెక్టార్ల (25 లక్షల ఎకరాల) కొద్దిగా ఏటవాలుగా నున్న భూమి ఉంది. ఇదంతా సమృద్ధిగా పంటలు పండించడానికి అనువైనదే. ఈ మొత్తం భూమిలో సగానికి పైగా సాగులో లేదు. సాగులోనున్న భూమి ఉత్పత్తి సామర్థ్యం, వ్యవసాయ కార్మికుల శ్రమ శక్తి, మౌలిక సదుపాయాల వినియోగం ఉండవలసిన స్థాయికంటే తక్కువగానే ఉన్నాయి. వీటిని బాగా పెంచుకునే అవకాశముంది. రైతుల పొలాలు, సహకార వ్యవసాయ క్షేత్రాలలో వ్యవసాయపర్యావరణ వైవిధ్య పంటల పద్ధతిని పాటిస్తే క్యూబా తన ప్రజలకు సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేయడమే గాక పర్యాటక పరిశ్రమకు ఆహారాన్ని అందించగలదు. కొంత ఆహారాన్ని ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించగలదు. ఈ మేరకు లెక్కల వివరాలను క్యూబా వ్యవసాయ శాస్త్రజ్ఞులు తయారు చేశారు.

క్యూబా పాలకుల నిబద్ధత :

అమెరికాతో సంబంధాలను పునరుద్ధరించే సందర్భంలో క్యూబా అధ్యక్షుడు రావుల్ కాస్ట్రో ఇలా అన్నారు. "ఈ వ్యవహారంతో కొన్ని ఉపయోగాలున్నాయి. కానీ స్వాతంత్ర్యం, సామాజిక న్యాయాల మా ఆదర్శాలను వదిలిపెట్టం. మా సిద్ధాంత సూత్రాలలో ఒక్క దానిలో కూడా లొంగిపోము. దేశ సర్వసత్తాక గణతంత్ర రక్షణలో ఒక మిల్లి మీటర్ కూడా వెనక్కు తగ్గం. అనేక ప్రమాదాలకు లోనై, లెక్కించ వీలులేని, విలువలేనన్ని త్యాగాలు చేసి ఈ హక్కును మేము సాధించుకున్నాము." క్యూబాలోని వ్యవసాయ భూమిలో 25% మాత్రమే చిన్నకారు రైతుల అధీనంలో ఉంది. అయినా ప్రజల ఆహారావసరాలలో 65% వీరు ఉత్పత్తి చేస్తారు. ఈ విధంగా సన్నకారు రైతులు దేశ సార్వభౌమత్వానికి గణనీయంగా తోడ్పడుతున్నారు. వీరి పర్యావరణ వ్యవసాయ విజయాలు క్యూబా విప్లవ నిజమైన వారసత్వానికి ప్రతిబింబాలు. చైతన్య వంతులైన క్యూబా ప్రజలు, ప్రజాపక్షం వహించే విప్లవ వీరులైన పాలకుల వద్ద అమెరికా పప్పులు ఉడకవనీ క్యూబా వ్యవసాయ రంగంలోనే గాక, సమగ్రాభివృద్ధిలో కూడా మరింత ప్రగతి బాటలో పయనించి ఇప్పటి లాగానే ప్రపంచ దేశాలకు ఆదర్శ ప్రాయంగా నిలుస్తుందని ఆశిద్దాం.

(కాలిఫోర్నియా విశ్వ విద్యాలయ పర్యావరణవ్యవసాయ ఆచార్యులు మిగుయెల్ అల్తీరి సమాచారం ఆధారంగా)

మామిడి తోటలలో సస్యరక్షణ - కొన్ని సూచనలు

సైన్స్ చక్రవర్తి
సి.వి. సర్వేశ్వరశర్మ

వాణిజ్య పంటగా మామిడిని పరిగణిస్తే తప్పని సరిగా లాభదాయకమైనదే. కాకపోతే తోట నాటడం మొదలుకుని అనేక జాగ్రత్త చర్యలు రైతు తీసుకో వాల్సివస్తుంది. ఆవిధంగా చేస్తే కోరుకున్నంత దిగుబడి, నాణ్యతలో పంట లభిస్తుంది.

నీరు నిలవని గరపనేలలు, చౌడులేని భూములు ఈ తోటలకు పనికి వస్తాయి. గమనించాల్సిన విషయం ఏమిటంటే బంకనేలలు, నుద్దపొరలు, నూనె మెరుగుడు, సున్నపురాళ్ళు అధికంగా ఉండే నేలలు ఎంత మాత్రం పనికి రావు.

మురుగు నీరు నిల్వని, ఉదజని సూచిక 6 నుండి 7.5 వరకు ఉన్న నేలలు మంచిది. ఈ పంటసాగుకు ఉప్పునీరు పనికిరాదు. మామిడి మొక్క నాటే ముందు భూసార పరీక్ష చేయించాలి.

ఇలా తోటకు పనికి వచ్చే నేలను ఎంపిక చేసుకున్న తరువాత వేసవికి ముందే లోతుగా దుక్కిదున్ని ఎండనివ్వాలి. ఒక మీటరు లోతు, వెడల్పుగల గోతులు తవ్వి వాటిని ఒక నెల కాలం బాగా ఆరనివ్వాలి. ఈ గోతుల మధ్య ఎక్కువదూరం సారవంతమైన భూముల్లో ఉండాలి. ఎందుకంటే మామిడి మొక్క ఇచట బాగా ఏపుగా పెరుతుంది. అదే తేలిక భూములయితే ఈ గోతుల మధ్య అంత దూరం అవసరం ఉండదు.

మామూలుగా అయితే మామిడి మొక్కల మధ్య 9 మీటర్ల దూరం ఉంటే ఉత్తమం. ఎందుకంటే అటువంటి తోటల్లో అంతర సేద్యం సాధ్యమవుతుంది. హైబ్రిడ్ రకం మామిడి మొక్కల్ని నాటితే వాటి మధ్య 5 మీటర్ల దూరం ఉంటే సరిపోతుంది. ఎకరాకు 160 మొక్కలు నాటవచ్చు. ఇవి ఇలా నాటడం వల్ల దిగు బడులు బాగా వస్తున్నట్లు ఇప్పటికే నిర్ధారణ చేశారు.

అంటు మొక్కలు :

పండ్ల తోటలు నాటేవారికి ప్రధానమైన సమస్య నాణ్యమైన మొక్కలు లభించడం. నాటే మొక్కల నాణ్యతను బట్టి పంట ఎదిగి దిగుబడులను ఇస్తుంది. తమాషా ఏమిటంటే రైతులు నర్సరీలకు వెళ్లి అంటుగట్టిన మొక్కలు తెచ్చుకుంటారు. నర్సరీ యజమానులు ఎవరికి వారే తమవద్ద గల మొక్కలు గొప్పవి అని చెబుతూ ఉంటారు.

అంటు కట్టిన మొక్కను చూసి దాని నాణ్యతను చెప్పడం కష్టం. ముఖ్యంగా ఆ మొక్కకు గల జన్యుపరమైన లక్షణాలు తెలియవు. మొక్క పెరుగుదల, ఆరోగ్యంగా చీడ పీడలకు దూరంగా ఉంటూ ఎదగడం వంటి లక్షణాలు మాత్రమే రైతు గమనించగల్గుతాడు.

సాధారణంగా పండ్లతోటలకు అంటుకట్టిన మొక్కలనే ఎంచుకుంటారు. నర్సరీలో అంటుకట్టిన మొక్కలు ఉంటాయి. కాని దానిని ఏ తల్లి చెట్టునుండి తయారు చేసినది తెలియదు. అందుకే తోటలు నాటాలనుకునేవారు. నర్సరీలకు వెళ్ళి దగ్గర ఉండి వేరుమూలం, తల్లిచెట్టును పరిశీలించి వాటి విశేషాలు తెలుసుకుని అంటు కట్టించుకుంటే ఉత్తమం.

మరొక పద్ధతి ప్రకారం నాణ్యమైన కాయలలోని టెంకలను సేకరించుకుని నీరుపోసి, స్వయంగా మొక్కలను పెంచుకుని ఆ తరువాత బాగా కాపు కాసే చెట్టు నుండి కాడలను, మొగ్గంట్లను తెచ్చుకుని పెంచుకుంటున్న మొక్కలపై అంట్లు కట్టించుకోవాలి.

రైతులు గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే మామిడి తోటలు పెంచుకోవాలనుకునేవారు కనీసం ఆరునెలలు ముందు నుండి దృష్టి అటువైపు నిలిపి ప్రయత్నం చెయ్యాలి.

చీడల అదుపు :

మామిడి తోటల్లో దిగుబడిని తగ్గించే తేనెమంచు పురుగులు, బూడిద తెగులు పూలగుత్తులను ఆశించి ఉంటాయి. ఈ తేనె మంచు పురుగులు గుంపులుగా జేరి లేత ఆకులు, కాడలు, లేత పిందెల నుండి రసం పీల్చేస్తాయి. దానితో పూత మాడి పిందెలు రాలిపోతాయి.

ఈ పురుగులు తేనెలాంటి జిగురు పదార్ధాన్ని ఆకులు, పూత, కాడలపై విసర్జించడం వలన వాటిపై నల్ల మసి పొర ఏర్పడుతుంది.

ఈ చీడ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రాములు మరియు కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే సరిపోతుంది.

బూడిద తెగులు అధికంగా ఉంటే లీటరు నీటికి ఒక మి.లీ కెరాథేన్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోవ్ కలిపి ఎకరా తోటలో 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలి.

పూల గుత్తులను ఆశించే పురుగు పూత దశలో ఆశించి ఆ తరువాత పూల గుత్తులను గూడులా చేసి పూత మాడి పోయేందుకు కారణమవుతుంది. దీని నివారణకు లీటరు నీటికి ఒక మి.లీ. డైక్లోరోవాస్ మరియు 3 మి.లీ. వేపనూనె కలిపి పిచికారి చేయాలి.

పిందెలు ఏర్పడి గచ్చకాయ సైజులో వున్నప్పుడు మొక్క మొదట్లో నీరు పోయాలి. నీటి సదుపాయం లభించని మొక్కలకు లీటరు నీటికి 10 గ్రా. పాలీఫీడ్, 20 గ్రా. యూరియా కలిపి పిచికారి చేయాలి.

పూత, పిందెదశలో

సాధారణంగా మామిడి నవంబరు నుండి ఫిబ్రవరి వరకు పూతకు వచ్చి ఏప్రిల్ నుండి జూలై వరకు పండ్లు లభిస్తాయి. ఈ పూత, పిందె దశల్లో సరియైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందగల్గుతారు.

ముందుగా పచ్చది రకాలు, రసాలు మామిడిలో పూతకు వస్తాయి. ఆ తరువాత కోత మామిడి రకాలు వస్తాయి. ఈ దశలోనే తేనె మంచు పురుగులు, బూడిద తెగులు ఎక్కువ నష్టం కల్గిస్తాయి. వాటి నివారణ చర్యలు ఇప్పటికే తెలుసుకున్నాము. ఆకు మొగ్గలు పూ మొగ్గలుగా మార్పు చెందే వరకు చెట్లకు నీరు ఇవ్వకూడదు. నేలలో తేమను వీలయినంతవరకు తగ్గించాలి. వర్షం కురిస్తే మొక్కల మధ్య నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పూత మొగ్గ బయటకు రాగానే ఒకసారి నీరు అందివ్వాలి. పూతకు అవసరమయ్యే రసాయనాలు, హార్మోన్లు, ప్రతి రెమ్మకు, మొక్కకు నీటిద్వారా చేరి చెట్టంతా ఒకేసారి పుష్పిస్తుంది.

చలి ఎక్కువగా వున్న ప్రాంతంలో పూల కాఢలు లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రాములు మరియు కార్బండిజమ్ ఒకగ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే సరిపోతుంది. బూడిద తెగులు అధికంగా ఉంటే లీటరు నీటికి ఒక మి.లీ కెరాథేన్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్ కలిపి ఎకరా తోటలో 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలి.

పూల గుత్తులను ఆశించే పురుగు పూత దశలో ఆశించి ఆ తరువాత పూల గుత్తులను గూడులా చేసి పూత మాడిపోయేందుకు కారణమవుతుంది. దీని నివారణకు లీటరు నీటికి ఒక మి.లీ. డైక్లోరోవాస్ మరియు 3 మి.లీ. వేపనూనె కలిపి పిచికారి చేయాలి. పిందెలు ఏర్పడి గచ్చకాయ సైజులో వున్నప్పుడు మొక్క మొదట్లో నీరు పోయాలి. నీటి సదుపాయం లభించని మొక్కలకు లీటరు నీటికి 10 గ్రా. పాలీఫీడ్, 20గ్రా. యూరియా కలిపి పిచికారి చేయాలి.

పూత, పిందె దశలో

సాధారణంగా మామిడి నవంబరు నుండి ఫిబ్రవరి వరకు పూతకు వచ్చి ఏప్రిల్ నుండి జూలై వరకు పండ్లు లభిస్తాయి. ఈ పూత, పిందె దశల్లో సరియైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందగల్గుతారు.

ముందుగా పచ్చడి రకాలు, రసాలు మామిడిలో పూతకు

సభలో ప్రసంగిస్తున్న సి.వి. సర్వేశ్వరశర్మ

వస్తాయి. ఆ తరువాత కోతమామిడి రకాలు వస్తాయి. ఈ దశలోనే తేనె మంచు పురుగులు, బూడిద తెగులు ఎక్కువ నష్టం కల్గిస్తాయి. వాటి నివారణ చర్యలు ఇప్పటికే తెలుసుకున్నాము. ఆకు మొగ్గలు పూమొగ్గలుగా మార్పు చెందే వరకు చెట్లకు నీరు ఇవ్వకూడదు. నేలలో తేమను వీలయినంతవరకు తగ్గించాలి. వర్షం కురిస్తే మొక్కల మధ్య నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పూత మొగ్గ బయటకు రాగానే ఒకసారి నీరు అందివ్వాలి. పూతకు అవసరమయ్యే రసాయనాలు, హార్మోన్లు, ప్రతిరెమ్మకు, మొక్కకు నీటిద్వారా చేరి చెట్టంతా ఒకేసారి పుష్పిస్తుంది.

చలి ఎక్కువుగా వున్న ప్రాంతంలో పూల కాడలు పొడవు పెరగవు. ద్విలింగ పుష్పాలు తగ్గి, దిగుబడి బాగా తగ్గిపోతుంది. ఇటువంటి పరిస్థితులలో ప్లానోఫిక్స్ 1 మి.లీ. 4 లీటర్ల నీటిలో కలిపి మొగ్గ బయటకురాగానే పిచికారి చేయాలి. దీనివల్ల పిందెరాలుడు కూడా ఆ సమయంలో పిచికారి చేస్తే అదుపులోకి వస్తుంది.

కాండం తొలిచే పురుగులు :

ఈ పురుగులు కారణంగా కొమ్మలే కాకుండా, చెట్టు కూడా పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. కొమ్మలు బోడిగా మారి ఉండడాన్ని గమనించిన వెంటనే ఎక్కువ పాడవైన కొమ్మలు తీసివేయాలి. కొమ్మల రంధ్రాల్లో ఇనుపచువ్వను చొప్పించి పురుగును బయటకు లాగి చంపివేయవచ్చు. లేదా ఒక మి.లీ. మిథైల్ ఫెరాథియాన్ 100 మి.లీ. నీటిలో కలిపిన ద్రావణాన్నిగాని, పెట్రోల్ గాని, అల్యూమినియం పాస్ఫేట్ బిళ్లలను గాని పురుగు చేసిన రంధ్రంలో వేసి బంకమన్నుతో రంధ్రాన్ని మూసివేస్తే లోపలి పురుగు చనిపోతుంది.

టెంక పురుగులు

వీటి నివారణకు లీటరు నీటిలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా పెనిట్రోథియాన్ ఒక మి.లీ. చొప్పున కలిపి పిందె కట్టిన తరువాత ఒక పర్యాయం, నెలరోజులు తరువాత మరొక ధపా చెట్టంతా తడిచేలా పిచికారి చేయాలి. దీనివలన గుడ్లు, వాటినుండి వచ్చే పురుగులు నశిస్తాయి. ✧

పొలాలలో నిప్పు - భూమికే ముప్పు

హనుమంతరెడ్డి

అమెరికా ప్రభుత్వ పౌర వైమానిక, అంతరిక్ష పరిశోధనా నిర్వహణ సంస్థనాసా (National Aeronautics and Space Administration). ఈ సంస్థకు చెందిన వాతావరణ ఉపగ్రహ పరిక రాలకు 2016, మార్చ్ 22న భారత దేశమంతా లెక్కలేనన్ని నిప్పుల సముద్రాలు కనిపించాయి. అమెరికా 'జాతీయ సముద్ర, వాతావరణ నిర్వహణ సంస్థ' కు చెందిన 'పర్యావరణ దృశ్య ప్రయోగశాల' ఆ అగ్నికీలల చిత్రాన్ని అందించింది. పంటల నూర్పిళ్ళ తర్వాత ఒక్క రోజున ఎన్ని మంటలు రగిలాయో ఈ చిత్రం చూపిస్తున్నది.

మంటల ప్రదేశాలు, మంటల సంఖ్య, వాటి విస్తృత పరిధిని బట్టి అవిపంటపొలాల నిర్వహణ కు ఉద్దేశపూర్వకంగా అంటించిన మంటలని అమెరికా వాతావరణ పరిశోధనా సంస్థ అభిప్రాయ పడింది.

మన దేశంలోని వ్యవసాయ అలవాట్లు, ఆచరణలు ఈ నిర్ణయాన్ని ధృవీకరిస్తున్నాయి. పంట కోతల తర్వాత పొలాలలో పంట చెత్త, గడ్డి మిగిలిపోతాయి. పొలాలను శుభ్రపరచడానికి రైతులు వీటిని కాల్చివేయడం ఆనవాయితీ. పొలానికి నిప్పు పెట్టడం ద్వారా అనవసరమైన మొక్కలు, గడ్డి, పొదలు, తుప్పలు తొందరగా, సులభంగా తక్కువ ఖర్చుతో నిర్మూలించబడతాయి. చెత్తను కాల్చడం వలన పొలానికి పోషకాలు అంది భూమి సారవంతమవుతుందని కొందరి నమ్మకం. ఈ నమ్మకం నిజంకాదు. అందుకే ఈ చర్యను శాస్త్రజ్ఞులు విమర్శిస్తారు. దీని వలన గాలి విపరీతంగా కాలుష్య మవుతుంది. పెద్ద ఎత్తున దేశమంతా మండే మంటలు వాతావరణాన్ని కూడా వేడెక్కిస్తాయి. చుట్టుపక్కల ఉన్న నీటిని ఆవిరి చేస్తాయి. ఏ మంటల నుండి అయినా ముందుదట్టమైన పొగలు కమ్ము కుంటాయి. ఈ పొగలో పూర్తిగా కాలని రసాయన పదార్థాలు, నలుసులు, విషవాయువులయిన కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నుసి, మసి ఉంటాయి. అత్యంత ప్రమాదకరమైన ఈ వాయువులు, రసాయనాలు, పదర్థాలు ఊపిరి తిత్తులలోనికి ప్రవేశిస్తాయి. ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. చాలా రాష్ట్రాలు ఈ పద్ధతిని నిషేధించాయి. ఇది రైతులకు తాత్కాలిక ప్రయోజనాలను కలిగించ వచ్చు. కానీ దీర్ఘ కాలికంగా భూమిని పాడు చేస్తుంది. "పొలాలకు మంట పెట్టడం వలన భూమిలోని సహజ పోషకపదార్థాలు నాశన మవుతాయి. భూసారాన్ని పునరుద్ధరించే ప్రయోజనకారి బ్యాక్టీరియా చచ్చిపోతుంది. విపరీత వాయు కాలుష్యం సరే సరి. రాష్ట్రాల నిషేధ చట్టాలను పలు ప్రాంతాలలో అమలుపరచ లేదు. దూర దృష్టి లేని ఖర్చు - లాభాల విశ్లేషణ ఈ పద్ధతికి దారితీస్తున్నది. ఉత్తర భారతంలో అక్టోబర్ - డిసెంబర్ మధ్యలో వరి పంట పూర్తయి పొలాలను గోధుమ పంటకు సిద్ధం చేస్తారు. పొలాల మంటలు అక్కడ ఈ మధ్య కాలంలో ఉంటాయి. అంతరిక్ష ప్రయోగశాల అందించిన ఫోటోలోని మంటలు ఎక్కువగా దక్షిణ, తూర్పు భారతంలో కనిపిస్తు న్నాయి. ఆ ప్రాంతాలలో ఇది పంటల కోతలు, నూర్పిళ్ళు ముగిసిన సమయం. ఇవి ఖచ్చితంగా పొలాల పొగలు, మంటలే. ఇది పొలనా సమస్య. పొలాల మంటలు కలిగించే శాశ్వత నష్టాలను, విపరీత పరిణామాలను తీవ్రంగా పరిగ ణించాలి. పరిష్కారం కనుగొని, నివారణా చర్యలను చేపట్ట వలసిన అవసర ముంది." అని 'అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల భారతీయ పరిశోధనా మండలి' ఆచార్యులు అశోక్ గులాటి అన్నారు. రైతులు వాడుతున్న ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు అన్నీ అమెరికా బహుళ జాతి సంస్థల రసాయనాలే. ఇవి భూసారాన్ని నాశనం చేస్తున్నాయి. భూమి జీవశ్ఛవంలా తయారవుతున్నది. ఏ కొద్దిగానో మిగిలిన సారాన్ని ఈ నిప్పు దహించివేస్తుందన్న మాట. ఆకారానికే భూమి. సహజ లక్షణాలన్నీ హరించుకుపోతాయి. "అసలే గూని దానికి తోడు తోపుడు గాలి" అన్నట్లుంది రైతుల పని. పంటల కోతలు, నూర్పిళ్ళ తర్వాత పొలాలనిండా కొయ్యలు, దుంగలు, కోసిన మొదళ్ళు మిగిలిపోతాయి. వీటిని తొలగించడానికి పొలాన్ని ఎద్దుల సహాయంతో దున్నాలి. గొర్రు తోలాలి. గుంటక పాయాలి. లేదా ఈ పనులన్నీ ట్రాక్టర్ల తో చేయాలి. ఈ విధంగా పెకలించబడిన చెత్త, చెదారాలను కూలీలతో ఏరివేయించాలి. పశుగ్రాస కొరత మొదలగు అనేక కారణాల వలన ఇప్పుడు రైతుల దగ్గర ఎద్దులు లేవు. ట్రాక్టర్లు, ఇతర మెషిన్లు ఖర్చుతో కూడుకున్నవి. ఇక భారత దేశంలో ఏ ప్రాంతం లోనైనా కూలీలను భరించడం రైతులకు అసాధ్యమైపోయింది. కోతలు, నూర్పిళ్ళ సమయాలలో కూలీలు ఆకాశంలో కూర్చుంటారు. ఆచరణ లొసుగుల వల్ల 'గ్రామీణ ఉపాధి పథకం' ఈ విషయంలో రైతులను ఆదుకోలేకపోతున్నది.

అనావృష్టితో పంటలు పండవు. మూగవాడు అమ్మా అన్నప్పుడు పండిన పంటలు అతివృష్టి, వరదలు మొదలగు ప్రకృతి వైపరీత్యాలతో నాశనమవుతాయి. జూదంలో గెలిచిన డబ్బులా మిగిలిన పంటలు దళారీల పాలవుతాయి. ఫలితం గిట్టుబాటు కాని వ్యవసాయం. నష్టాల ఊబిలో కూరుకొని, అప్పుల పాలయి, ఆత్మహత్యలకు ఒడిగడుతున్న రైతులకు చెత్త, చెదారాల సేద్యం అనుకూలం కాదు. అందుకే పంట చెత్తను, నూర్పిళ్ళ వ్యర్థాలను కాల్చిపారేయడమే రైతులకు అనువ యిన, సులువయిన మార్గం.

ఖాళీ స్థలాలు అతి తక్కువగానున్న దేశాలలో 'స్లాష్ అండ్ బర్న్ (నరుకు, తగులబెట్టు)' వ్యవసాయ పద్ధతి అమలులో ఉంది. 'పొదలను, దుబ్బులను, దట్టమైన చెట్లను నరకడం, కాల్చడం. ఆ

లాభాల బాటలో పెయ్యల పెంపకందారులు

కె. వీరభద్రరావు

డెయిరీ నిర్వహణ అంటే కేవలం పాడి పశువుల్ని కొనడం, వాటిని పోషించడం, పాలు అమ్మడం మాత్రమే కాదు. దానికి అనుబంధంగా అనేక వ్యాపకాలు, వ్యాపారాలు నిర్వహించడం కూడా వాటిలో దూడలు, పెయ్యలు పెంపకం కూడా ఒకటి. వాటిని పోషించి చూడి కట్టించి ఈనే ముందు లేదా ఈనిన వెంటనే అమ్మితే మంచి ఆదాయం పొందవచ్చు. పాలు తీయడం, అమ్మడం, పాల ఉత్పత్తి తగ్గడం వంటి సమస్యలే ఉండవు కనుక ఇందులో టెన్షన్‌లు తక్కువేనని చెబుతున్నారు. డెయిరీ పెట్టాలని అనుకునే వారు సంతలోనో, రైతుల దగ్గరో, ఇతర రాష్ట్రాల నుండో పాడి పశువుల్ని కొనుగోలు చేస్తుంటారు. అవి పాలు ఇచ్చినంత కాలం తీసుకుని వట్టిపోయిన తర్వాత అమ్మేస్తుంటారు. అనంతరం మళ్ళీపాడి పశువుల్ని ఎక్కువ ధర పెట్టి కొంటున్నారు. ధర మాట అటుంచితే దాని గత చరిత్ర అంతకు ముందు ఈతల్లో దానికి ఎదురైన సమస్యలు వంటి వివరాలు రైతుకు పూర్తిగా తెలియవు. అంతే కాదు ఆ పశువు ఎన్ని పాలు ఇస్తుంది. దాని పునరుత్పత్తి సామర్థ్యం వంటి విషయాలు తెలుసుకోవటం కూడా కష్టమే. కాబట్టి రైతులు తమ ఇంటి వద్ద లేదా డెయిరీ ఫారాల్లో పుట్టిన మేలు జాతి దూడల్ని పెంచి పోషించి, వాటిని పాడి పశువులుగా తీర్చిదిద్దడం మంచిది. అయితే దూడల్ని పెంచడానికి చాలా కాలం పడుతుందని, పోషణకు ఖర్చు ఎక్కువ అవుతుందని చాలా మంది రైతులు అపోహపడుతుంటారు. దీనికంటే పాడి పశువుల్ని కొనుగోలు చేయడమే మంచిదని వాదిస్తున్నారు. కొందరు రైతులు దూడల్ని పెంచుతున్నప్పుడు వాటికి కేవలం ఎండుగడ్డి, దొరికిన మేరకు పచ్చిగడ్డి వేసి సరిపెడుతున్నారు. పుట్టినరోజు నుండి ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు దానిని దూడ అంటారు. సంవత్సరం వయసు నుంచి మొదటిసారి ఈనే వరకు దానిని పెయ్య అని పిలుస్తారు. దూడ, పెయ్య రోజుకు సగటున 500 గ్రాముల చొప్పున బరువు పెరగాలంటే దానికి విధిగా తగినంత పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణా ఇవ్వాలి. ఈ విధంగా దాన్ని శాస్త్రీయ పద్ధతిలో పెంచితే అది త్వరగా యుక్త వయసుకు వచ్చి చూడికట్టి తక్కువ వయసులోనే మొదటి ఈతను ఇచ్చే అవకాశం ఉంది.

పెయ్యల్ని సరిగా పోషిస్తే సంకరజాతి ఆవులు 18 నెలలకు ముర్రా లేదా గ్రెడెడ్ ముర్రా జాతి గేదెలు 24 నుండి 30 నెలలకు యుక్తవయసుకు చేరుకుంటాయి.అలా చేరుకోవాలంటే కొన్ని విషయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఒకవేళ దూడల్ని కొనుగోలు చేయాల్సి వస్తే పలు అంశాల్ని పరిశీలించాలి. సంకరజాతి జెర్సి, హెచ్.ఎఫ్ ఆవు. ముర్రా/గ్రెడెడ్ ముర్రా లేదా ఇతర జాతులకు చెందిన దూడల్ని ఆయా జాతుల లక్షణాల్ని బట్టి ఎంపిక చేసుకోవడం మంచిది. కొనుగోలుచేసే ముందు దూడ ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీయాలి. ఆ వయసులో దానికి ఉండాల్సిన బరువు ఉన్నదో లేదో తెలుసుకోవాలి. దూడ కళ్ళు, కాళ్ళు, నడక అవయవాలు అమరిక, ఇవన్ని సక్రమంగా ఉంటేనే కొనుగోలు చేయాలి. దూడ చురుగ్గా నడవాలి. సరిగా ఎదిగిన సంకరజాతి ఆవుదూడ ఆరు నెలల వయసుకు 90-100 కిలోలు, గేదె దూడ 100-120 కిలోలల బరువు తూగుతుంది. అన్ని లక్షణాలు సరిగా ఉన్న ఆవుదూడ ఐదారు వేల రూపాయలకు, గేదె దూడ 6-8 వేల రూపాయలకు లభించవచ్చు. మేలైన జాతి దూడ అయితే ధర కొంచెం ఎక్కువ కూడా ఉండవచ్చు. కొనుగోలు చేసిన దూడల్ని మంచిగా పోషించుకుంటే ఎంతో ఆదాయం పొందే అవకాశం ఉంది. ✧

స్థలాలలో వ్యవసాయం చేయడం.' అన్న మాట. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో, దక్షిణ అమెరికా ఉత్తర ప్రాంతాలలో, భారత్‌తో సహా ఆగ్నేయ ఆసియా ప్రాంతాలలో ఈ పద్ధతి వ్యవసాయం సాగులో ఉంది. ఈ పద్ధతి మంటల వల్ల పైన చెప్పిన అనర్థాలన్నీ దాపురిస్తాయి. సంప్రదాయాలు, అలవాట్లు మూడు విధాలు. మంచివి. హాని చేయనివి. అపాయకరమైనవి. నిత్య జీవితంలోనే కాక వ్యవసాయ రంగంలో కూడా ఈ ప్రక్రియలుంటాయి. వ్యవసాయ శాస్త్రజ్ఞుల నివేదికలను అధ్యయనం చేసి, సలహాలను పాటించాలి. కష్ట, నష్టాలను నివారించుకోవాలి. నాసా చిత్రం లాంటి అనేక రకాల సమాచారం అందుబాటులో ఉంది. దీనిని నష్ట నివారణకే గాక, లాభసాటి వ్యవసాయానికి కూడా ఉపయోగించుకోవచ్చును.

(ది వైర్ సమాచారం ఆధారంగా)

వేసవిలో భూసార పరీక్షలు – ఆవశ్యకత

డా॥ ఓ. శారద, శ్రీ జి. రమేష్ మరియు డా॥ జి. శివనారాయణ

ఏరువాక కేంద్రం, ఒంగోలు, ప్రకాశం జిల్లా

నేలలు వాటిలోని సహజంగా వున్న పోషక పదార్థాలతోపాటు, అదనంగా వేసిన సేంద్రియ మరియు రసాయనిక ఎరువుల్లోని పోషకాలను మొక్కలను అందచేసి పంట దిగుబడికి దోహదపడతాయి కాబట్టి నేలల్లో వున్న భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు తగ్గించుకొని, భూసారాన్ని కాపాడుకొంటూ, అధిక మరియు సుస్థిర దిగుబడులను పొందవచ్చు. దీనికి సంబంధించి రైతులు తమ పొలంలోని మట్టిని 2 సంవత్సరాలకు ఒకసారి పరీక్ష చేయించుకుంటే మంచిది. పోషక పదార్థాలు గురించే కాక, భూమిలోని చౌడు గుణాలను, సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా మట్టి పరీక్ష చేయించుకోవాలి.

భూసార పరీక్షలో అన్నింటికన్నా ముందు తెలుసుకోవాల్సిన విషయం మట్టి నమూనాను సేకరించడం భూసార పరీక్ష కొరకు తీయవలసిన మట్టి నమూనా సరైనది కానిచో, దాని భౌతిక, రసాయనిక మరియు జీవ లక్షణాలు మన పొలం లక్షణాలను ప్రతిభింబించే విధంగా ఉండదు. దీని వలన చేయించిన భూసార పరీక్ష, దానికి అనుగునంగా చేసిన ఎరువుల సిఫార్సులు వ్యర్థమవుతాయి. అంతేకాక ఒకోసారి తప్పుడు సిఫార్సులు కూడా చేయటం జరుగుతుంది. కనుక మట్టి నమూనా సేకరణలో ఈ క్రింది జాగ్రత్తలు తప్పక పాటించాలి.

- పొలంలో 'V' అకారంలో 15 సె.మి. వరకు పారతో గుంట తీసి అందులో పై పార నుండి కింద వరకు ఒక దుక్కుగా మట్టిని సేకరించాలి.
- ఈ విధంగా ఎకరా విస్తీర్ణంలో 8-10 చోట్ల సేకరించిన మట్టిని ఒక దగ్గరగా చేర్చి బాగా కలిపి 4 భాగాలుగా చేయాలి. అందులో ఎదుటి భాగాలు తీసుకొని మిగతా సమభాగాలు తీసి వేయాలి. ఈ విధంగా మట్టి 1/2 కిలో వచ్చే వరకు చేయాలి.
- ఇలా సేకరించిన మట్టిలో రాళ్ళు, పంట వేర్లు, మొదళ్లు లేనట్లు చూసుకొని నీడలో ఆరనివ్వాలి.
- మట్టి నమూనా కొరకు పొలంలో మట్టిని త్రవ్వి సేకరించినప్పుడు
- గట్ల దగ్గరలో మరియు పంట కాల్వలలోని మట్టిని తీయరాదు
- చెట్లక్రిందనున్న పొలం భాగం నుండి మట్టిని సేకరించరాదు.
- ఎరువు (పశువుల పేడ, కంపోస్టు, వర్మికంపోస్టు, పచ్చరొట్ట మొదలైనవి) కుప్పలు వేసి ఉంచిన చోట మట్టిని సేకరించరాదు.
- ఎప్పుడు నీరు నిలబడే పల్లపు స్థలంలో మట్టిని సేకరించరాదు.
- పొలంలో వాలు ఎక్కువగా ఉన్నప్పుడు దానిని ఎత్తు, పల్లపు ప్రాంతాలుగా విభజించి వేరు వేరుగా మట్టి నమూనాలు సేకరించాలి. అటువంటి సందర్బాల్లో కూడా పైన తెలిపిన జాగ్రత్తలు పాటించాలి.
- పొలంలో అక్కడక్కడా చౌడు ప్రాంతంగా అనుమానం కల్గితే అక్కడినుండి ప్రత్యేకంగా నమూనా తీసి వేరుగా చౌడు లక్షణాల పరీక్ష కొరకు పంపాలి. అటువంటి మట్టిని బాగా ఉన్న మట్టితో కలపరాదు.

పండ్లతోటలకు అనువైన నేలలను గుర్తించినపుడుగాని, పండ్ల చెట్లకు ఏవైనా పోషక పదార్థాలు మరియు ఇతర సమస్యల గుర్తింపు కొరకు మట్టి నమూనాను ఈ క్రింది విధంగా తీసుకోవాలి.

- సాధారణ పంటను బట్టి 3 నుండి 5 అడుగుల (1-2 మీ) లోతు గుంట తవ్వి, ప్రతి అడుగుకి కొంత మట్టి నమూనాను సేకరించి భూసార పరీక్షకు పంపాలి.
- మట్టి నమూనా కొరకు గుంట త్రవ్వుతున్నపుడు ఏవైనా గట్టి పొరలు వున్నట్లైతే వాటి లోతు మరియు వాటి లక్షణాల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
- పండ్ల తోటల విషయంలో ఇలాంటి నమూనా సేకరణ ఎకరాకు 2-4 చోట్ల నుంచి చేస్తే చాలా మంచిది.
- ఇటువంటి నమూనాలను పరీక్షకొరకు వంపునవుడు "పండ్లతోటలకు అనువైన పరీక్ష కొరకు" అని తెలియచేయాలి.
- పొలంలోని పలు ప్రాంతాల (8-10చోట్ల)నుండి సేకరించిన మట్టిని లేదా పండ్ల తోటల కొరకు తీసిన మట్టిని గాని, కలిపేందుకు యూరియా లేక ఇతర ఎరువుల సంచులను వాడరాదు. ఇందుకొరకు శుభ్రమైన ప్లాస్టిక్ షీటును ఉపయోగించడం మంచిది.

ఈ విధంగా సేకరించిన మట్టిని బాగా నీడలో గాలి ఆరిన తర్వాత మంచి ప్లాస్టిక్ బ్యాగులో గాని, గుడ్డ సంచిలో గాని నింపి తమకు సమీపంలోని వ్యవసాయ శాఖను సంబంధించిన భూసార పరీక్షా కేంద్రానికి ఈ క్రింది సమాచారంతో నింపాలి.

1. రైతుపేరు, సర్వే నెంబరు, గ్రామం, మండలం
2. కావలసిన పరీక్ష (భూసార, చౌడు, పడ్లతోటల ఎంపికకు)
3. ఇంతకు మునుపు పంట, దానికి వాడిన ఎరువులు
4. వేయబోవు పంట



మామిడి కోత - ఎగుమతుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు

పండ్ల తోటల్లో ఎగుమతి పంటగా మామిడికి ఎంతో ప్రాముఖ్యత వుంది. మన రాష్ట్రంలో మామిడి సుమారుగా 0.215 మి. హెక్టార్లలో 2,109 మి. టన్నుల ఉత్పత్తిలో సాగుచేయబడుచున్నది. రాష్ట్రంలో ఎక్కువగా కృష్ణా, విజయనగరం, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు, కడప జిల్లాల్లో సాగు చేస్తున్నారు. సుమారుగా 33 శాతం కాయలు కోత, కోత అనంతరం సరిగా పండక, కుళ్ళి, చెడిపోవడం జరుగుతోంది. కాయలను అశాస్త్రీయ పద్ధతిలో దులిపి, దోటితో కొట్టి లేదా లాగి కోయటంలో యాంత్రికంగా జరిగే గాయాలు,. చల్లని సమయంలో కాయలు కోయకపోవడం, గ్రేడింగ్ చేయకపోవడం, అపరిశుభ్రమైన గిడ్డంగులు, నిల్వ ప్రదేశాలు మొ॥ కారణాల వలన నష్టం ఎక్కువగా జరుగుతోంది.

మామిడి పండ్ల సాగు, కాయల కోత సమయంలో తగిన ప్రమాణాలను పాటించకపోతే ఎగుమతులు కూడా తిరస్కరణకు గురవుతాయి. ఈ నష్టాలను నివారించడానికి కోతకు ముందు, కోత సమయంలో, కోత తర్వాత పలు జాగ్రత్త చర్యలు చేపట్టాలి.

కోతకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు : కాయలను ఆశించే పురుగులు, తెగుళ్ళను గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఇందులో ముఖ్యంగా పండు ఈగ, టెంకెపురుగు, కాయమచ్చ ఎక్కువగా నష్టం కలుగచేస్తాయి.

పండు ఈగ / కాయకొట్టే ఈగ : ఈ పురుగు ఆశించిన కాయలు తొందరగా మాగి రాలిపోతాయి. పెద్ద ఈగలు లేత గోధుమ వర్ణంలో పారదర్శకమైన రెక్కలు కలిగి వుంటాయి. కాయ పక్వానికి వచ్చినపుడు కాయ చర్మం క్రింద ఈ ఈగ గ్రుడ్లు పెడుతుంది. ఆలస్యంగా వచ్చే నీలం, తోతాపురి రకాల్లో వాటి బెడద ఎక్కువగా వుంటుంది.

నివారణ : కాయలు ముదిరేటప్పుడు ప్రతి 20 మామిడి చెట్లకు ఒక ఆకర్షణ పళ్ళెం (ఎర్రపళ్ళెం) వుంచాలి. ఎర్రపళ్ళెంలో మిథైల్ యూజినాల్ 10 మి.లీ. 200 మి.లీ. నీటిలో కలిపి పళ్ళెంలో వుంచాలి. తోటలోని మగ ఈగలు ఈ రసాయనానికి ఆకర్షించబడతాయి. రాలిన కాయల్ని ప్రోగుచేసి నాశనం చేయాలి.

టెంకె పురుగులు : వీటి పెద్ద పురుగులు నల్లగా లేదా ముదురు గోధమ రంగులో ధృఢంగా వుంటాయి. పిందెలు గోళి సైజు నుంచి నిమ్మకాయ సైజులో వున్నవుడు ఆడపురుగులు వాటిమీద గ్రుడ్లు పెడతాయి. గ్రుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు టెంకెలోకి చేరి, అక్కడే కోశస్థ దశలోకి పోతాయి. కాయలు పండుబారిన తర్వాత రంధ్రం చేసి వెలుపలికి వస్తాయి. ఆలస్యంగా కోతకు వచ్చే రకాల్లో వీటి ఉధృతి ఎక్కువగా వుంటుంది. ప్రోసెసింగ్ సమయంలో ఈ పురుగులు టెంకె నుంచి వెలువడి గుజ్జులో వుండే అవకాశముంది. ఈ దశలో గుజ్జు తయారుచేయడం వల్ల పురుగు అవశేషాలు గుజ్జులో నిలిచిపోతాయి.

నివారణ : తోటలో రాలిన పండ్లు ఎప్పటికప్పుడు ఏరి కాల్చేయాలి. దీని వలన కాయల్లోని లద్దెపురుగులు, ఇతర దశలు నాశనమవుతాయి. కోత తర్వాత చెట్ల చుట్టూ లోతుగా దున్నడం / తవ్వడం వల్ల కోశస్థ దశలు ఎండకు చనిపోతాయి.

పూత సమయంలో జనవరి మొదటి వారంలో లేదా డిసెంబరు చివరి వారంలో క్వినాల్‌ఫాస్ 2.5 మి.లీ. లేదా 3 గ్రా. కార్బరిల్ లేదా ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పిందెలు గోళి సైజులో వున్నప్పుడు 0.75 మి.లీ. పెంథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిందెలు నిమ్మకాయ సైజులో వున్నప్పుడు 1.5 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా ఫెంథియాన్ 0.75 మి.లీ. చొప్పున పిచికారి చేయాలి.

ఆకుమచ్చ, ఆంత్రాక్నోస్, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్ళు : వర్షాలు లేదా పొగమంచు అధికంగా వున్న సమయంలో దీని వ్యాప్తి ఎక్కువగా వుంటుంది. ఈ తెగులు లేత ఆకులను, రెమ్మలను, పూలను, పండ్లను ఆశించి నష్టపరుస్తుంది. ఆకుల మీద గోధుమరంగు

సాధారణ రైతులు కాగితంలో పైన తెలిపిన విషయాలు వ్రాసి పైన జతచేసి పంపితే బాగుంటుంది. వివరాలకు పెన్సిల్‌ను ఉపయోగిస్తే మేలు.

భాస్వరం ఎరువుల వాడకంపై నియంత్రణ :

మన రాష్ట్రంలో వివిధ జిల్లాలలో నేలల్లో లభ్యమయ్యే భాస్వరపు పరిస్థితి గమనించి నట్లైతే దాని లభ్యత మధ్యస్థం నుండి ఎక్కువ స్థాయిలో వున్నట్లు తెలుస్తుంది. వివిధ పరిశోధనా స్థానాలలో నేలలోని భాస్వరపు లభ్యత అనుసరించి ఎరువుల వాడకంపై జరిపిన పరిశోధనలలో భాస్వరం లభ్యత అధికంగా వున్నప్పుడు దానిని తగ్గించి వాడినా కూడా దిగుమతులు తగ్గకుండా ఫలసాయాన్ని పొందవచ్చుని ఫలితాలు తెలియచేస్తు న్నాయి. కాబట్టి రాష్ట్ర రైతాంగం వారి పొలాల్లోని లభ్యత భాస్వరపు స్థాయిని బట్టి భాస్వరపు ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించి ఎరువులపై ఖర్చును తగ్గించుకోవచ్చును.

పరీక్ష, ఫలితాల విశ్లేషణ :

భూసార, సాగునీటి, పంట ఆకుల పరీక్షా ఫలితాలను విశ్లేషించేందుకు పరీక్షలు జరిపినచోట ఉన్న అధికారుల సహాయం తీసుకోవాలి. ఫలితాలు పోస్టు ద్వారా వస్తే సమీపంలో వున్న వ్యవసాయ శాఖ అధికారులను గాని వ్యవసాయ పరిశోధనా స్థానాల్లోని సంబంధిత శాస్త్రవేత్తలను సంప్రదించాలి. తదనుగుణంగా చర్యలు తక్షణం తీసుకోవాలి. ✧

మచ్చలు ఏర్పడి క్రమంగా మచ్చలు కలిసిపోయి, ఆకులు త్వరగా పండుబారి రాలిపోతాయి. లేత రెమ్మలపై నల్లని మచ్చలు ఏర్పడి పూలగుత్తులు పూలు మాడిపోతాయి. తెగులు సోకిన కాయలపై నల్లటి గుంత మచ్చలు ఏర్పడి కాయలు కుళ్ళిపోతాయి.

నివారణ : పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగులబెట్టాలి. అన్ని కొమ్మలకు సూర్యరశ్మి బాగా సోకేలా కత్తిరింపులు జూన్-జూలైలో చేసి లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమం పిచికారి చేయాలి.

పూతకు ముందు మొగ్గ బయటకు వచ్చే దశలో 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ పచ్చిపూత మీద 1 గ్రా. కార్బండిజమ్ లేదా 2 గ్రా. ఆంట్రాకాల్ లేదా 1 గ్రా. థయోఫినైట్ మిథైల్ పిందె దశలో 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 2 గ్రా. ఆంట్రాకాల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

విదేశాలకు ఎగుమతి చేయాలనుకున్నప్పుడు కాయకోతకు 15 రోజుల ముందు లీటరు నీటికి 1 గ్రా. బెన్‌లెట్ కలిపి పిచికారి చేయాలి.

కోత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు : కోత సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే శిలీంద్రాలు, సూక్ష్మజీవులు కాయల్లోకి ప్రవేశించి కాయకుళ్ళు తెగుల్ళు ఆశిస్తాయి. కనుక పక్వదశ గుర్తింపు కోతకోసే విధానంలో క్రింది జాగ్రత్తలు పాటించాలి.

సరైన పక్వదశలో కాయలు కోయటం : మామిడి పండ్లను పంపే మార్కెట్ దూరం, రవాణా సదుపాయాన్ని బట్టి కాయల పరిపక్వతను నిర్ణయించుకొని కాయలను కోయాలి. అయితే కాయలు అంతర్గతంగా తయారై పూర్తి ఆకారాన్ని సంతరించుకొని వుండాలి. కాయలపై తెల్లని పలుచని మైనపు కోటింగు కనిపించాలి. రంగు గల రకాల్లో (సువర్ణరేఖ, కలెక్టర్, ఆల్ఫాన్సో) కాయలపై ఎరుపురంగు సంతరించుకొని వుండాలి. పై లక్షణాలతో పాటు చిరుపిందె దశ నుండి రోజులు లెక్కించి మరియు పంచదార శాతం (బ్రిక్స్) బట్టి క్రింది విధముగా వివిధ మార్కెట్‌లకు కావల్సిన పరిపక్వతను గుర్తించి కాయలు కోయాలి.

రవాణా పద్ధతి	చిరుపిందె దశ నుండి రోజులు	పంచదార శాతం (బ్రిక్స్)
నౌకాయానం (రిఫరీ కంటైనర్స్)	90-100	7°-9°
విమానయానం	103-105	9°-10°
రోడ్డు ద్వారా (స్వదేశీ మార్కెట్)	105-110	10°-11°

మామిడి కాయల కోతలో మెళకువలు :

- సరైన పరిపక్వత గల కాయలను కోయాలి. లేత కాయలను కోయరాదు.
- చల్లని వేళల్లో కాయలు కోయాలి. కాయలను సరైన పరికరాలతో కోయాలి. అంటే కాయలను సికీచర్స్ లేదా క్లిప్పర్స్‌తో కోయాలి. ఎత్తులో వున్న కాయలను అభివృద్ధి పరిచిన డాపోలి లేదా ఐ.వి.హెచ్.ఆర్. హార్వెస్టర్లను ఉపయోగించి కోయాలి.
- కాయలకు 5-7 సెం.మీ. పొడవు గల తొడిమలతోసహా కోయాలి.
- దోటీలు లేదా చిక్కాల వలతో ఒకటి లేదా రెండు కాయలను మాత్రమే కోయాలి.
- ప్లాస్టిక్ ట్రేలలో అడుగున, ప్రక్కల "పేపర్ వేస్ట్" లేదా స్పాంజినీ కుషన్‌లా మెత్తగా అమర్చి కాయల తొడిమలు పైకి వుండేలా ఒకే పొరలో అమర్చాలి.
- ఖాళీ క్రేట్లను, కాయలతో నింపిన క్రేట్లను ఎప్పుడూ చెట్ల క్రింద నీడలో వుంచాలి. ఎండలో వుంచరాదు.
- తొడిమలు విరిగిన, సొనకారిన, దెబ్బతిన్న కాయలను విడి ట్రేలలో వుంచాలి.

స్వదేశీ మార్కెట్‌కి :

- కాయలను తల క్రిందులుగా వుంచి, తొడిమలను కత్తెరతో కత్తిరించి సొన తీయడానికి వెదురు బొంగులతో తయారుచేసిన పంజాలపై అమర్చి 2 గంటలపాటు వుంచి కాయల నుండి సొన పూర్తిగా కారిపోయేలా చేయాలి.
- తర్వాత కాయలను 10 కిలోలు లేదా 20 కిలోల పండ్లు పట్టే ట్రేలలో 1-2 ట్రే సైజుని బట్టి అమర్చాలి. 2 వరసల్లో కాయలు అమర్చినపుడు వరసల మధ్య 2-3 మడతలు పెట్టిన న్యూస్ పేపర్‌ను అమర్చాలి.
- ట్రేలలో నింపడానికి ముందుగా కాయలను సైజుల వారీగా గ్రేడింగ్ చేసి జాగ్రత్తగా నింపాలి.
- ట్రేలను జాగ్రత్తగా ఒకదానిపై ఒకటి ట్రాక్టరు లేదా వ్యాన్లలో అమర్చి కుదుపులు లేకుండా మార్కెట్‌కి తరలించి జాగ్రత్తగా అన్‌లోడింగ్ చేయాలి.

విదేశీ మార్కెట్లకు :

- తొడిమలతో కోసి, ట్రేలలో అమర్చి, దుమ్ము, దూళి కాయలపై పడకుండా క్లోజ్డ్ వ్యాన్లలో అమర్చి జాగ్రత్తగా ప్యాక్ హవుస్‌కి తరలించాలి.
- ఇతర సరుకులను వ్యాన్లలో నింపరాదు.
- రవాణాలో పరిశుభ్రత పాటించాలి.

ప్యాక్ హవుస్ వద్ద పాటించాల్సిన పద్ధతులు - సొన తీసే విధానం :

- కాయల్లోని సొన (జీడి) కార్చి తీసివేయడానికి ముందు ప్రతీసారి పరంజాలపై (రాక్స్) పడిన సొనను శుభ్రపరచాలి.
- మామిడి కాయలను తొడిమ క్రిందకు వుండేలా పట్టుకుని తొడిమ అర సెం.మీ. పొడవులో కత్తిరించి రాక్‌ల మీద తలక్రిందులుగా అమర్చాలి.
- కాయల్లో సొన 3 గంటల్లో పూర్తిగా కారిపోతుంది.
- సొన తీసిన కాయలను ట్రేలలో అమర్చి ప్యాక్ హవుస్‌లోనికి తరలించాలి.

ప్యాక్‌హవుస్ శుభ్రపరచటం :

- ప్యాక్ హవుస్‌లో అమర్చిన మొదటి తొట్టిలో లీటరు నీటికి 0.6 మి.లీ. ఇండిట్రాన్ లేదా శాండోవిట్ 250 మి.లీ. గ్రా. లినోమిట్ లేదా ప్రోక్లోరజ్ (ఫంగిసైడ్) కలిపిన నీటిలో ముంచితీసి శుభ్రమైన మెత్తని మల్లుగుడ్డతో తొడిమను తాకకుండా కాయలను 2-3 నిముషాలు తుడవాలి.
- 3 టన్నుల కాయలకొకసారి తొట్టిలోని ద్రావణాన్ని మార్చాలి.
- 2వ తొట్టిలో స్వచ్ఛమైన నీటిని నింపి, ఈ నీటిలో మొదటి తొట్టిలోని కాయలను శుభ్రపరచాలి. నీటి మార్పు ప్రతి 5 టన్నులకు ఒకసారి చేయాలి.

గమనిక : ప్రస్తుతం అటోమేటెడ్ వాషింగ్, ఫంగిసైడ్ ట్రీట్‌మెంట్ వ్యాక్సింగ్ మిషన్‌లు అందుబాటులో వున్నాయి.

వేడినీరు, ఫంగిసైడ్‌తో కాయలను శుద్ధిచేయటం :

- 500 పి.పి.యం. మోతాదులో బినోమిల్ (180 గ్రా. 75 మి.లీ. ఎసిటోన్‌లో కలిపి) లీటరు నీటికి 1 మి.లీ. ఇంద్రిట్రాస్ లేదా టీపాల్ కలిపి ఫాస్పారిక్ అమ్లం ఉపయోగించి ఉదజని సూచిక 4.5 వుండేలా సవరించిన వేడినీటి ద్రావణం (500 పి.పి.యం)లో కాయలను 2-3 నిమిషాలు ముంచి తీయాలి. యూరోపియన్ దేశాలకు బినోమిల్‌కు బదులుగా ప్రోక్లోరజ్ ఫంజిసైడ్ వాడాలి. వేడినీరు, ఫంగిసైడ్‌తో శుద్ధి చేసిన కాయలను ఆరబెట్టి మెత్తని మల్లుగుడ్డతో తుడవాలి.

గ్రేడింగ్ : మామిడి కాయలను సైజువారీ, రంగువారీ గ్రేడింగ్ చేయాలి. గాయాలు, మచ్చలున్న కాయలను తీసివేయాలి.

ప్యాకింగ్ మరియు కోడింగ్ :

- గ్రేడింగ్ చేసిన కాయలను 4 కిలోలు నికర కాయలు బరువుతోపాటు 5 శాతం అధిక బరువు వుండేలా నిర్దేశించిన విధంగా (వెంటిలేషన్ కొరకు) పైవైపు, క్రిందివైపు 4 రంధ్రాలు, ప్రక్కల రెండు రంధ్రాలతో తగిన ధృడత్వం గల 3 అట్టపెట్టెల్లో కాయలను ప్యాక్ చేయాలి.
- కాయలను పెట్టెలో ఒకే వరసలో అమర్చాలి. పెట్టెలో అమర్చిన కాయలన్నీ ఒకే సైజు ఆకారం పరిపక్వత కలిగి వుండాలి.

పైన సూచించిన విధంగా కోత, కోత తర్వాత జాగ్రత్తలు పాటించిన మామిడిలో సత్ఫలితాలను పొందవచ్చు. ✧

తడారే గొంతులకు తాటిముంజలు

ప్రకృతిలో మనకు లభించే పండ్లు, కాయలలో తాటి ముంజలకు ప్రత్యేక స్థానం ఉంది. వేసవి కాలంలో మాత్రమే లభించే తాటి ముంజలంటే ఇష్ట పడనివారంటూ ఉండరు. తాటిముంజల చరిత్ర ఈ నాటిది కాదు. ఎన్నో విలువలు, ప్రోటీన్లను అందించే తాటిముంజలకు పల్లెకోన గ్రామం కేంద్రంగా ఉంది. ఈగ్రామంలో ముంజలు అమ్మకాలపై అనేక కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. తడారే గొంతులకు దాహార్తిని తీర్చడంతో పాటు జీర్ణకోశ ఇబ్బందులను తొలగిస్తాయి. కొబ్బరిబొండాలలోని నీటిని మరపించే తీయటిద్రవం ముంజలలో మాత్రమే దొరుకుతుంది. దీనితోపాటు ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ప్రధానంగా పిండి పదార్థాలు, క్యాల్షియం, శక్తి ఆమ్లాలు ఉన్నాయి. ఎండ తీవ్రతనుంచి కాపాడే విటమిన్లు ముంజలలో మాత్రమే లభ్యమవుతాయి. మూత్రసంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ముంజలు దివ్య ఔషదంగా పనిచేస్తాయి. రక్తంలో యూరిక్ ఆమ్లాలు పెరగకుండా అడ్డు కునే శక్తి వీటికి ఉంది: అలాగే షుగర్ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బుల వారికి ముంజలు మేలు చేస్తాయి. శరీరంలోని ఖనిజాలు, లవణాల శాతాన్ని సమతూకంలో ఉంచేశక్తి యుక్తులు ముంజలకు మాత్రమే ఉందని వైద్యులు అంటున్నారు.

ఆకాశపు అంచులు తాకేదాకా!

మనం కన్న కలలను... ఇంకెవడో కాలరాస్తున్నప్పుడు...
మనం పడ్డ కష్టాన్ని.. వాడెవడో దోచుకుంటున్నప్పుడు..
ప్రశ్నించాలిప్పుడు గట్టిగా... గరుకుగా
శిథిల స్వప్న చీకటిలో
కుప్ప కూలిన బ్రతుకు చిత్రాలను
కళ్లు తడిపిన కనుపాపలను
గుండెల్ని పిండిన గత బాధలను
కాలం కొయ్యకు వేలాడదీసి
నిగ్గదీసి... సిగ్గు విడిచి... అడగాలిప్పుడు
సూటిగా... సమాధానం చెప్పేదాకా....
అట్టడుగు పొరల అంతరాలు చీల్చుకొని
అణగారిన ఆశయాలు దోసిళ్ళలో నింపుకొని
అణచివేత విశృంఖల శృంఖలాలు తెంపుకొని
చైతన్యపు సమర స్ఫూర్తి అణువణువూ... హత్తుకొని
గర్జించాలిప్పుడు... పెత్తందార్ల పెత్తనం పోయేదాకా...
ప్రకటించాలి పిడికిలెత్తి ఆత్మగౌరవ నినాదాన్ని
ఆకాశపు అంచులు తాకేదాకా!

- గంగవరపు సునీత

శాస్త్రీయ సోషలిజానికి మార్గదర్శి కారల్ మార్క్స్



ఎం.సి. వెంకటేశ్వర్లు

పారిశ్రామిక విప్లవం ప్రపంచగతిని మార్చింది. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం అప్రతిహతంగా పురోగమిం చింది. సంపద అనూహ్యంగా పెరిగింది. ఫ్యూడల్ వ్యవస్థ నుండి రైతులు, చేతివృత్తుల వారికి స్వేచ్ఛ లభించింది. 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' నినాదాలు యూరప్ అంతటా వ్యాపించాయి. ఫ్యూడల్ (భూస్వామిక) వ్యవస్థను కూలదోయడానికి బూర్జువాలు (పెట్టుబడిదారులు, పెటీ బూర్జువా వర్గాలు), రైతులు, చేతివృత్తులవారు ఐక్యమయారు. పేదరికం, ఆర్థిక అసమానతలు, వర్గ దోపిడీ అంతమవుతుందని శ్రామికవర్గాలు ఆశించాయి. కాని స్వేచ్ఛ, సమానత్వమనేవి మిధ్యగా మారాయి. ఉత్పత్తి సాధనాలను పోగొట్టు కున్న రైతులు, చేతివృత్తులవారు శ్రామికవర్గం అనబడే నూతన వర్గంగా ఏర్పడింది. ఈ వర్గం సృష్టించే సంపదతో పెట్టుబడిదారీ వర్గమనబడే పాలకవర్గం ఏర్పడింది. రైతులు, చేతివృత్తులవారు ఆశించిన దోపిడీ అంతం కాకపోగా, నూతన పద్ధతుల్లో మరీ నగ్నంగా అమలుజరుగు తున్నది. నూతనంగా ఆవిర్భవించిన పెట్టుబడిదారులు, కార్మికుల మధ్య పోరాటాలు ప్రారంభమయాయి. ఈ పూర్వ రంగంలో మనిషిని, మనిషి దోపిడీ చేసే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, నూతన సోషలిస్టు సమాజాన్ని సృష్టించే మార్క్సిజమనే నూతన సిద్ధాంతాన్ని మార్క్స్ ప్రతిపాదించాడు. 1917 రష్యన్ అక్టోబరు విప్లవానికి (లెనిన్ సారధ్యంలో) మార్క్స్ రూపొందించిన ఈ సిద్ధాంతం ఆయుధంగా ఉపయోగపడింది.



కారల్ మార్క్స్ 1818 మే 5వ తేదీన ప్రష్యాలోని రైన్ రాష్ట్రంలోని ట్రయర్‌లో ఒక న్యాయవాది కుటుంబంలో జన్మించారు. 1830-35 వరకు ట్రయర్ జిమ్నాసియా (సెకండరీ స్కూల్)లో చదివారు. ఆ తర్వాత బాన్‌లోనూ, బెర్లిన్ యూనివర్శిటీలో 'లా' చదివి పట్టా పొందారు. అదే సమయంలో తత్వశాస్త్రం, చరిత్ర, అధ్యయనం చేశారు. బాన్ యూనివర్శిటీలో ఆచార్యుడుగా చేరాలన్న కోర్కె కారల్ మార్క్సకున్నది. అప్పటికే మార్క్స్ అనేక పురోగామి సైద్ధాంతిక రచనలు జేశారు. దీంతో అభివృద్ధి నిరోధక ప్రష్యన్ ప్రభుత్వం ఆచార్య పదవికి అనుమతించలేదు. రైనిషె జైటుంగ్ పత్రికలో చేరి సంపాదక బాధ్యతలు చేపట్టారు. ఆ పత్రిక ద్వారా కార్మికవర్గ అనుకూల, పాలక వర్గ వ్యతిరేకంగా అనేక వ్యాసాలు వ్రాశారు. దీనిపై కన్నెర్రజేసిన ప్రష్యన్ ప్రభుత్వం 1843 జనవరి 19న పత్రికను నిషేధించింది.

విద్యార్థి దశనుండే సమాజంలోని వివిధ వర్గాల ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేశారు. 1831, 1834 సంవత్సరాలలో ల్యాన్స్ కార్మికుల తిరుగుబాటు, 1830 దశకం చివర బ్రిటన్‌లో శ్రామికవర్గ విప్లవోద్యమం, 1842లో పతాక స్థాయికి చేరిన చార్టిస్టు ఉద్యమం, 1957 నాటికి ఆర్థిక సంక్షోభం యూరప్‌ను ముంచెత్తగా కార్మిక, కర్షక ఉద్యమాలు వెల్లువెత్తాయి. వలసవాదానికి వ్యతిరేకంగా అనేక దేశాలలో ప్రజాతంత్ర ఉద్యమాలు, జాతీయోద్య మాలు ముందుకు వచ్చాయి. పోలిష్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. జర్మనీ, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లలో జరిగిన అనేక కార్మిక, రైతు ఉద్యమాలు మార్క్స్ ఆలోచనా విధానానికి పదును పెట్టాయి.

వలస వ్యవస్థకు వ్యతిరేకంగా జాతీయోద్యమాలు, పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా చైతన్యయుతమైన కార్మికోద్య మాలు తలెత్తడంతో వాటిని సంఘటితం చేసి అంతర్జాతీయంగా కార్మికోద్యమాన్ని నిర్మించవలసిన అవసరాన్ని మార్క్స్ గుర్తిం చాడు. 1864లో మొదటి ఇంటర్నేషనల్ స్థాపించి; దానికి నాయకత్వం వహించాడు. రోజుకు 8 గం॥ల పని విధానాన్ని, పిల్లలకు, చిన్నవారికి తక్కువ పని గంటలు, వారికి సాంకేతిక విద్య గరపడంతోపాటు శారీరక, మానసిక విద్యావకాశాలు కల్పించాలన్న డిమాండ్లను ఫస్ట్ ఇంటర్నేషనల్‌లో ప్రతిపాదించి మార్క్స్ విజయం సాధించాడు.

అయితే మొదటి ఇంటర్నేషనల్ అంత సజావుగా జరగలేదు. ఈ సంస్థలో బ్రిటీష్ ట్రేడ్ యూనియనిస్టు అవకాశవాదులు, పెటీ బూర్జువా సిద్ధాంతవేత్తలైన ప్రౌధాన్ అనుయాయులు, సంస్కరణవాదులైన లసాలె అనుయాయులు, అరాచకవాదులైన బకూనినిస్టులతో మార్క్స్ రాజీలేని సైద్ధాంతిక పోరాటం జరిపాడు.

మరోప్రక్క హెగెల్, డెమోక్రాటిక్, ఎపిక్యురస్, లుడ్విగ్ ఫ్యూర్ బాలతాత్విక సిద్ధాంతాలను, హెన్రీసెయింట్, సైమన్, ఛార్లెస్ పోరియర్, రాబర్ట్ ఒవెన్‌ల ఊహాజనిత సోషలిస్టుల సిద్ధాంతాలను విమర్శనాత్మ కంగా అధ్యయనం చేశారు. మత, మూఢ విశ్వాసాలకు, భావవాదానికి, ఊహాజనిత సోషలిస్టు భావనలకు స్వస్తి పలికి గతితార్కిక, చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని, శాస్త్రీయ సోషలిస్టు భావనలకు మార్క్స్ రూపకల్పన చేశారు. సమాజంలో అసమానత

లకు, కార్మికోద్యమాలకు మూలకారణం దోపిడి అన్న విషయాన్ని అదనపు విలువ సిద్ధాంతం ద్వారా నిరూపించారు. పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

ఇదే సందర్భంలో ఆర్థిక పోరాటాలతోనే వర్గ దోపిడీ అంతం కాదని, రాజకీయాధికారాన్ని కార్మికులు, కర్షకులు సాధించాలన్నది మార్క్స్ లక్ష్యం. ఆర్థిక పోరాటంతోపాటు రాజకీయ పోరాటం జరపాలని పిలుపిచ్చాడు. కార్మికవర్గం రోజువారి జరిపే ఉద్యమాలకు, తుది లక్ష్యం కోసం జరిపే పోరాటానికి మధ్య గల సంబంధాలను మార్క్స్ విశదీకరించాడు. ఉత్పత్తి సాధనాలైన భూమిని సమాజపరం చేయుటతోపాటు, ఫ్యాక్టరీలు, గనులను సమిష్టి యాజమాన్యం క్రిందకు తీసుకురావాలని ప్రతిపాదించాడు. కార్మికోద్యమంలోని సంస్కరణ, అవకాశవాదులు వ్యతిరేకించారు. అయినా మార్క్స్ ఏమాత్రం వెనకడుగు వేయకుండా తన ఎజెండాను ముందుకు తీసుకెళ్ళాడు.

పారిస్ కమ్యూన్ (1871, మార్చి 8) మార్క్స్ సిద్ధాంతానికి ఆచరణాత్మక రూపం. చాలా స్వల్పకాలమే అధికారంలో ఉన్నప్పటికీ భవిష్యత్ విప్లవాలకు అనేక గుణపాఠాలు నేర్పింది. పారిస్ కమ్యూన్‌కు మద్దతుగా ప్రపంచవ్యాపిత సంఘీభావం కొరకు పిలుపిచ్చాడు. అయినా దాని నాయకత్వం చేసిన లోపాలు పారిస్ కమ్యూన్ పతనానికి దారితీసింది. పారిస్ కార్మికవర్గంపై తీవ్ర దాడులు జరిగాయి. మార్క్స్ ఏమాత్రం అధైర్యపడకుండా దాని తప్పిదాలపై గుణపాఠం తీసుకొని, కార్మిక, రైతు సఖ్యత లేకుండా విప్లవాలు విజయవంతం కావని, గ్రామీణ ప్రాంత ప్రజల మద్దతున్నపుడు విజయం సిద్ధించగలదన్న నిర్ధారణకు మార్క్స్ వచ్చాడు.

సిద్ధాంత రూపకల్పనతోనే సమస్యలన్నిటికీ పరిష్కారం కాదన్నది మార్క్స్ అభిప్రాయం. ఏంగెల్స్ 1844లో పారిస్‌లో మార్క్స్‌ను కలిశాడు. అంతర్జాతీయ కార్మికవర్గ సంస్థతోపాటు, వివిధ దేశాలలో కార్మికులకు సొంత రాజకీయ పార్టీల ఏర్పాటుకు మార్క్స్, ఏంగెల్స్‌లు పూనుకున్నారు. ఈ ప్రయాణంలో అనేక అవాంతరాలను ఎదుర్కొన్నారు. ప్రష్యన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ ప్రభుత్వాలు మార్క్స్‌ను బహిష్కరించాయి. దాంతోపాటు అంతర్జాతీయంగా కార్మికోద్యమంలో పాతుకుపోయిన ప్రౌధనిస్టులు, బ్లాంక్విస్టు ఒంటెత్తు పిడివాదులు, బకూనిస్టులు, బ్రిటీష్ ట్రేడ్ యూనియన్‌లో యాజమాన్య అనుకూల అవకాశవాదులతో మార్క్స్, ఏంగెల్స్‌లు నిర్విరామ పోరాటం చేశారు. ఆ దిశగా విజయం సాధించారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రపంచవ్యాపితంగా విస్తరింపచేయుటలో మార్క్స్ కృషి అసమానం, అద్వితీయం. సోషలిజం కమ్యూనిజం స్థాపనే మార్క్సిజం ప్రధాన లక్ష్యంగా ప్రకటించాడు.

నిరంతరం అభివృద్ధి చెందే సిద్ధాంతం. ప్రపంచ కార్మిక వర్గానికి నూతన సిద్ధాంతాన్ని ఆవిష్కరింపజేసిన మార్క్స్ జీవితంలో ఎవరూ ఊహించని బాధలనుభవించాడు. ఆర్థిక ఇబ్బందులొకవైపు, దేశ బహిష్కరణలొకవైపు, కన్నబిడ్డలకు వైద్యం చేయించలేని నిస్సహాయత వెంటాడాయి. తనకంటే ముందు కన్నబిడ్డలు చనిపోయారు. రెండు సంవత్సరాల ముందు 1881లో భార్య జెన్ని చనిపోయింది. అసలే అనారోగ్యంతో బాధపడుతున్న మార్క్స్ భార్య చనిపోవడంతో కృంగిపోయాడు. 1883 మార్చి 14వ తేదీన మార్క్స్ శాశ్వతంగా కన్నుమూశాడు. 1883 మార్చి 17 శనివారం లండన్‌లోని హైగెట్ స్మశానంలో మార్క్స్‌ను సమాధి చేశారు. అయినా ప్రపంచ ప్రజల హృదయాలలో మార్క్స్ ప్రతిరూపం నిలిచేవుంది. ఆయన సాగించిన నిస్వార్థ, వీరోచిత పోరాటం గురించి ఏంగెల్స్ మాట్లాడుతూ "ఆయన పేరు, అలాగే ఆయన కృషి యుగయుగాలుగా నిలిచిపోతుంది" అని ముగించాడు. ✧

కష్టాల కడలిలో పూదోట రైతులు

ప్రస్తుత పరిస్థితులలో పూదోట రైతులు కష్టాల కడలిలో మునిగి తేలుతున్నారు. ప్రతి ఏటా పూలసాగు చేయడం కడప జిల్లాలోని పులివెందల ప్రాంత రైతులకు అలవాటు, అయితే ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు విస్తీర్ణం కూడా చాలా తగ్గింది. వ్యాపార, వాణిజ్య, కూరగాయలు, ఆహారధాన్యాలతో పాటు పూల సాగు కూడా రైతులు సాగుచేస్తారు. నీటి వసతి గల రైతులు మాత్రమే పూల సాగు చేస్తారు. చెండుమల్లె, జాజి, సన్నమల్లె, కనకాంబరాలు తదితన పూలను సాగుచేస్తారు. కానీ ఈ ఏడాడి అతి తక్కువగా వర్షపాతం కావడంతో అధికసాగు పట్ల మక్కువ చూపలేకపోయామని రైతులు చెబుతున్నారు. సాధారణంగా పూలకు నవంబరు నుంచి మార్చి వరకు మంచి గిరాకీ ఉంటుంది. ఇతర ప్రాంతాలకు కూడా ఇక్కడి పూలను సరఫరా చేస్తారు. దీంతో రైతులకు, వ్యాపారులకు, కూలీలకు కూడా కొంత వరకు ఆదాయం ఉంటుందని చెప్పవచ్చు. సమయాను కూలంగా అరుదెంచే పండుగలు, పర్వదినాలు, జాతరలు, తిరుణాళ్ళ సందర్భంగా మాత్రమే పూలకు గిరాకీ ఉంటుంది. కానీ సాగు నీటి సమస్య రైతులను వెంటాడుతుండటంతో ఏపంట పూర్తి స్థాయిలో రైతుల సాగు చేయలేకపోతున్నారు. ఏడాదికి వస్తే ఖరీఫ్, రబీ సీజన్లు రెండూ ఉస్సూరమనిపించాయి. అడపా దడపా వచ్చిన వర్షాలకు కుంటలలో నీరు చేరినా వేసవి రాగానే అవి ఎడారులను తలపిస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది రైతుల బోర్లలో నీటి మట్టం తగ్గిపోయింది. సాగునీటి వసతి ఉంటే తప్ప వివిధ రకాల పంటలను సాగుచేయని పరిస్థితి కనిపిస్తోంది. మొత్తంమీద ప్రస్తుత స్థితిలో పూదోట వల్ల రైతులు కష్టాలను అనుభవిస్తున్నారని చెప్పవచ్చు. ఇప్పటికైనా ఈ ప్రాంతరైతుల సాగు నీటి వసతి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గోగు

నార పంటల్లో జనుము తర్వాత గోగు అతి ముఖ్యమైన వాణిజ్య పంట. గోగు పండించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానాన్ని ఆక్రమిస్తుంది. మన రాష్ట్రంలో ఈ పంట ఎక్కువగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దాదాపు నలభై వేల ఎకరాలలో నార కొరకు సాగు చేయబడుతుంది. సాలీన ఒక లక్ష బేళ్ళ నార (180 కిలోలు ఒక బేలుకి) ఉత్పత్తి అవుతుంది. రాష్ట్ర సరాసరి నార దిగుబడి ఎకరాకు 5.70 క్వింటాళ్ళు. గోగును నార కొరకే కాకుండా ఇతర పరిశ్రమల్లో కూడ ఉపయోగిస్తున్నారు. గోగు మొక్కల నుండి తీసిన గుజ్జు వార్తా పత్రికల ముద్రణకు అవసరమయ్యే కాగితాన్ని తయారు చేయటానికి శ్రేష్ఠమైనది. గోగు పువ్వుల పత్రదళాలు (కేలిక్స్) సహజరంగుల తయారీలో వినియోగింపబడుతున్నాయి. గోగు విత్తనాల నుండి తీసిన నూనెను సబ్బుల పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నారు. శుభ్రపరచిన నూనెను వంట నూనెగా కూడా వాడవచ్చు. కార్డు బోర్డులు మరియు గృహాలంకరణ వస్తువుల తయారీలో ఉపయోగిస్తున్నారు.

నేలలు : గోగును అన్ని నేలల్లో సాగుచేయవచ్చు. తేలిక రకపు గరపనేలలు. ఎర్రనేలలు, మురుగు నీరుపోయే వసతి గల నేలలు అనుకూలం. ఆమ్ల భూములకు భూసార పరీక్షననుసరించి ఎకరాకు 1 టన్ను వరకు సున్నం వేయాలి.

విత్తన మోతాదు మరియు విత్తనశుద్ధి : నార గోగు (హైబిస్కస్ సబ్దరిఫా) ఎకరాకు 5 కిలోలు, కూర గోగు (హైబిస్కస్ కెన్నాబినస్) ఎకరాకు 6 కిలోలు. కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ లేదా 4 గ్రాముల థయోమిథాక్సిమ్ తరువాత మెటలాక్సిల్ యం.జెడ్ 2 గ్రాములు లేదా మెటలాక్సిల్ 3 గ్రాములు లేదా 3 గ్రాములు మరియు భూమిద్వారా సంక్రమించు ఇనుప తెగులును నివారించవచ్చు.

విత్తే కాలం : ఖరీఫ్‌లో మే మొదటి పక్షం నుండి జూన్ మొదటి పక్షం వరకు విత్తుకుంటే అధిక నార దిగుబడి వస్తుంది. రబీలో నీటి వనరుల గల మాగాణి భూములలో వరి కోసిన తరువాత రెండవ పంటగా ఫిబ్రవరి, మార్చి నెలలో వేస్తారు.

విత్తడం : సాంప్రదాయంగా వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తారు. వరుసల్లో వేసినట్లయితే గొర్రుతో 30×10 సెం.మీ. దూరంలో విత్తాలి. వెదజల్లుట పద్ధతికన్నా వరుసల్లో వేయుట చాలా ఉత్తమం. గోగులో మిశ్రమ పంటగా 4 కిలోల మినుము విత్తనం కలిపి వెదజల్లవచ్చు.

ఎరువులు : ఎకరాకు 5 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఆమ్ల భూములకు భూసార పరీక్షననుసరించి ఎకరాకు 1 టన్ను వరకు సున్నం విత్తనం వేయుటకు పక్షం రోజులు ముందుగా వేసి కలియదున్నాలి. ఆఖరి దుక్కిలో 18 కిలోల యూరియా, 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 13.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. పైపాటుగా మరో 18 కిలోల యూరియాను విత్తిన 3 వారాలకు మొదటి గొప్పులో వేయాలి. పైపాటుగా వేయలేని పక్షంలో మరియు నీటి ఎద్దడి పరిస్థితిలో లీటరు నీటికి 2% యూరియాను మరియు 1% మ్యూరేట్ ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

రకాలు :

రకం	పంటకాలం (రోజుల్లో)	దిగుబడి (క్వి/ఎ)	గుణగణాలు
నారగోగు (హైబిస్కస్ సబ్దరిఫా)			
ఎ.ఎమ్.వి.-3 (సూర్య)	150	7.5	అన్ని ప్రాంతాలకు అనువైనది. నీటి ఎద్దడిని మరియు ఇనుప తెగులును తట్టుకొంటుంది.
ఎ.ఎమ్.వి-4 (కళింగ)	150	8.0	నీటి ఎద్దడిని తట్టుకొంటుంది. వర్షాధార పంటగా అనుకూలమైనది. పురుగులు, తెగుళ్ళను ఓ మోస్తరుగా తట్టుకొంటుంది.
ఎ.ఎమ్.వి.-5 (దుర్గ)	135-140	10	అధిక నార దిగుబడి నిచ్చు రకం. పురుగులు, తెగుళ్ళను ఓ మోస్తరుగా తట్టుకొంటుంది.
ఎ.ఎమ్.వి.-7 (జనార్ధన్	130-135	12	అధిక నార దిగుబడినిస్తుంది. వర్షాధార పంటగా అనుకూలమైనది. పురుగులు, తెగుళ్ళను ఓ మోస్తరుగా తట్టుకుంటుంది.
కూరగోగు (హైబిస్కస్ కెన్నాబినస్)			
భీమిలి-1 (ఎ.ఎమ్.సి.108)	120-130	5	నార నాణ్యత కలిగి అలంకార వస్తువుల తయారీకి అనువైన రకం

నీటి యాజమాన్యం : నారగోగును వర్షాధారంగా పండిస్తారు.

అంతరకృషి : విత్తిన 3 నుండి 5 వారాలకు గొప్పు, కలుపు తీయడం చేయాలి. వరుసలలో వేసిన పంటలో విత్తిన 20 నుండి 25 రోజులలో గొర్రుతో అంతరకృషి చేయాలి. కలుపు తీవ్రతను బట్టి విత్తిన 7 వారాలలోపు రెండవ సారి గొప్పు త్రవ్వాలి. సకాలంలో అంతరకృషి చేయకపోతే నార దిగుబడి దాదాపు 30 శాతం తగ్గుతుంది. మొదటి గొప్పు బదులుగ, కలుపు నివారణ మందు ఫ్లూక్లోరాలిన్ 45% ఎకరాకు 800 మి.లీ. లీటర్లు లేదా పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1 నుండి 1.3 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గాని పిచికారీ చేసి కలుపును సమర్థవంతంగా నివారించవచ్చు.

పిండినల్లి : ఈ పురుగులు ముదురు గులాబీ రంగులో ఉంటాయి. తల్లిపురుగు 200 నుండి 300 వరకు గుడ్లను సముదాయంలో మొక్క కణుపుల వద్ద పెడుతుంది. ఈ గుడ్లు పొదిగి 7 రోజులలో గోధుమరంగు పిల్లపురుగులు బయటకు వచ్చి 24 గంటలలో కణుపుల వద్ద చేరతాయి. తల్లి, పిల్ల పురుగులు మైనం వంటి తెల్లని పొడితో కప్పబడి మొక్క కొన భాగాన లేత కణుపుల వద్ద చేరి రసాన్ని పీల్చడం వలన కణుపులు దగ్గర దగ్గరగా ఏర్పడి మొక్క చిగురి భాగం ముద్ద బంతి ఆకారంగా తయారవుతుంది. పిండినల్లి ఎక్కువగా ఆగష్టు - సెప్టెంబరు నెలలో ఆశిస్తుంది. పిండినల్లి గాలి ద్వారా లేదా చీమల వలన లేదా పక్షులు లేదా మనుష్యుల వలన ఒక మొక్క నుండి వేరొక మొక్కకు వ్యాపిస్తుంది. పిండినల్లి ఆశించిన మొక్కలను సేకరించి కాల్చి వేయాలి. గట్ల వెంబడి మరియు పొలములో కలుపు మొక్కలు (పార్థీనియమ్. తుత్తరబెండ, నానుబాలు) ఏరివేయాలి. దీనిని నివారించుటకు 5 మి.లీ. వేపనూనె లేదా 5 మి.లీ. కానుగనూనె లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.మీ. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లేదా మిథైల్ పెరాథియాన్ 2మి.లీ. లేదా మలాథియాన్ 2 మి.లీ. లేదా డైమితోయేట్ 2 మి.లీ. శాండోవిట్ లేదా టీ మొదళ్ళ దగ్గర నేలపై పిచికారీ చేయడం వలన సమర్థవంతంగా నివారించవచ్చు.

పచ్చగొంగళి పురుగు : తల్లి పురుగు ఆకుల భాగాన పసుపు రంగు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు 3 రోజుల్లో పొదిగి గొంగళి పురుగు బయటకువస్తుంది. ఈ గొంగళి పురుగు ఆకుపచ్చని రంగులో ఉండి పైన 2 తెల్లని చారలు వుంటాయి. ఈ పురుగు ఆకులను తిని ఈనెలు మాత్రమే మిగులుస్తుంది. గొంగళి పురుగు దశ 22 రోజుల వరకు ఉండి కోశస్థదశకు మారుతుంది. ఈ దశలో 7 రోజులు ఉండి సీతాకోక చిలుక బైటకు వస్తుంది. ఈ పురుగు జీవిత కాలం 30 -32 రోజులు. ఈ పురుగు పైరును ఏ దశలోనైనా ఆశించవచ్చు. కాని పైరు తొలిదశలో అనగా జూలై నుండి సెప్టెంబర్ వరకు ఆశించే అవకాశం ఎక్కువ. దీని నివారణకు గొంగళి పురుగులు, గుడ్లు ఆకులపై కన్పించిన వెంటనే ఏరివేయాలి. లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి ఆకులు చివరలు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

దీపపు పురుగులు : ఇవి లేత పసుపు రంగులో ఉండి ఆకుల ఈనెలలో గుడ్లు పెడతాయి. ఈ గుడ్ల నుండి 3-4 రోజులలో పిల్ల పురుగులు వస్తాయి. ఈ పిల్ల పురుగుల గోధుమ రంగులో ఉండి తల్లి పురుగును పోలి 14 రోజులలో తల్లి పురుగులుగా మారతాయి. పిల్ల, తల్లి పురుగులు ఆకు అడుగుభాగంలో ఉండి రసాన్ని పీల్చడం. వలన ఆకులు క్రమేపి ఎర్రబారి ముడుచుకొని పోతాయి. ఈ పురుగు తాకిడి ఎక్కువైతే మొక్కలు ఎదగక గిడసబారుతాయి. దీపపు పురుగులు మే నుండి జూలై నెలాఖరు వరకు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి నివారణకు గాను మిథైల్‌డెమటాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 0.2 గ్రా. లేదా అసిటామిప్రిడ్ 0.2గ్రా. లీటరు నీటికి కలిపి ఆకులు అడుగుభాగం బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

పేనుబంక : గోగుతో బాటు ఈ పేనుబంక ప్రత్తి, వంగ, బెండ, మిరపలను కూడ ఆశిస్తుంది. లేత పసుపు రంగులో రెక్కలు లేని పిల్ల పురుగులు క్రమేపి వారంలో మెరిసే నల్లని పెద్ద పురుగులవుతాయి. ఆకుల అడుగుభాగాన గుంపులుగా వుండే ఈ పేలు లేత ఆకుపచ్చ శరీరంతో అండాకృతితో ఉంటాయి. ఇవి రసాన్ని పీల్చడం వలన ఆకులు లోపలి వైపుకు ముడతపడి ఆకారము కోల్పోతాయి. పిందెల రక్షక పత్రాల నుండి కూడా రసాన్ని పీలుస్తాయి. ఆశించిన ఆకులు, పిందె రక్షకపత్రాలు వాడి రాలిపోతాయి. మొక్క ఎదుగుదల, దిగుబడి, నాణ్యత తగ్గుతాయి. దీనిని నివారించుటకు డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఆక్సిమిథైల్ డెమటాన్ 2.0 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0. 25 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 0.2 గ్రా. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

తెగుళ్ళు :

ఇనుప తెగులు : ఈ తెగులు ఫైటోఫైరా పేరసైటికా అనే శిలీంధ్రం వలన వస్తుంది. తెగులు సోకిన మొక్కల కాండంపై తెలుపు మరియు నీలి వర్ణంతో కూడిన పొడలు ఏర్పడతాయి. క్రమేపి ఈ శిలీంధ్రాలు ఒక దానితో ఒకటి కలిసి లేదా ఊదారంగు ఏర్పడుతుంది. ఈ తెగులు భూమిని ఆనుకొని ఉన్న మొదలు పై నుండి 60 సెం.మీ. ఎత్తు వరకు వ్యాపిస్తుంది. తెగులు సోకిన మొక్కలు తేలికగా ఉండి, నార తీసేటప్పుడు పీచులుగా, ముక్కలుగా తెగిపోయి నార నాణ్యత, దిగుబడి తగ్గుతుంది. ఈ తెగులు మొక్కకు ఏ దశలోనైనా ఆశించవచ్చు. అధిక తేమ ఉన్నప్పుడు తెగులు ఉధృతి కూడా ఎక్కువ. దీని నివారణకు తెగులును తట్టుకొనే ఎ.ఎమ్.వి (సూర్య) రకాన్ని వేసుకోవాలి. చేలో మురుగు నీరు పోయేటట్లు చేయాలి. లోతట్టు ప్రాంతాలు భూమిలో తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ తెగులు ఉధృతి ఎక్కువ కావున ఈ నేలలు గోగు సాగుకు పనికిరావు. వేసవిలో లోతు దుక్కి చేసిన ఎడల శిలీంధ్రం నశిస్తుంది. కిలో విత్తనానికి 3

గ్రాముల మోటలాక్సిల్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంట మార్పిడి చేయాలి. తెగులు సోకిన మొక్కలను కాల్చాలి. తెగులు వ్యాప్తి చెందకుండా లీటరు నీటికి 2 గ్రా. మెటలాక్సిల్ ఎమ్.జడ్.లేదా మాంకోజెబ్ 3 గ్రా. కలిపి తెగులు సోకిన ప్రాంతం మరియు మొక్క మొదళ్ళు తడిచేట్లు పిచికారీ చేయాలి.

ఆకు ఎండు తెగులు : ఈ తెగులు ఫిల్లోస్టికా అనే జాతికి చెందిన శిలీంధ్రము వలన వస్తుంది. తెగులు సోకిన ప్రదేశము లేత గోధుమ వర్ణము నుండి ముదురు గోధుమ వర్ణములోకి మారును. తెగులు ఉద్రిక్తత ఎక్కువైనపుడు మొక్కల ఆకులు ఎండి రాలిపోవును. ఈ తెగులు నారగోగు రకాలకన్నా కూరగోగు రకాలలో అధికము. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా ఒక లీటరు నీటికి కలిపి వారము రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయవలెను.

పల్లాకు తెగులు : ఇది జెమినివిరెడే జాతికి చెందిన వైరస్ తెగులు. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు సోకిన మొక్కల ఆకుల ఈనెలు పసుపు రంగుకు మారును. ఈనెల మధ్య భాగము లేత మరియు ముదురు రంగు మిశ్రమముతో కూడిన పసుపు పచ్చని మచ్చలు ఏర్పడతాయి. తదుపరి ఆకులు పూర్తిగా పత్రహరితము కోల్పోయి తెలుపు వర్ణములో మారును. మొక్క ఎదుగుదల తగ్గి గిడసబారును. ఈ తెగులు లేత దశలో ఆశించిన, నార దిగుబడి గణనీయంగా తగ్గిపోవును. ఈ తెగులు వ్యాప్తి చేయు తెల్లదోమ నివారణకు లీటరు నీటికి 5% వేపగింజలు కషాయము లేక 2 మి.లీ. ట్రైజోఫాస్ లేక 2 మి.లీ. ప్రొపినోఫాస్ లేక 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ. డైమిథోయేట్ పిచికారి చేసి నివారించుకోవచ్చును. ఇవే కాకుండా ఆకుపచ్చ, చిగురు ఎండు, బూడిద, గజ్జి తెగుళ్ళు ఆశిస్తాయి. కాని వాటివలన ఎక్కువగా నష్టము ఉండదు.

పంటకోత : నార గోగును 50% పూత దశలోను, కూరగోగు రకాలను చిన్న పిందె ఏర్పడే దశలలోను కోయుట మంచిది. గోగు కర్రలను వ్రేళ్ళతో సహా పీకడం కన్నా నేల మట్టానికి కోయడం మంచిది. దీని వల్ల కర్ర త్వరగా ఊరి, నాణ్యమైన నార వస్తుంది. కోసిన కర్రలను నేలమీద వేసి, 2-3 రోజుల తరువాత చిన్న చిన్న కట్టలుగా కట్టి ఊరవేతకు సిద్ధంగా చేసుకోవాలి.

పంటకోత తర్వాత నష్టాలు. : నీటి కొరత వలన పంట కోతకు, ఊరవేయటానికి మధ్య కాల వ్యవధి వున్నట్లయితే కర్రను చెదలు నష్టపరుస్తాయి. అట్టి పరిస్థితుల్లో చెదలను నివారించటానికి కర్రలపై కార్బరిల్ పొడిని చల్లాలి లేదా క్లోర్‌పైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి మొదళ్ళపై పిచికారీ చేయాలి.

గోగు ఊరవేయటం మరియు నారతీత : గోగు కర్ర ఊరి నారతీసేందుకు సాధారణంగా 3 వారాలు పడుతుంది. ఊరేందుకు పట్టే సమయం, నీటి ఉష్ణోగ్రత, నీటి ఉదజని సూచిక, ఊరుటకు అవసరమయ్యే సూక్ష్మజీవులు, నీటిలో అమ్లజని, గోగు కర్రల పరిపక్వత మొదలగు అంశాలపై ఆధారపడుతుంది.

గోగు కర్రలను చిన్న చిన్న కట్టలుగా కట్టి ఊరవేసేందుకు ముందు కర్రలపై 1.25% యూరియా ద్రావణం (ఒక లీటరు నీటికి 12.5 గ్రా. యూరియా కలిపి) లీటరు నీటిలో కలిపి కాండము పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. ఈ విధంగా చేయడం వలన కర్ర వారం నుండి పదిరోజుల ముందు ఊరుతుంది. ఈ విధంగా వీలు కాని పక్షంలో 3-4 కిలోల యూరియాను బడ్డీలుగా వేయనపుడు కట్టలపై వెదజల్లడం వలన కూడా నార త్వరగా ఊరుతుంది. గోగు కర్రల మొదళ్ళు 2-3 అడుగులు మునిగేటట్లు 4-5 రోజులు నిటారుగా నిలబెట్టాలి. తరువాత బడ్డీలు వేసి మునుగుటకు రాళ్ళను లేదా సిమెంటు దిమ్మలను ఉంచాలి. ఈ ఊరిన కర్రల నుండి నారతీసి శుభ్రమైన నీటిలో ఉతికి ఎండలో ఆరబెట్టాలి.

ఆధునిక పద్ధతులలో గోగునార తీయు విధానాలు : ఈ విధానాలలో అతి తొందరగా ఊరటానికి కావలసిన సూక్ష్మజీవులు సముదాయాన్ని ఉపయోగించుట వలన నార ఊరు కాలం చాలా మటుకు తగ్గటమే కాకుండా, కావలసిన నీటి పరిమాణం తగ్గుతుంది. ఈ విధానాలను అనుసరించుట వలన వాతావరణ కాలుష్యం బాగా తగ్గి నాణ్యమైన నారు లభించి ఎక్కువ ధర పలుకుతుంది. ఇవి రెండు విధాలు.

1. యంత్ర సహాయ సూక్ష్మజీవుల సముదాయ ఊరవేత : గోగు కాండము నుంచి నారనించే పై తొడుగును యంత్ర సహాయాలతో తీయవచ్చును. మానవశ్రమతో (కాళ్ళతో తొక్కే) నడుచు యంత్రం ద్వారా గంటకు 15 కిలోల నార తొడుగు తీయవచ్చును. అదే విధంగా విద్యుత్‌తో నడుచు (1 హెచ్.పి.) యంత్రం ద్వారా గంటకు 25 కిలోల నార తొడుగు తీయవచ్చును. ఈ విధంగా తీసిన ఆకుపచ్చని నార తొడుగు మీద ఒక కేజీ సూక్ష్మజీవులు కలిగిన పొడిని చల్లవలెను. నార గొడుగును ఒక గంట కాలం పాలిథిన్ షీటుతో కప్పవలెను. ఈ నార తొడుగులను, పాలిథీన్ లైనింగ్ కలిగిన ఒక మీటరు పొడవు, ఒక మీటరు వెడల్పు, ఒక మీటరు లోతు గలిగిన తొట్టి నందు గల నీటిలో, ఫ్రేముల మీద వేళ్ళాడదీయాలి. ఐదు నుండి ఏడు రోజులలో నార తొడుగు ఊడి గోగునారగా తయారగును. ఈ నారను బయటికి తీసి బాగా మంచి నీటితో కడిగి ఆరవేయవలెను.

2. చిరు చెరువుల సూక్ష్మజీవుల సముదాయ ఊరవేత : ఈ పద్ధతిలో ఒక మీటరు లోతుతో 6.5 మీటర్లు అడుగు భాగం. 7.5 మీటర్లు పైభాగం చుట్టు కొలత గలిగిన చిన్న చెరువుల లాంటి గుంటను తయారు చేయవలెను. గుంట చుట్టూ మీటరు వెడల్పుతో గట్టు వేయవలెను. ఈ విధంగా తవ్విన గుంటలో 30×27 అడుగుల పరిమాణం కలిగిన 800-1000 గేజి పాలిథీన్ షీటును గట్టు మీదకు వచ్చే విధంగా పరచవలెను. ఈ గుంతలో నేలమట్టానికి కోసిన గోగు మొక్కలను చంద్రాకారంగా అమర్చవలెను. దాదాపు మూడోవంతు ఎకరం మొక్కలను, ఈ పరిమాణం గల గుంటలో ఊరవేయవచ్చును. గోగు కర్రలను మూడు దొంతర్లుగా పేర్చవలెను. ప్రతి దొంతర మీద ఒక కేజీ సూక్ష్మజీవుల పొడిని చల్లవలెను. ఈ విధంగా సుమారు 10 కిలోల పొడి, ఒక ఎకరం గోగు కర్రలను ఊరవేయుటకు సరిపో

కానుగ

మన రాష్ట్రంలో కానుగ మొక్కలు ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం మరియు చిత్తూరు జిల్లాల్లో విస్తారంగా వున్నాయి.

ఉపయోగాలు : దీనిని వంట చెఱకుగా ఉపయోగించవచ్చు. కిలో వంట చెఱకు నుండి 4,600 కి. క్యాలరీల శక్తి ఉత్పత్తి అవుతుంది. దీని కలప గట్టితనాన్ని కలిగి ఉండటంవల్ల బండి చక్రాలు మరియు ఫర్నీచర్ తయారీకి ఉపయోగపడుతుంది. కలప గుజ్జును కాగితం తయారీకి, చెట్టు బెరడుతో తాళ్ళు, ఆకులను పశువుల జీర్ణశక్తిని పెంచడానికి మేతగా వాడవచ్చు. వరి, కాఫీ, వక్క, చెఱకు మరియు వివిధ పంటలకు పచ్చిరొట్టలా వేసుకోవచ్చు. దీని ఆకులను పచ్చి రొట్టలా వాడినప్పుడు టమాట పంటలో నులి పురుగుల నివారణ జరుగుతుంది. నిల్వ వుంచిన ధాన్యం నాణ్యత కోల్పోకుండా, ఎండిన ఆకులను వేసి పురుగుల బారి నుండి కాపాడుకోవచ్చు. నీటి ఎద్దడి ప్రాంతాల్లో దీని పచ్చి కాయలను పశువుల మేతగా వేసుకోవచ్చు. మహారాష్ట్రలో పచ్చికాయలను పశువుల మేతగా వాడుతున్నారు. గింజల్లో వంటకు పనికిరాని నూనె 30 నుండి 40 శాతం వుంటుంది. దీని నూనెను సబ్బులు, వార్నీష్, రంగుల తయారీల్లో మరియు జీవ ఇంధనంగా ఉపయోగించవచ్చు. నూనె తోళ్ళ పరిశ్రమకు ఉపయోగ పడుతుంది. మనుషులు, జంతువులకు వచ్చే చర్మవ్యాధుల నివారిణి (సూక్ష్మక్రిముల సంహారిణి)గా నూనెను వాడుకోవచ్చు. ఇది మంచి జీవ ఇంధనం, దీపాలని వెలిగించడానికి, ఇంజన్ మరియు ట్రాక్టర్లకు ఇందనంగా ఉపయోగపడుతుంది. విత్తనంలో నూనెని తీసిన తర్వాత మిగిలిన చెక్కను ఎరువుగా వాడవచ్చు. చెక్కను కోళ్ళ దాణాలలో కలిపి కోళ్ళకు ఆహారంగా కూడా వాడవచ్చు.

భౌతిక స్వరూపం : చెట్టు మధ్యస్థంగా పెరుగుతుంది. పైభాగం గుబురుగా, శాఖలు చాలా బలంగా పెరుగుతాయి. ఆకులు రాలుతాయి. బెరడు పలుచగా, మృదువుగా, పసుపు మరియు బూడిద రంగులు కలిగి ఉంటుంది. అన. మాన సంయుక్త పత్రాలు కలిగి వుంటుంది. ఆకులు అభిముఖంగా ఉండి 2-3 జతలుగా శక్తివంతంగా పెరిగి కోడిగ్రుడ్డు ఆకారాన్ని పోలి వుంటాయి.

పూత, కాపు : ఏప్రిల్ నుండి జూన్ వరకు పూతకొస్తాయి. పూలు తెలుపు, వంగ రంగుల్లో పూస్తాయి. రక్షణ పత్రాలు గిన్నె ఆకారంలో, ఆకర్షక పత్రాలు ఎరుపురంగులో వుండి. కాయ దీర్ఘచతురస్రాకారంగా మందంగా కొద్దిగా గట్టిగా వుండి చిన్నముక్కు కలిగి వుంటుంది. కాయలు డిసెంబర్, జనవరి మాసాల్లో పండుతాయి. కాయల్లో 1 లేక 2 విత్తనాలు ముడుచుకుని వుంటాయి. విత్తనాలు ఎరుపు, గోధుమ రంగుల్లో వుంటాయి.

చెట్టు లక్షణాలు : నీటి ఎద్దడిని, మంచును తట్టుకొని మధ్యస్థంగా పెరుగుతుంది. అధికంగా పిలకలు వేస్తుంది. నీడను బాగా తట్టుకొంటుంది. చౌడు భూముల్లో సైతం బాగా పెరుగుతుంది.

వాతావరణం : విభిన్న వాతావరణ పరిస్థితుల్లో పెరుగుతుంది. 1 నుండి 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకొని, సముద్ర మట్టానికి 1200 మీటర్ల ఎత్తైన ప్రదేశాల్లో మరియు సంవత్సరానికి 500 నుండి 2500 మి.మీ. వర్షపాతం కల ప్రాంతాల్లో కూడా పెరుగుతుంది. నీటి ఎద్దడిని తట్టుకొని ప్రతికూల ప్రదేశాల్లో పెరుగుతుంది.

నేలలు : ఇసుక, నల్లరేగడి, చౌడు, క్షార భూముల్లో బాగా పెరుగుతుంది. లోతైన, తేమ ఎక్కువగా వుండే భూములు అనువైనవి.

పునరుత్పత్తి : విత్తనాలు లేదా కాండపు మొక్కలు మరియు పిలకల ద్వారా పునరుత్పత్తి చేయవచ్చు. అంటు కట్టటం ద్వారా కూడా పునరుత్పత్తి చేయవచ్చు.

మొక్కలను పెంచడం :

విత్తన సేకరణ : డిసెంబర్ - జనవరి నుండి మే వరకు పండిన కాయలను సేకరించి భద్రపరచుకోవాలి.

విత్తటం : విత్తనాలను నారుమడుల్లో విత్తటం మంచిది. 15×20 సెం.మీ. దూరంలో, 1.5 నుండి 2 సెం.మీ. లోతుగా విత్తాలి. ఇవి సంవత్సరం వరకు మొలిచే శక్తి కలిగి, ఎక్కువ మొలక శాతం కలిగి

వును. ఈ గోగు కర్రలు పూర్తిగా మునిగేవరకు నీటితో ఈ గుంటను నింపవలెను. కర్రలు పైకి తేలకుండా ఇసుకతో నింపిన పాలిథీన్ గోతాలు పైన వుంచవలెను. సుమారు 12-15 రోజులు ఊరడంతో మంచి నాణ్యతతో కూడిన గోగునార తయారుకాగలదు. నార తయారు కాగానే, సగం మురిగిన నీటిని తీసివేసి మంచినీటితో గుంటను నింపవలెను. తయారైన నారును ఈ నీటిలోనే బాగా కడిగి గుంట గట్టు మీద ఆరవేయవలెను.

గోగుతో అదనపు విలువలు గల ఉత్పత్తులు : పురి, గోనె సంచులు, తివాచీలు, కాగితపు ప్లేట్లు, గ్లాసులు, ప్యాకింగ్ సామాగ్రి, గోంగూరతో పచ్చళ్ళు, చెట్నీలు, రక్షక పత్రాల నుండి సహజరంగులు, స్క్వాష్‌లు, గృహాలంకరణ వస్తువులు, న్యూస్‌ప్రింట్లు మరియు డ్రాయింగ్ పేపర్, సీలింగ్‌కు పనికివచ్చే కార్డ్‌బోర్డులు, పాదరక్షలు టేబుల్‌మేట్స్, డోర్‌మేట్స్, హాండ్ బ్యాగ్స్ విత్తనం నుండి తీసిన నూనెను సబ్బుల పరిశ్రమలలోను, చెక్కపిండి, పశువుల దాణాగాను ఉపయోగపడుతుంది. గోగు కర్రలు వంట చెఱుకుగా ఉపయోగపడతాయి. ✧

ఉంటాయి. తాజా విత్తనాలతో మంచి ఫలితాలుంటాయి. విత్తనాలను 5"×9" సైజు కలిగిన 200 గేజీ పాలిథీన్ సంచుల్లో నాటాలి లేదా నారుమడిలో మొలచిన మొక్కలను నెలరోజుల తర్వాత సంచుల్లోకి మార్చుకోవాలి.

విత్తే సమయం : మే, జూన్ మాసాలు విత్తడానికి మంచి సమయం, ఋతుపవనాల ఆరంభదశలో విత్తనాలను విత్తవచ్చు. విత్తిన తర్వాత నారుమళ్ళలో గాని, సంచులకు గాని నీరు పోయాలి. సాధారణ పరిస్థితుల్లో విత్తనాలు 10 నుండి 15 రోజుల్లో మొలకెత్తుతాయి. ప్రతి 2 రోజులకోసారి నీరు పోయాలి. విత్తిన తర్వాత 10 నుండి 12 నెలలో మొక్కలు నాటడానికి సిద్ధమవుతాయి.

కాండపు ముక్కల ద్వారా మొక్కల పెంపకం : జనవరి - ఫిబ్రవరి మాసాల్లో కాండపు ముక్కలను సేకరించాలి. కాండపు ముక్కలను 25 సెం.మీ పొడవు, 1-15 సెం.మీ. వ్యాసం కలిగినవిగా తయారు చేసుకొని పాలిథీన్ సంచుల్లో నాటుకోవాలి. కాండపు ముక్కలను 10 నిముషాలు, 3000 పి.పియమ్. ఐ.బి.యం. ద్రావణంలో త్వరగా ముంచి తీసే విధానం ద్వారా శుద్ధి చేసుకోవాలి. వేళ్ళకు ప్రతి 2 రోజులకోసారి నీరు పోయాలి. 8 వారాల వ్యవధిలో 50 నుండి 75 శాతం వృద్ధి అయి, వేరు నిర్మాణం పూర్తి అవుతుంది. పాలథీన్ సంచుల్లో నాటిన కాండపు ముక్కలను నీడలో 3 వారాల పాటు పాక్షికంగా వుంచి అటు తర్వాత సూర్యరశ్మిలో వుంచాలి. ఈ విధంగా పెరిగిన మొక్కలను వర్షాకాలంలో నాటుకోవాలి. పిలకలతో మొక్కల తయారీ చేపట్టవచ్చు. వేర్లతో పాటు పిలకలను నేరుగా లేదా పాలిథీన్ సంచుల్లో పెంచిన మొక్కలను వర్షాకాలంలో నాటవచ్చు.

అంటు మొక్కల తయారీ : ముందుగా కానుగ మొక్కలను పాలిథీన్ సంచుల్లో 5, 6 నెలలు పెంచాలి. ఆ తర్వాత బాగా కాయలు కాసేచెట్ల కొమ్మలను తెచ్చి పాలిథీన్ సంచుల్లో పెరిగే మొక్కలకు అంటుకట్టాలి. అంటు కట్టాక 4-5 నెలలకు మొక్కలు నాటడానికి తయారవుతాయి.

మొక్కలు నాటడం :

గుంతలను త్రవ్వడం గుంతలను 30×30×45 సెం.మీ. పరిమాణంలో త్రవ్వుకోవాలి. పొలం చుట్టూ 6-8 మీటర్ల ఎడంలో నాటాలి. అదే పొలంలోనయితే 5×4 మీటర్లు లేదా 5×5 మీటర్ల ఎడంలో నాటాలి. ఎకరాకు 160 నుండి 200 మొక్కల వరకు నాటుకోవచ్చు.

నాటే విధానం : ముందుగా పొలాన్ని లోతుగా దున్నాలి. దీని మూలంగా కలుపు మొక్కలు నాశనం కావడమే గాక వర్షపు నీరు భూమిలో బాగా ఇంకుతుంది. ఒక సంవత్సరం వయస్సుగల మొక్కలను నాటవచ్చు. కాండపు ముక్కల ద్వారా పెంచిన మొక్కలను పిలకల ద్వారా పెంచిన మొక్కలను కూడా నాటుకోవచ్చు.

నాటే సమయం : జూలై నుండి ఆగష్టు వరకు అనుకూల సమయం.

నీటి యాజమాన్యం : మొక్క పెట్టాక, వర్షం కురవక పోతే, నీటి తడిని ఇవ్వాల్సి వుంటుంది. మొదటి వేసవి కాలంలో నెలకోసారి నీటి తడినివ్వాలి.

ఎరువులు : దీర్ఘకాలం కాపుకు సేంద్రీయ ఎరువు శ్రేష్ఠం. నాటిన మొదటి 2 సంవత్సరాల్లో 100 గ్రాముల డి.ఎ.పి. సరిపోతుంది. మూడవ సంవత్సరం నుండి 200 - 250 గ్రాముల డి.ఎ.పి. ఎరువు వేస్తే చెట్టు త్వరగా వృద్ధి అవుతుంది.

అంతర కృషి : ప్రారంభదశలో మొక్క పెరిగేటప్పుడు కలుపు మొక్కలను నిర్మూలించాలి. లేకపోతే ఎదుగుదల క్షీణిస్తుంది. మొదటి సంవత్సరం నవంబరులో మరోసారి లోతుగా మొక్కల మధ్య దున్నాలి. సంవత్సరానికి 2 సార్లు కలుపు తీయాలి. దీనివల్ల మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

కత్తిరింపులు : లేత మొక్కలకు అవసరాన్ని బట్టి వెదురు బొంగులతో ఉతమివ్వాలి. చెట్లు ఎత్తుగా పెరగడానికి చిన్న మొక్కల ప్రక్క కొమ్మలను తగిన రీతిలో కత్తిరించాలి. మొక్కలు అధికంగా వుంటే తీసెయ్యాలి.

సస్యరక్షణ : ఆకుముడత, రసం పీల్చు పురుగులు, తేనెటీగలు ఆశిస్తాయి. లేత మొక్కలపై, చెట్లపై వివిధ శిలీంధ్రాలు ఆశిస్తాయి. లేత కొమ్మలను ఆకులను పెలిలోమా అనే శిలీంధ్రం ఆశించి ఆకులను రాల్చివేస్తుంది. విత్తనాలను నిల్వ చేసే సమయంలో కూడా ఆశిస్తుంది. వీటి నివారణకు లీటరు నీటికి 1.5 గ్రా. బావిస్టిన్ కలిపి పిచికారీ చేయాలి. విత్తనాలను నిల్వచేసే ముందు కిలో విత్తనాలకి 3 గ్రా. థైరామ్‌తో కలిపి నిలువ చేయాలి.

పంట దిగుబడి : చెట్లకు 6-7 సంవత్సరాలకు కాయలు కాయడం మొదలయినప్పటికి 10వ సంవత్సరానికి స్థిరమైన దిగుబడి వస్తుంది. అదే అంటు మొక్కల ద్వారా అయితే 4వ సంవత్సరం నుండి దిగుబడి మొదలయినప్పటికి 7వ సంవత్సరానికి స్థిరమైన దిగుబడి వస్తుంది. విత్తనాలను కోయడం కాని లేదా కాయ రాలాక ఏరడం గాని చేయాలి. కాయలు ఎండిన తరువాత పగల కొట్టి విత్తనాలను సేకరించాలి. హెక్టారుకు మొక్కల ద్వారా 10వ సంవత్సరానికి 6 టన్నుల గింజలు వస్తాయి. అయితే అంట్ల ద్వారా 7వ సంవత్సరానికే 6 టన్నుల గింజలు వస్తాయి. మొక్కల ద్వారా వేసిన తోటలు ఒక సంవత్సరం బాగా కాస్తే రెండవ సంవత్సరం తక్కువ కాస్తాయి. అదే అంటు పద్ధతి ద్వారా వేసిన మొక్కలు ప్రతి సంవత్సరం కాయలు కాస్తాయి. 70 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుంది.

నూనె దిగుబడి : గింజలో 26 -30 శాతం నూనె వుంటుంది. హెక్టారుకు 1500 - 1600 కిలోల నూనె వస్తుంది.

ఖర్చు - విశ్లేషణ : వర్షాధారంగా హెక్టారుకు ఖర్చు 40 వేలు, ఆదాయం 36 వేలు మరియు నికరాదాయం 21 వేలు లభిస్తుంది. (కనీస మద్దతుధర టన్నుకు 6 వేల రూపాయలు ఉన్న ఎడల) ✧

దేశ వ్యవసాయరంగంపై ఆర్థిక సంస్కరణల ప్రభావాలు

ఆర్.ఎస్. యాదవ్

మన దేశంలో శ్రమశక్తిలో 60 శాతం వ్యవసాయరంగంపై ఆధారపడి ఉండగా, మిగతా రంగాలు, దేశ ఆర్థిక స్థితి, వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మన దేశం వ్యవసాయ రంగంలో పురోగతి సాధిస్తూ, స్వాతంత్ర్యానికి పూర్వం 50 సంవత్సరాలు 1 శాతం వార్షిక పెరుగుదల ఉండగా, స్వాతంత్రానంతరం ఆర్థిక సంస్కరణల ముందు సమయం వరకూ 2.6 శాతం వార్షిక పెరుగుదల ఉండేది. విదేశాల నుండి ఆహారధాన్యాల దిగుమతి నిర్మూలన దశకు తీసుకురావటం గొప్ప విజయంగా భావించవచ్చు. భారతదేశ ప్రభుత్వం తీసుకొన్న అనేక చొరవల ఫలితంగా ఈ పురోగాభివృద్ధి సాధించుట సాధ్యపడింది. భూసంస్కరణలు, ఉత్పత్తిదారులకు కనీస మద్దతు ధర అందేలా చూడటం కోసం పరిపాలనా ధరల కమిషన్ నియమించటం, పరిశోధన, క్షేత్రసేవలు, బ్యాంకుల జాతీయకరణ, రుణ సదుపాయాలు, నీటిపారుదల సదుపాయాలు మరియు గ్రామీణ మౌలిక సదుపాయాలు వంటివి ఈ పురోగాభివృద్ధికి కొన్ని ఉదాహరణలు.

1991లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టినప్పటినుంచి పరిస్థితులు తారుమారైనవి. సంస్కరణల ప్రవేశానంతరకాలంలో వ్యవసాయరంగం, వ్యవసాయ అనుబంధరంగాల్లో ప్రతికూల పరిస్థితులు ఏర్పడినవి.

"భారతదేశ స్వాతంత్ర్యం నుంచి వ్యవసాయాభివృద్ధి" అభ్యుదయ, పురోభివృద్ధి నిర్ధారకాలు" అను అధ్యయన నివేదికలో పై ముగింపు వ్యాఖ్యలు పొందుపర్చబడినవి. ఈ నివేదికను వ్యవసాయ ఆర్థిక పరిశోదనసంస్థ, వ్యవసాయ వృద్ధి సంస్థ నుండి అమరనాధ్ త్రిపాఠి, బెనారస్ యూనివర్సిటీలోని ఆర్థికశాస్త్ర విభాగంకు చెందిన ఎ.ఆర్. ప్రసాద్‌లు ప్రవర్ధిత మార్కెట్లు పత్రిక వాల్యూమ్ 1 (2009)లో ప్రచురించుట జరిగింది. మొత్తం మీద వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల ప్రతికూలంగా ఉన్నాయి. ధాన్యాలు మైనస్ 0.2 శాతం, పప్పు దినుసులు మైనస్ 0.9 శాతం, చెరకు మైనస్ 1.34 శాతం, నూనె గింజలు మైనస్ 0.57 శాతం ఉన్నాయి. మొత్తం మీద ఆర్థిక సంస్కరణలకంటే ముందున్న పెరుగుదల శాతం, సంస్కరణల తదుపరి కాలంలో లేదు. 2008 సంవత్సరం వరకూ ఈ నివేదిక విశ్లేషించింది. పరిస్థితులు అధ్వాన్నంగా మారటంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు పెరిగినట్లు నిర్ధారించింది.

ముంబాయిలోని టాటా ఇనిస్టిట్యూట్ సాంఘికశాస్త్రాల విభాగ ప్రొఫెసర్ ఆర్. రామకుమార్ తన నోట్‌లో సంస్కరణల తదుపరి కాలంకంటే, ఆర్థిక సంస్కరణల ముందు కాలంలో పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ఇదే విషయం అనేక విశ్లేషణల్లో పొందుపర్చబడి ఉన్నాయని తెలియజేశారు.

1949-50 నుంచి 1964-65 మధ్య కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల ఇండెక్స్ ఏటా 3.1 శాతం పెరిగి, ఆహారధాన్యాల, ఆహార ధాన్యాలేతర ఉత్పత్తుల్లో గణనీయ వృద్ధిరేటు సాధించబడింది. ఈ ఇండెక్స్ 1967-68 నుంచి 1980-81 మధ్య 2.3 శాతానికి పడిపోయింది. 1981-82 నుండి 1991-92 మధ్య మరలా 3.4 వరకూ ఇండెక్స్ పుంజుకుంది. కానీ 1992-93 నుండి 2005-06 మధ్య దారుణంగా 1.2 శాతానికి పడిపోయింది. ఈ సమయంలో ప్రవేశ పెట్టబడిన వ్యవసాయ సంస్కరణల ఫలితంగా వ్యవసాయ వృద్ధిరేటు పడిపోవటానికి కారణమైంది. స్వాతంత్రనంతరం మొట్టమొదటిసారిగా వ్యవసాయోత్పత్తుల వృద్ధిరేటు జనాభాపెరుదల రేటుకన్నా పడిపోవటం గమనార్హం.

ముఖ్య పంటల ఉత్పత్తుల విలువ మొత్తం కూడా భారత దేశంలో తగ్గుముఖం పట్టసాగింది. గోధుమ ఉత్పత్తుల విలువ 1950-51 నుండి 1964-65 మధ్య 3.9 శాతం, 1967-68 నుండి 1980-81 మధ్య 5.6 శాతం, 1981-82 నుండి 1991-92 మధ్య 3.3 శాతం ఉండగా, 1992-93 నుండి 2002-03 1.9 శాతానికి, 2003 నుండి 2006-07 మధ్య 1.3 శాతానికి పడిపోయి సంస్కరణల అనంతర సమయంలో పెద్ద మొత్తంలో పడిపోయినట్లు వెల్లడవుతుంది.

ఆర్థికవేత్త అభిజిత్‌సేన్ (2002) ప్రకారం ఇతరత్రా గణాంకాలను చూసినా వృద్ధిరేటు సంస్కరణల తరువాత పడిపోయినట్లుగా గమనించవచ్చు. ఉదాహరణకు వాణిజ్యపరంగా గణాంకాలను చూస్తుంటే 1980 దశకంలోని 4 శాతం వృద్ధి 1990 దశకం వచ్చేసరికి 2.5 శాతానికి పడిపోవటాన్ని మనం చూడవచ్చు. వ్యవసాయంలో తలసరి దిగుబడులు కూడా 1996-97 తర్వాత తగ్గుముఖం పట్టాయని, వాణిజ్య షరతులతో చాలా ఆహారధాన్యాల పంటలపై తీవ్ర ప్రభావం చూపిందని అభిజిత్ సేన్ అంటున్నారు.

"సరళీకృత ఆర్థిక విధానాలు - భారతదేశ వ్యసాయరంగం" అంశంపై జేఎన్‌యూ గౌరవ ప్రొఫెసర్ జి.ఎస్. భాల్లా, పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గుర్మెల్ సింగ్‌లు ఈ క్రింది విధంగా తెలియజేస్తున్నారు.

1. వాణిజ్య సౌకర్యాలు, నిబంధనలు ఆర్థిక సంస్కరణల ద్వారా

వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతాయని ఆశించాం, కానీ వ్యవసాయ రంగంలో ఏ విధమైన గుణాత్మక వృద్ధిగాని, వాణిజ్య సంస్కరణ వలన వ్యవసాయరంగానికి ఏ విధమైన లాభాలు గానీ చేకూరలేదు. వాస్తవానికి సరళీకృత ఆర్థిక సంస్కరణల తదుపరి కాలం (ఆర్థిక సంస్కరణల ముందుకాలాన్ని (1980-83 నుండి 1990-93)తో పోలిస్తే వ్యవసాయరంగ అభివృద్ధి స్పష్టంగా తగ్గినట్లు కనబడుతుంది.

2. సరళీకృత ఆర్థిక విధానాల తర్వాత వ్యవసాయాభివృద్ధి ఖచ్చితంగా తగ్గింది. వ్యవసాయ దిగుబడులు ఆర్థిక సంస్కరణలకు ముందు 3.87 శాతం వృద్ధిని నమోదు చేయగా, సంస్కరణల తదుపరి కాలంలో 1.74 శాతానికి పడిపోయింది (190-93 నుండి 2003-06) వరకు. ఇదే తీరున పంటల దిగుబడులు సంస్కరణల ముందుకాలంలో వార్షిక దిగుబడులు 3.17 శాతం వృద్ధి నుండి తరువాత కాలంలో 1.52 శాతానికి పడిపోయాయి. నీటిపారుదల రంగంలో కుదించిన పెట్టుబడులు, గ్రామీణ మౌలిక వసతులు, వ్యవసాయ పరిశోధనలకు ప్రోత్సాహకాలు లేకపోవటమే ఈ వెనుకబాటుకు ప్రధాన కారణాలు.

3. నికర పంటభూమి, భూ విస్తీర్ణం 1962-65 నుండి 1980-83 మధ్య 0.15 శాతం పెరగగా, 1980-83 మధ్య వృద్ధిరేటు 0.11 శాతానికి తగ్గింది. ఈ నికర పంటభూమి విస్తీర్ణం 1990-93 నుండి 2003-06 మధ్య 0.05 శాతానికి పడిపోయింది. ఒకవైపు విస్తీర్ణ భూమి తగ్గుతూ ఉంటే, మరొకవైపు సాధారణ జనాభా పెరుగుదలతో వ్యవసాయంపై ఆధారపడేవారి సంఖ్య పెరుగుతూ వచ్చింది.

4. ఆర్థిక సంస్కరణలతో పంటల సేద్యపు తీరులో తక్కువ విలువ చేసే ధాన్యపు పంటల నుండి ఎక్కువ విలువచేసే ధాన్యేతర పంటలకు త్వరితగతిన మారటం జరుతుందని ఆశించటం జరిగింది. వరి, నూనె దినుసులు, చెరకు దిగుబడులు సంస్కరణల తదుపరి కాలంలో తగ్గుతూ వస్తుండడంతో, ధాన్యేతర విలువగల పంటలకు వ్యవసాయ సేద్యం మారలేదు. పత్తి, చెరకు సాగులో స్వల్ప పెరుగుదల నమోదుచేయగా, పప్పు దినుసుల సాగులో మాత్రం తగ్గింది.

5. జీడీపి వృద్ధిరేటు, తలసరి ఆదాయం సంస్కరణల తదుపరి కాలంలో పెరిగినప్పటికీ, వ్యవసాయరంగంలో మాత్రం ప్రతికూల వృద్ధిరేటు నమోదుకాబడి, దిగుబడులు తగ్గటంతో వ్యవసాయ రంగంలో విభిన్నత క్రమం తగ్గింది.

కనుక వ్యవసాయరంగంలో సంక్షోభ దుస్థితి తలెత్తింది. భారతదేశంలో 1991 జులై నెల నుండి ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టబడినవి. సంస్కరణల వలన తీవ్రమైన హానికర ప్రభావం వ్యవసాయ రంగంపై పడింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై, రైతాంగంపై, గ్రామీణ చేతివృత్తిదార్లపై, వ్యవసాయరంగంపై ఆధారపడే అనేక రంగాలపై ప్రతికూల ప్రభావం పడింది.

ఆర్థిక సంస్కరణలు ముఖ్యంగా వార్షిక ప్రణాళిక, ఆర్థిక సర్దుబాట్లపై, విదేశీ వాణిజ్యంపై, పెట్టుబడులపై పారిశ్రామిక, ఫైనాన్షియల్ రంగాల్లో చోటుచేసుకున్నాయి. కానీ వ్యవసాయంపై సరైన దృష్టిని సారించలేదు. వ్యవసాయంపై ఇప్పటికీ 65 శాతం వరకు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తద్వారా మూడింట రెండు వంతుల భారతదేశ జనాభా అభివృద్ధి సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా నిర్దేశిస్తుంది. దీనర్థం వ్యవసాయేతర రంగాలు లబ్ధి పొందాయని ఆ రంగాల్లో అన్యూహ్యామైన అభివృద్ధి సాధించామని కాదు. ఈ రంగాల్లో ఉన్న జనాభా విపరీతంగా లాభపడిపోలేదు కూడా, కానీ అదే సమయంలో కొద్దిపాటి కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు, మధ్యతరగతిలో బలమైన వర్గం వారికి మాత్రమే ప్రయోజనాలు చేకూరాయి. సంస్కరణల తర్వాత భారతదేశ సంపద, వనరులు కొద్దిపాటి జనాల చేతిలో మాత్రమే కేంద్రీకృతమైనవి. మెజారిటీ ప్రజల సంపద, వనరుల నిష్పత్తి నానాటికి తగ్గుతూ వస్తున్నది.

ఆర్థిక సంస్కరణల విధివిధానాలు వ్యవసాయంపై రైతాంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయ సబ్సిడీలు వ్యవసాయాభివృద్ధికి, రైతాంగానికి, దేశం మొత్తానికి ప్రయోజనకరం కాగా, రానురాను దేశం మొత్తం మీద సబ్సిడీలను క్రమంగా తగ్గుతూ గణనీయంగా తెరమరుగవుతున్నాయి. వ్యవసాయ సబ్సిడీలు ఎరువులు, విద్యుత్తు, నీటిపారుదల, కనీస మద్దతు ధర, వ్యవసాయాభివృద్ధికి ఇస్తూ వీటిని తగ్గించడమో, మొత్తానికి తీసివేయటమో జరుగుతున్నది. క్రమబద్ధీకరణ లేకపోవటంతో పొటాష్, ఫాస్పేట్ మొదలగు ఎరువుల ధరలు, రసాయానిక మందుల ధరలు అనేక రెట్లు పెరిగిపోయాయి. సబ్సిడీల కొరత, బ్యాంకు రుణాల తగ్గుదల, అధిక సుంకాలు, ఐ.ఎమ్.ఎఫ్, ప్రపంచ బ్యాంకులు, వాణిజ్య సరళీకృత విధానాల వలన మన వ్యవసాయ రంగం గొంతు నులుమబడుతున్నది.

వ్యవసాయరంగాన్ని విస్మరించటం, నిర్లక్ష్యానికి గురిచేయటం వ్యవసాయరంగ సంక్షోభానికి మూలకారణం. గడచిన సంవత్సరాల నుండి జీడీపీలో వ్యవసాయరంగ భాగం క్షీణిస్తూ వస్తుంది, అదే సమయాన వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారి భాగం మాత్రం తగ్గటం లేదు. ఒకవిధంగా చెప్పాలంటే సంపూర్ణ జీవనోపాధి కోసం వ్యవసాయంపై ఆధారపడ్డ వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. దీనర్థం మిగతా పారిశ్రామిక, సర్వీసు రంగాల్లో ప్రజానీకానికి తక్కువ చోటు దొరుకుతుంది. ఈ రంగాలు జనాభా పెరుగుదలకు అనుగుణ్యంగా ఉద్యోగాలను అందించటం లేదు. జీడీపీలో వ్యవ

సాయ రంగ భాగం 13.5 శాతానికి పడిపోయినప్పటికీ మూడింట రెండు వంతులు మాత్రం ఇంకా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఏ తరహా అభివృద్ధి నమూనా అయినా, అభివృద్ధి విధానాలయినా వ్యవసాయ రంగాభివృద్ధికి తోడ్పడాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఉపయోగకరమైంది కాదనుకొంటే, అటువంటి నమూనాను ఉపయోగకరం కానిదిగా గుర్తించాలి. ఈ ప్రమాణాన్ని ఆధారంగా చేసుకొంటే ఆర్థిక సంస్కరణలు ఘోరంగా విఫలమైనట్లుగా భావించాలి.

ఈ ప్రభుత్వ విధానాలకు లోబడి నీటిపారుదల ప్రాజెక్టులకు, భూగర్భ జలాలకు గణనీయంగా పెట్టుబడులను తగ్గించుకుంటూ పోతుంటే, ప్రైవేటురంగ సంస్థలు పెట్టుబడులకు ముందుకు రావడం లేదు. ఈ రంగంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఉండటం ఒక కారణం కాగా, దీర్ఘకాలిక ప్రణాళికలు, రాజకీయ జోక్యాలు, పెట్టుబడుల్ని వెనుక్కి రాబట్టుకొనే సమయం ఎక్కువ కావటం వలన ప్రైవేటు రంగానికి అడ్డంకులుగా ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం మొదటి, రెండవ పంచవర్ష ప్రణాళికల్లో ఉన్న అరకొర నిధులతో మొదటి 10 సంవత్సరాల్లో నిర్మించిన నీటి పారుదల ప్రాజెక్టులు, ఆర్థిక సంస్కరణలు అమలవుతున్న గత 25 సంవత్సరాల కాలంలో ఎందుకు నిర్మించలేకపోయారు? మొదటి పంచవర్ష ప్రణాళికలో 20% నిధులు నీటి ప్రాజెక్టులకు కేటాయించటం జరిగింది. ఆర్థిక సంస్కరణల ముందు ఈ విధమైన ప్రాధాన్యత ఉండబట్టే ఆహార ధాన్యాల కొరతతో ఉండిన మనదేశం ఆహారధాన్యాల్ని ఎగుమతి చేయగల్గే స్థితికి ఎదగగల్గింది. 2015 సంవత్సరంలో మనదేశం ఒక కోటి టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేయగల్గే స్థాయికి వచ్చిందంటే, ఆ ఘనత ఆర్థిక సంస్కరణల ముందు జరిగిన అభివృద్ధి చలవ మాత్రమే కానీ, ఈ ఘనత మోడీ ప్రభుత్వానికో, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికో వర్తించదు. గడచిన 25 సంవత్సరాల కాలంలో వ్యవసాయ వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను నిరోధించి ఉండగల్గినట్లయితే, ప్రస్తుత మన వ్యవసాయ రంగం అత్యున్నత దశకు చేరుకొని ఉండేది.

1970 దశక ప్రారంభంలో మనం పిలిచే 'హరిత విప్లవం' నీటి పారుదల ప్రాజెక్టు సదుపాయాలు, మన స్వాతంత్ర్యానంతర పరిశోధనల్లో కనుగొన్న అధిక దిగుబడినిచ్చే వంగడాల ప్రవేశీకరణ, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఉత్పత్తి కాబడిన రసాయనిక ఎరువులు, వాణిజ్య బ్యాంకుల జాతీయికరణ ఫలితంగా వ్యవసాయ రంగానికి, రైతులకు సమకూరిన బ్యాంకు రుణ సదుపాయాలు, వ్యవసాయ ఖర్చుల్లో రైతుల సబ్సిడీలు మరియు కనీస మద్దతు ధర, ప్రభుత్వ పరంగా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ వంటి సంయుక్త ఫలితాల సమూహారమే.

1965లో స్థాపించబడిన వ్యవసాయ ధరల కమిషన్ (ఎపిసి) ప్రభుత్వానికి కనీస ధరలను సూచించేది. తద్వారా రైతులకు లభ్యమయ్యే ప్రోత్సాహకాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొనుటలోను, హేతుబద్ధంగా వ్యవసాయ భూమిని సాగు చేయుటకు, వనరుల వినియోగానికి ఉపయోగపడేది.

1965 ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (FCI) స్థాపించబడి, ధాన్య సేకరణ నిల్వకు అనుకూల ప్రాంతంగా పనిచేసేది. ఈ సంస్థ ద్వారా పేదలకు అందుబాటు ధరలకు ఆహారధాన్యాలు ఉంచుట జరిగేది. సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచుట వలన ధరలను నియంత్రించుటకు వీలు కలిగేది. 1969లో జరిగిన బ్యాంకుల జాతీయకరణ ద్వారా వ్యవసాయరంగ అభివృద్ధికి దోహదపడుట ద్వారా హరిత విప్లవానికి సహకరించింది. పెద్దమొత్తాల్లోని ప్రభుత్వ నిధులు బ్యాంకుల ద్వారా రైతాంగానికి, గ్రామీణ చేతివృత్తుల వారికి, గ్రామీణ పేదలకు రుణాలు కల్పించబడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో ధన సేకరణ, ధన పొదుపులకు, భౌగోళిక అభివృద్ధికి, క్రిందిస్థాయి వరకూ బ్యాంకులు అందుబాటుకు వచ్చి కొంతవరకూ ప్రైవేటు వడ్డీ వ్యాపారానికి అడ్డుకట్ట వేయుటకు దోహదపడ్డాయి. బ్యాంకుల జాతీయకరణ ద్వారా ప్రభుత్వం సబ్సిడీ విధానాలను, ఎరువుల ధరలను, రసాయనిక క్రిమి సంహారక మందుల ధరల అదుపుకు, నీటిపారుదలకు, విద్యుత్తు అందుబాటులో ఉంచుటకు తోడ్పడినవి. బ్యాంకుల జాతీయకరణ జరిగి ఉండనట్లయితే ఎఫ్.సి.ఐల ద్వారా పెద్దమొత్తాల్లో ధాన్య సేకరణ జరిగి ఉండేది కాదు.

ప్రభుత్వం తీసుకొన్న ఇటువంటి విధానాల ద్వారా వార్షిక వ్యవసాయభివృద్ధి 1980 దశకంలో 3.4 శాతానికి చేరింది. 2014-15లో మైనస్ 0.2% ప్రతికూల వృద్ధిరేటుకు పడిపోగా, 2015-16 సంవత్సరానికి 1.1 శాతం లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పెట్టుకొంది. కనుకనే రైతులు ప్రస్తుతం సంక్షోభంలో ఉన్నారు. 2015-16 మూడవ త్రైమాసానికి వ్యవసాయ వృద్ధి 1% పెరిగినట్లుగా తెలుస్తోంది.

1980 దశకంలో వ్యవసాయ రంగానికి ఉపయుక్తమైన మరొక అంశాన్ని ప్రస్తావించాలి. పశ్చిమబెంగాల్ వ్యవసాయాభివృద్ధిలో అనుహ్యమైన విజయాన్ని, పురోభివృద్ధిని సాధించింది. లెఫ్ట్‌ఫ్రంట్ "ఆపరేషన్ బెర్గా" ఉద్యమం ద్వారా పశ్చిమబెంగాల్‌లో రెండు ప్రధాన కౌలుదారి సంస్కరణలు తీసుకురాబడినవి. కౌలుదార్లకు భూమి రక్షణ కల్పిస్తూ, న్యాయ సమ్మతమైన కౌలు లీజు ధరను నిర్ణయించుట జరిగింది. 1990 వరకు 14 లక్షల కౌలుదార్లు నమోదు చేయబడ్డారు. ప్రభుత్వం 14 లక్షల ఎకరాలను సేకరించి, అందులో 11 లక్షల ఎకరాల భూమిని 25 లక్షల కుటుంబాలకు పంచింది. ఈ చర్యలకు తోడు ప్రభుత్వ రుణ సదుపాయాలు, పనిముట్లు అందించటం ద్వారా సన్నకారు రైతులు 1980 దశకంలో వ్యవసాయ దిగుబడులకు ఇతోధికంగా సహాయపడి వ్యవసాయ అభివృద్ధికి కృషి సల్పారు.

ప్రస్తుత వ్యవసాయ రంగంపై ప్రభుత్వ దృష్టి సన్నగిల్లటమే గాకుండా, ప్రభుత్వ విధానాలు ద్వారా ముందస్తు ప్రణాళికలతో నిరుత్సాహపరుస్తోంది. వ్యవసాయ పరిశోధన, క్షేత్రస్థాయి పథకాలకు తొందరలోనే మంగళం పాడనున్నారు. నూతనంగా వ్యవసాయ శాస్త్రజ్ఞుల్ని పరిశోధనా రంగాల్లోకి తీసుకోవటం లేదు, ప్రవేశద్వారాలు మూసివేశారు. ఏటా 6.3 శాతం నిధుల పెంపుదలతో 1980 చివరి వరకూ ఉండగా 4.6 శాతానికి 1990-2000 మధ్య పడిపోయింది. భారత మార్కెట్ విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు ద్వారాలు తెరవటంతో ఇద్దరి అసమానుల మధ్య పోటీ నెలకొల్పబడింది. ఒకవైపు వ్యవసాయ రంగానికి, రైతులకు అసామాన్యమైన సబ్సిడీలను అందిస్తున్న దేశాలు ఉండగా, వారికి అండగా పెద్దపెద్ద కమతాలు, నీటి పారుదల సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం, అధిక దిగుబడులు, ఉత్పాదకత, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. మరొకవైపు భారతీయ రైతాంగంలో, ఎక్కువ మంది రైతుల పొలాలు ఎకరాకంటే చిన్నవి, వర్షపాతంపై ఎక్కువమంది ఆధారపడ్డారు. నీటిపారుదల సౌకర్యాలు అందరికీ లేవు. మంచి వ్యవసాయ పద్ధతుల లేమితో, సబ్సిడీలు ఎత్తివేతలతో సతమవుతున్నారు. ఈ అసమానపోటీ భారతీయ రైతును కృంగదీస్తుంది.

అమెరికా, యూరప్ దేశాల్లో సబ్సిడీలు ఇదివరకటివలె కొనసాగుతున్నాయి. చైనా రైతాంగం సబ్సిడీలు పొందుతున్నారు. ఓ.ఈ.సీ.డీ ప్రకారం చూస్తే, 2004 సంవత్సరంలో చైనాలో సబ్సిడీలు 39 వందల కోట్ల డాలర్లు ఉండగా, 2014 నాటికి 327 వందల కోట్ల డాలర్లకు పెంచారు. చైనాలో కనీస మద్దతు ధరను కూడా ప్రోత్సహించి సబ్సిడీ ఇస్తున్నారు. 50 కేజీల గోధుమకు చైనా ప్రభుత్వం118 యువాన్లకు ప్రకటించింది. ఇది టన్నుకు 359 డాలర్లు పడింది. మన దేశంలో క్వింటాలు 1525 రూ॥లు లేదా 225 డాలర్లకు పడింది. అంటే చైనా రైతు గోధుమ ధరకు భారతీయ రైతుకంటే ఒకటిన్నర రెట్లు అధిక ధర పొందుతున్నారు. ఒకవైపు చైనా, యూరప్, అమెరికాల్లో సబ్సిడీలు ఇస్తుండగా, మనదేశ రైతులు డబ్ల్యు.టి.ఓ. నిబంధనల ప్రకారం సబ్సిడీలు కోల్పోతున్నారు.

స్వామినాథన్ కమిషన్ కనీస మద్దతు ధరను రైతు ఖర్చుకు 50శాతం అదనంగా ఇవ్వాలని సిఫార్సు చేసింది. బీజేపీ ప్రభుత్వం ఈ సిఫార్సును అమలు చేస్తామని వాగ్దానపర్చింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత తన స్వంత మాటల్ని నిలబెట్టుకోవటంలేదు.

భారత రైతాంగ వర్గం నిత్య పేదరికంతో నిధులు వనరుల లేమితో సతమతమౌతున్నది. వారికి కనీస మార్కెటింగ్ సదుపాయాలు లేవు. వారి ఉత్పత్తులను వ్యాపారవేత్తలకు విక్రయించవలసి వస్తుంది. వ్యాపారస్తులకు ప్రభుత్వాలతో సంబంధాలుంటున్నాయి. పంట తయారైనప్పుడు ధరలు కనిష్ఠ స్థాయిలో ఉంచి రైతుకు తక్కువ ధరను ఇస్తారు. ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రభుత్వం గిట్టుబాటు ధరలు నిరుత్సాహపరుస్తూ, ఇంచుమించు కనీస మద్దతు ధర ఇవ్వటంలేదు. వ్యాపారులు కుమ్మక్కవటం ద్వారా, వారి చేతిలో రైతులు మోసగింపబడు తున్నారు. పత్తి రైతులు పంజాబ్‌లో ఈ సంవత్సరం, క్రితం సంవత్సరం కంటే అతి తక్కువ పంటధర పొందారు. ప్రసిద్ధిగాంచిన పూసా 1121 బాస్మతి రకంకు ఈ సంవత్సరం 1300-1800 రూపాయల మధ్య చెల్లించారు. ఇదే ధాన్యానికి క్రితం సంవత్సరం క్వింటాలుకు 3000 రూపాయలు చెల్లించారు. ధాన్యం వ్యాపారుని గిడ్డంగులకు చేరిన 15 రోజుల కాలవ్యవధిలో 5 వేల రూపాయల ధర పలుకుతుంది. ఇదే బాసుమతి బియ్యాన్ని వినిమయదారునికి కేజీ ఒక్కింటికి 80 నుంచి 100 రూపాయలకు వ్యాపారులు అమ్ముతున్నారు.

మరోవైపు కేరళ రైతాంగం రబ్బరు దిగుబడులతో సంక్షోభంలోకి నెట్టబడ్డారు. రబ్బరు ఖరీదు (ఆరెస్సెస్ విభాగం) 2015 సంవత్సరంలో కిలో 92 రూపాయల ధరకు పడిపోయింది. ఇది 2014తో పోలిస్తే సగం ధర మాత్రమే. 2012 మధ్య సమయంలో కిలో 242 రూపాయలకు అమ్మింది.

ఒరిస్సా యూనివర్సిటీలో ఒక అధ్యయనం ద్వారా ప్రస్తుతం ఎకరా వరి పంటకు 17 వేల రూపాయలు ఖర్చు అవుతుందని తేలింది. 15 క్వింటాళ్ల దిగుబడితో 20 వేల వరకూ రైతుకు ఆదాయం వస్తుంది. నెలల తరబడి కుటుంబమంతా చమటోడ్చి పనిచేస్తే ఎకరాకు 3 వేల రూపాయలు మాత్రమే మిగలొచ్చు. రైతాంగ కష్టాలు వర్ణనాతీతం. 75 శాతం రైతాంగం సన్నకారు రైతులే, వీరికి ఒక హెక్టారు (రెండున్నర ఎకరాలు) కంటే సమానంగానో, తక్కువగానో పొలం మాత్రమే ఉంటుంది.

వాణిజ్య, వ్యవసాయాన్ని సరళీకృతం చేయటం ద్వారా ఎగుమతులు ఆధారిత వృద్ధి సాధించవచ్చని వాదిస్తూ, తద్వారా వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి చెందుతయన్నారు. కానీ ఇది సాధ్యం కాలేదు సరికదా తిరోగమనంలోకి వెళ్లింది. వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయింది. బయటపడే మార్గాలు కనబడటం లేదు. కొన్ని రంగాల్లోని పారిశ్రామికాభివృద్ధి ఎక్కువ జరగటం ద్వారా పారిశ్రామిక వికేంద్రీకరణ జరగాల్సిన అవసరముందని కొందరు ఆర్థిక శాస్త్రవేత్తలంటున్నారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు మొత్తంగా స్థూలంగా చూస్తే 21 శాతం ఉండేవి. 1996-97 నుంచి 2003-04కు 12 శాతానికి పడిపోయాయి. వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతుల జీడీపీ. నిష్పత్తి 1995లో 7.6 శాతం నుంచి 2003-2004కు 6.9 శాతానికి పడిపోయినవి.

సౌజన్యం : న్యూపజ్

అనువాదం : బుడ్డిగ జమిందార్

విత్తన సరఫరా ఆవశ్యకత



వి. రాంనర్సింహారావు
సిపిఐ జాతీయ సమితి సభ్యులు

దేశంలో లక్షలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుం టుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో అచేతనంగానే కళ్ళప్పగించి చూస్తున్నాయి తప్పితే, మూలాలను పరిష్కరించడానికి పూనుకోవటం లేదు. గిట్టుబాటు ధరతోపాటు, మద్దతు ధర లాంటి సమస్యలను పరిష్కరించడంతోబాటు మధ్య దళారీ వ్యవస్థను రద్దు చేయాల్సి వుంది. ముఖ్యంగా ఈ వర్షాకాలపు సీజన్ ప్రారంభం కాక మునుపే రైతన్నలకు సాంప్రదాయక విత్తనాలను సరఫరా చేయాల్సి వుంది. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందని పక్షంలో అంగళ్ళలో చేంతాడు లాంటి రైతన్నల క్యూలు. ఈ సమస్యపై రైతన్నలు షాపుల ముందు క్యూలలోనే పడుకునే ఘటనలు అనేకం. వీటితోపాటు ఏ పార్టీ, ఏ రైతు సంఘంతో సంబంధం లేకుండానే అనేక పట్టణాలలో రైతులు షాపుల యజమానులతో ఘర్షణలకు దిగిన ఘటనలు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా రెండు తెలుగు రాష్ట్రాధినేతలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి వుంది. దేశంలో ఆహారోత్ప త్తులు, పరిశ్రమల కవసరమైన ముడి సరుకుల ఉత్పత్తి పెంచకుండా ఈ రాష్ట్రాల అభివృద్ధి జరగడం ఊహకందని విషయమే. రాజధాని నగరాలను అభివృద్ధి చేసుకోవడం అవసరమే అయినా ఆయా రాష్ట్రా లలో ఉత్పత్తులు పెంచుకోవడం పెరుగుతున్న జనాభాకు అనుగు ణంగా అత్యంత అవసరం. అభివృద్ధి లెక్కలను రెండు అంకెలలో పెరిగిందనో, రెండంకెల చేరువుగా ఉందనో చెప్పినంత మాత్రాన అభివృద్ధి జరగదు. సమ్మిళిత అభివృద్ధి అంటే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి జరగాలి. 52% ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుదేలు చేస్తున్నాయి. రెండంకెల లోపు శాతం మాత్రమే ఉపాధి కల్పిస్తున్న సర్వీసు రంగంపై కేంద్రీకరించి నంతమాత్రాన మధ్యతరగతి వర్గంలోని ఒక సెక్షనును సంతృప్తిపరచ గలం కాని, గ్రామీణ భారతాన్ని బాగుచేయలేము.

గ్రామీణ భారతంలో ముందు రైతున్నలకు సక్రమమైన విత్తనాలు, ఎరువులు లభించాలి. దీనికి వ్యవసాయ శాఖ పూనుకొని, సీజన్ రాకమునుపే ఏ జిల్లాకు ఎన్ని ఎరువుల సంచులు, ఎన్ని విత్తనాలు పంపించాలని నిర్ణయించి తగు ఏర్పాట్లు చేసుకోవాలి.

ఇక రెండవ అంశం అధిక దిగుబడుల పేరుతో బహుళజాతి కంపెనీలకు చెందిన జన్యు మార్పిడి విత్తనాలను రైతులు కొనుగోలు చేయడం జరుగుతున్నది. బహుళజాతి కంపెనీలు తమ ప్రచార పద్ధతుల ద్వారా అధిక సంఖ్యలో రైతులను ఆకర్షించుకోగలుగు తున్నాయి. జన్యు మార్పిడి విత్తనాలను ఆకర్షణీయమైన ప్రకటనల నేపథ్యంలో రైతన్నలు వాటిని వాడటం జరుగుతున్నది. వీటి ప్రభావం వల్ల మట్టిలోని వానపాములు అంతమైపోతున్నాయి. దీనివల్ల భూమి సారవంత సామర్థ్యం పడిపోతున్నది. అలాగే ఈ రసాయన పూరిత విత్తనాలను వాడటం వల్ల సీతాకోకచిలుకలు సైతం చనిపోతున్నాయి. తద్వారా పరపరాగ సంపర్క ప్రక్రియ దెబ్బతిని, దిగుబడులు తగ్గే అవకాశం ఎంతో ఉంది. మన భారతదేశంలోకి ఈ రసాయన పూరిత జన్యు మార్పిడి విత్తనాలు చొరబడకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం వుంది. భూసారా నికి ఎలాంటి ప్రమాదం లేనటువంటి విత్తనాలను మన విత్తన పరిశోధనా సంస్థలే తయారుచేసి వాటిని విరివిగా రైతన్నలకు సంచార వ్యవసాయ శాఖ కార్యాలయాల ద్వారా అంద చేయాల్సి వుంది. పర్యావరణాన్ని దెబ్బతీసే జన్యు మార్పిడి విత్తనాలను నిషేధించాల్సి వుంది. అత్యంత ఖరీదైన ఈ విత్తనాలను వాడినా చివరికి మధ్య దళారీల పాత్ర వల్ల గిట్టుబాటు ధర లేకపోవడం, అతివృష్టి, అనావృష్టి ఫలితంగా పంటలు నాశన మయ్యే పరిస్థితులు ప్రకృతి రీత్యా కల్పించబడటమే కాకుండా ప్రభుత్వ విధానాల ఫలితంగా రైతన్నలకు రక్షణ లేకుండాపోతుంది. జన్యు మార్పిడి విత్తనాలను వాడటంవలన ఆ పంట నుండి ఉత్పత్తి అయిన ఆహారోత్పత్తులను వాడితే చర్మ సంబంధిత వ్యాధులొస్తున్నా యని ప్రపంచవ్యాపితంగా వైద్యులు ఘోషిస్తున్నారు. మన రాష్ట్ర ప్రభు త్వాలు ఈ విత్తనాలను మన దేశంలోకి రాకుండా నిరోధించగలగాలి.

భూమి సారవంతంకు సంబంధించిన అంశంపై భూమి సారవంత సామర్థ్య పరిశోధనా సంస్థకు చెందిన ప్రముఖ శాస్త్రజ్ఞులు ఏమని వ్యాఖ్యానించారంటే "భూమిలోని జీవపదార్థాన్ని తీసివేస్తే ఫ్యాక్టరీలోని లైట్లు తీసివేసినట్లు అవుతుందన్నారు. పొలాల్లో ఉండా ల్సిన భూమి బాక్టీరియాను 40%గా రసాయనాలు తగ్గిస్తున్నాయి. పర్యావరణవేత్తలు, శాస్త్రజ్ఞులు, వినియోగదారులు, రైతులు జన్యు మార్పిడి విత్తనాలను వాడటం వల్ల ఆహార భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. అమెరికా, బ్రిటన్‌లలో సోయా అలర్జీలు విత్తన మార్పిడివల్ల 10 సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి.

భారతదేశంలో జన్యు మార్పిడి విత్తనాలు వాడి ప్రత్తి పంట పండించిన వారికి చర్మ సంబంధిత వ్యాధులొచ్చాయన్న వార్తలు పొక్కుతున్నాయి. బహుళజాతి కంపెనీలు డ్రగ్ స్టడీస్‌ను సైతం నియంత్రించి జన్యు మార్పిడి విత్తనాల వల్ల లాభాలు అనేకం అంటూ విపరీతంగా డబ్బులు ఖర్చుపెట్టి కొంతమంది శాస్త్రజ్ఞులను కొనేసి వారితో అబద్ధాలతో కూడిన వ్యాసాలు తమ వార్తా పత్రికలలో వ్రాయించుకోవడం జరుగుతున్నది. ఈ బహుళజాతి విత్తన కంపెనీల ప్రభావం రైతు కుటుంబాలపై అనేక విధానాలుగా పడుతున్నది. రైతు కుటుంబాలతో ఒప్పందాలు చేసుకొని వారు విత్తనాలను తదుపరి పంటకు ఉపయోగించుకోకుండా సంతకాలు చేయించుకోవడం జరుగుతున్నది. అంటే ప్రతి పంటకు రైతు మళ్ళీ మార్కెట్లో కొత్తగా విత్తనాలను కొనాల్సిందే. లాభాల వాటా విత్తన కంపెనీల అధిపతు లకు చేరాల్సిందే. ఒక అంచనా మేరకు సారవంతమైన ఒక గ్రాము భూమిలో వంద మిలియన్ల సూక్ష్మజీవులుంటాయి. అవి 1000 జీవులకు సంబం ధించినవై వుంటాయి. ఇందులో ముఖ్యమైనవి బాక్టీరియా, ఫంగి, ఆల్గే, ప్రోటోజువా, వానపాములు లాంటివి

మే మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు

వరి : నీటి వసతి బాగా ఉన్న మాగాణి భూముల లోనూ, బావుల క్రింద భూములలోనూ పచ్చిరొట్ట ఎరువుగా జనుము, జీలుగ, పిల్లి పెసర లేదా ఏదేని ఒక పప్పుదినుసు పైరును విత్తు కోవాలి.

జొన్న : మే మాసము మొదటి పక్షములో కురిసే వర్షాలతో బాగా దుక్కిచేస్తే ఆ తర్వాత కురిసే రుతు పవన ప్రభావిత వర్షాలతో విత్తడము ఆరంభించ వచ్చును. సి.యస్.వి-15, సి.యస్.వి-1, వంటి మేలి రకాలు సి.యస్.హెచ్-6,9,10 మరియు 11 వంటి సంకర రకాలలో ఆయా ప్రాంతానికి తగిన ఏదో ఒక దానిని సేకరించుకొని మంచి తొలి వర్షాలకే విత్తడము ఆరంభించాలి. విత్తునప్పుడు హెక్టారుకు సుమారుగా 30కి, నత్రజని, 40కి భాస్వరం, 30కి పొటాష్ నిచ్చు ఎరువులు వేయాలి.

మొక్కజొన్న : జూన్ మాసంలో విత్తడానికి వీలుగా డి.హెచ్.ఎమ్ -101,103,107, అశ్వని, రోహిణి, హర్ష రకాలలో ఏదో ఒకరకపు విత్తనము సేకరించుకోవాలి. మాధురి రకమును పట్టణ పరిసర ప్రాంతాలలో వీలైనంత ముందుగా విత్తుకోవచ్చును. ఇవే కాకుండా ప్రైవేటు సంకర రకములను, దిగుబడి సామర్థ్యమును దృష్టియందుంచుకొని, ఏదో ఒకదానిని ఎన్నుకోవాలి.

పెసర : ఎం.ఎల్-267, ఎల్.జి.జి-407, 410,450,460 రకాలలో ఏదో ఒక రకాన్ని వీలును, ప్రాంతాన్ని బట్టి సేకరించుకోవాలి.

మినుము : టి-9, ఎల్.బి.జి-20, 623, పి.బి.జి-1 రకా లలో ఏదో ఒక దానిని సేకరించుకోవాలి.

కంది : పల్నాడు (యల్.ఆర్.జి-30) ఐ.సి.పి-8863 (మారుతి), ఐ.సి.పి.యల్-332, (అభయ) ఐ.సి.సి.యల్-87119 లేదా 85063 ఏదో ఒక దానిని సేకరించుకోవాలి. " మారుతి" రకము ఎండు తెగులును "అభయ" రకము శనగపచ్చ పురుగును కొంత వరకు తట్టుకుంటాయి.

నువ్వులు : స్వేతా తిల్, చందన, గౌరి, మాధవి, రాజేశ్వరి, వై.ఎల్.ఎమ్-11,17 రకాలు ప్రాంతాన్ని బట్టి ఎన్నుకోవాలి. తొలకరితోనే విత్తడము ప్రారంభించుకోవాలి. విత్తునపుడు హెక్టారుకు 20 కి, నత్రజని 60 కి, భాస్వరము 40 కి. పొటాష్ ఎరువులు వేయాలి.

వేరుశనగ : టి.ఎమ్.వి-2, జె.ఎల్-24 నారాయణ, వేమన రకాలలో ఏదో ఒక దాని సాగుకు విత్తనము సేకరించుకోవాలి.

సోయా చిక్కుడు : జె.ఎస్-335, ఎమ్.ఎ.సి.యస్-13, 58 రకాలు ఆయా ప్రాంతాన్ని బట్టి ఎన్నుకొని విత్తనము సేకరించుకోవాలి. క్రొత్త పైరుగా సాగుచేపట్టిన భూములలో ప్రత్యేకముగా రైజోబియం కల్చరును విత్తనముతో పాటు సేకరించుకోవాలి.

గోగు : విత్తుటకు నేలను తయారుచేయుట, సకాలంలో వర్షాలు కురిసిన మే ఆఖరులో విత్తుట.

చెఱకు : రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో నాటిన పైరుకు 45,90 రోజులలో నత్రజని ఎరువులను రెండు సమపాళ్ళలో వేయాలి.

మెట్ట వ్యవసాయ సేద్యం : ఈ మాసంలో కురియు వేసవి జల్లుల సహాయముతో చల్కా భూములలో దుక్కి చేసుకోవాలి. దీని వలన తర్వాత కురిసే వర్షపు నీరు బాగా గ్రహించుటవలన, విత్తిన పంట బాగా మొలకెత్తి దిగుబడులు పెంచడానికి పునాది. దీని వలన భూమిలో దాగియున్న కోశస్థ దశ యందున్న పంటలకు హాని కలిగించు పురుగులను నాశనము చేయుటకు కూడా వీలుపడుతుంది.

భూసార రక్షణ : గట్లు వేయుట, నేలలకు పశువుల ఎరువు, ఒండ్రుమట్టి తోలుకోవాలి. భూసార పరీక్షకు నమూనాలు సేకరించాలి.

వుంటాయి. ఇందులో 80% బాక్టీరియా, ఫంగీలుంటాయి. రసాయనపూరిత విత్తనాలను వాడటం వల్ల సారవంతమైన భూముల లోని ఈ సూక్ష్మజీవులన్ని అంతరించిపోతాయి.

పరిశోధనల్లో తేలిందేమిటంటే, దాదాపు 41% అమెరికన్లలో కేన్సర్ ఉండివుంటుంది. ఒక చిన్న చెంచా సారవంతమైన భూమిలో 1600 సూక్ష్మజీవులు (భూమిని సారవంతంగా ఉంచడానికి ఉపయోగపడేవి) ఉంటాయి. 84 దేశాల నుండి 800 మంది శాస్త్రజ్ఞులు జన్యు మార్పిడి విత్తనాలకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు.

అమెరికాలో మొత్తం విత్తన కంపెనీలలో 10 కంపెనీలు దేశంలోని 40% విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇందులో ప్రధానంగా జన్యు మార్పిడి విత్తనాలే ఉత్పత్తి అవుతున్నాయి. అందుకే అమెరికాలో 41% ప్రజలు ఎప్పుడో ఒకప్పుడు కేన్సర్ వ్యాధి బారినపడటం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో బహుళజాతి కంపెనీల రసాయనపూరిత అత్యంత ప్రమాదకరమైన పర్యావరణ హానికారక జన్యు మార్పిడి విత్తనాలను ఇప్పటికే ప్రపంచ వ్యాపితంగా శాస్త్రజ్ఞులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. మన దేశ రైతాంగం సైతం సాంప్రదాయ విత్తనాలను వాడుతూ రసాయన ఎరువులు కాకుండా మనమే వర్మి కంపోస్టు తయారు చేసుకొని అధిక దిగుబడులకు మార్గాలను అన్వేషించాలి. అమెరికా లాంటి దేశాలలో మరొకసారి అధిక పంట దిగుబడికి పంట విరామం ప్రకటించడం, పంట విరామం ప్రకటించినందుకు సైతం ప్రభుత్వం నుండి రైతు సబ్సిడీ పొందటం జరుగుతున్నది. అలాంటి సౌకర్యాల సాధనకు మన దేశ రైతాంగం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో వుంది. ✧

రైతు ఉద్యమ వార్తలు

దేవాదాయ భూముల సాగుదారుల కౌలు రద్దు చేయాలి !

కరువు ప్రాంతాల్లోని దేవాదాయ శాఖ పరిధిలోని సాగుదారుల కౌలును రద్దు చేసి, వారికి గుర్తింపు కార్డులు, రుణాలు అందజేసి ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవాదాయ సాగుదారుల (కౌలు రైతుల) కౌలు రద్దు చేయాలని, పేద కౌలుదార్ల తొలగింపు ప్రయత్నాలు విరమించాలని, జి.ఒ. నెం. 341, 425 ద్వారా చేసిన సవరణలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రియల్ 3వ తేదీన విజయవాడ దాసరి భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానాలు చేసింది. కౌలు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చెల్లుబోయిన కేశవశెట్టి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రావుల వెంకయ్య మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 33,565కు పైగా దేవాలయాల పరిధిలో సుమారు 3.70 లక్షల ఎకరాల భూములను కౌలు రైతులు సాగు చేసేవారని తెలిపారు.

1987లో దేవాదాయ ధర్మాదాయ చట్టం సెక్షన్ 82 ప్రకారం ఆనాటి ప్రభుత్వం కౌలు రైతులను తొలగించడానికి చేసిన ప్రయత్నంపై దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతుల సంఘం ఆందోళనలు చేయడంతో పాటు సుప్రీంకోర్టును ఆశ్రయించిందన్నారు. సుప్రీంకోర్టు 2.50 ఎకరాల మాగాణి, 5 ఎకరాల మెట్ట సాగు చేస్తున్న వారిని పేద రైతులుగా గుర్తించాలని, వారిని భూముల నుండి తొలగించకుండా రక్షణ కల్పించిందన్నారు. 2003లో జి.ఒ.నం 379 ద్వారా సాగుదార్లను వేలంపాటల ద్వారా తొలగించాలని చేసిన ప్రయత్నాన్ని సైతం అడ్డుకొని సంఘం ద్వారా పేద కౌలు రైతులను రక్షించుకోగలిగామన్నారు. 2006లో ఓగ్ని తుపానువల్ల పంట నష్టపోయిన సందర్భంలో నిరవధిక నిరాహార దీక్షలు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. తద్వారా జి.ఒ. నెం: 2711 ద్వారా దేవాదాయ భూములు సాగు చేస్తూ పంట నష్టపోయిన కౌలు రైతులకు కౌలు రద్దు అమలు చేయించి విజయం సాధించామన్నారు.

రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 359 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, వాస్తవంగా 500 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని నాగార్జున సాగర్, కృష్ణాడెల్టా ఆయకట్టు కింద భూములు సాగుచేయలేదని, కరువు ప్రాంతాల్లోని దేవాదాయ భూములను కౌలు రైతులు సాగు చేయలేకపోయారన్నారు. వేసిన కొద్దిపాటి పంటలు కూడా వర్షాభావం వల్ల ఎండిపోయి దిగుబడిరాక తీవ్రంగా నష్టపోయిన దేవాదాయ కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు రద్దుచేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారా దేవాదాయ భూముల సాగుదార్ల రక్షణకు సాధించుకున్న హక్కులను ప్రస్తుత పాలకులు హరించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. దేవాదాయ శాఖామంత్రి తమ కాషాయీకరణ భావజాలాన్ని చొప్పించి ఇతర మతస్తులను దేవాదాయ భూముల నుండి గెంటివేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (సీపీఎం) రాష్ట్ర నాయకులు పి. నరసింహారావు, అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి. హరనాథ్ మాట్లాడుతూ పేద కౌలు రైతుల ఆదాయ పరిమితి 12 వేలకు పరిమితంచేసి ఆపై ఆదాయం ఉన్న వారిని ధనిక రైతులుగా గుర్తించి నోటీసులు ఇస్తూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఆదాయం 36 వేల రూపాయల కలిగి ఉన్నవారిని పేదలుగా ప్రభుత్వం గుర్తిస్తున్నదని, అదే ప్రభుత్వంలోని దేవాదాయ శాఖ 12 వేల ఆదాయ పరిమితి విధించడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం పేదరైతుల నుండి భూములు గుంజుకుని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలను వ్యతిరేకించాలన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రైతుసంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మల్నీడి యల్లమందారావు, రైతు నాయకులు పెద్ది వెంకటరత్నం, తాతినేని సీతారావమ్మ, యాళ్ళ అయ్యన్న, డి. శ్రీనివాస్, శనగల సుబ్బారెడ్డి, వేగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ✧

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి దళారుల దోపిడీని అరికట్టాలి

అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు నందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి దళారుల దోపిడీని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అద్దంకి డివిజన్ నాయకులు మానం వెంకటనారాయణ ఏప్రియల్ 6వ తేదీన తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అశోకవర్ధన్‌తో మానంవెంకటనారాయణ మాట్లాడుతూ అద్దంకి మండలంలో ఈఏడాది బోర్ల క్రింద సుమారు 1000 ఎకరాలలో వరి సాగు చేసి 30వేల బస్తాల వరి ధాన్యం పండించడం జరిగిందన్నారు. అదేవిధంగా బల్లికురవ మండలంలో 1000 ఎకరాలు, పంగులూరు మండలంలో 750 ఎకరాలు, ముండ్లమూరు మండలంలో 400ఎకరాలలో రైతులు వరి సాగుచేశారన్నారు. ఆయా మండలాల రైతులంతా ధాన్యంఅమ్ముకోవడానికి అద్దంకి కేంద్రానికి రావడానికి అలవాటు పడ్డారన్నారు. ఈ సంవత్సరం దళారులు సిండికేట్‌గా మారి 76 కేజీల బస్తా రూ॥ 900లకు మాత్రమే కొనడానికి ప్రారంభించారని పైగా గోతం ఖరీదు రైతుల వద్దనే వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ (1010 ఎన్.ఎల్‌ఆర్. 145 రకాలు) క్వింటా రూ. 1450లుగా, బిగ్రేడ్ (మూడు పిడికెళ్ళు) సాధారణ రకం క్వింటా రూ. 1430లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళితే రైతుకు రవాణా ఖర్చుతో అన్ని ఖర్చులు కలిసి రూ. 50లు మాత్రమే పడుతుందన్నారు. గోతం ప్రభుత్వమే సరఫరా చేస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మితే రైతుకు బస్తాకు రూ॥ 100లు అదనంగా వస్తుందన్నారు. అందుచేత రైతులు వారు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. వాస్తవ పరిస్థితులను జిల్లా కలెక్టరుకు, 'పౌర సరఫరాల ఉన్నతాధికారులకు తమ విన్నపాన్ని తెలియజేయ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అద్దంకిలో ఏర్పాటు చేసేందుకు సహకరించాలని తహశీల్దార్‌ను మానం వెంకటనారాయణ కోరారు.

కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మాకినేని వెంకటేశ్వర్లు, మాకినేని శ్రీనివాసరావు, సీపీఐ అద్దంకి మండల కార్యదర్శి ప్రసాద్ ఇతరులు పాల్గొన్నారు. ✧

++

లోపాలమయం 'ముటుకుల సాగునీటి పథకం'

రూ. 16.90 కోట్లతో ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలంలోని ముటుకుల గ్రామంలో నిర్మించిన తాగునీటి పథకం లోపాలమయంగా మారిందని ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి కే.వి.వి. ప్రసాద్ విమర్శించారు. ఏప్రియల్ 9న మండలంలోని ముటుకుల సాగునీటి పథకాన్ని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కే.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి సమ్మర్ స్టోరేజిని నిర్మించినా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పది గ్రామాలకు కూడా నీటి సరఫరా జరగడం లేదని ఆరోపించారు. 44 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉన్నప్పటికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పథకం విఫలమైందని ఆయన ఆరోపించారు. అధికారులకు ఈ పథకం కల్పతరువుగా మారిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. నిర్వహణ కూడా లోపాలపుట్టగా మారిందని అన్నారు. 44 గ్రామాల్లో పది గ్రామాలకు కూడా సరఫరా కావడం లేదంటే అధికారుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న దశలో ఈ పథకంలో పూర్తిస్థాయి నీరు చేరితేనే గ్రామాలకు సరఫరా చేయడం కష్టమని ఆయన అన్నారు. ఎన్ఎస్‌పి కాలువ ద్వారా కనీసం 65 శాతం నీరు కూడా చేరలేదని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ తాగునీటి పథకంపై చిత్తశుద్ధితో కృషి చేసి లక్ష్యాలమేరకు ప్రజలకు తాగునీటిని అందించాలని అన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాణ్యతలేని పైపులను వాడి నీటిని అధికారులే దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. సాగునీరు అందక ప్రజలు అగచాట్లు పడుతూ పలువురు ప్రజలు గ్రామాల్లో నీటిసరఫరా చేసే ట్యాంకర్ల వద్ద నీటి యుద్ధాలు కూడా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఈ తాగునీటి పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకుంటే రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రైతుసంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాస్, సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, మండల పార్టీ కార్యదర్శి జివి గురునాధం, సహాయ కార్యదర్శి గుంటూరు శ్రీనివాసాచారి, ముటుకుల గ్రామ సీపీఐ నాయకులు పి. నరసింహారావు, పి. సుభాష్, ఎ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ✧

సుబాబుల్, జామాయిల్, సరుగుడు రైతులను ప్రభుత్వం విస్మరించడం దారుణం

రైతులను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కెవివి. ప్రసాద్ అన్నారు.

గుంటూరు అరండల్‌పేటలోని ఏంజల్ టాకీస్ సినిమా హాలులో ఏప్రిల్ 5న జిల్లా రైతుసంఘం ఆధ్వర్యంలో సుబాబుల్, జామాయిల్, సరుగుడు రైతుల సదస్సు జరిగింది. సదస్సుకు రైతు సంఘం నాయకులు వై.లూర్ధురాజయ్య అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ దేశానికి రైతే రాజుని, దేశానికి వెన్నుముక రైతులంటూ చెబుతున్న రాజకీయ నాయకులు ఎన్నికల్లో గెలుపొందిన తరువాత రైతులను విస్మరిస్తున్నారన్నారు. రైతులు కష్టపడి సాగు చేసిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులపై రాయితీలను రద్దుచేశారన్నారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సూచనలను అమలు చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేటికి వాటిని అమలు చేయలేదన్నారు. రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన పంటతో దళారులు కోట్లు సంపాదిస్తూ రైతుల పొట్టకొడుతున్నారన్నారు. నేటికి రాష్ట్రంలో రైతుల ఆత్మ హత్యలు ఆగటం లేదని,చనిపోయిన రైతుల కుటుంబాలకు తగినంత నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను సబ్సిడీ క్రింద ఇస్తోందని, దేశానికి అన్నంపెట్టే రైతన్నకు మాత్రం ఎలాంటి రాయితీలు లేవన్నారు. దేశ వ్యాప్తంగా 90శాతం మంది రైతులు ఆపదలో ఉన్నారన్నారు. 1995లో ప్రకాశం జిల్లాలో సుబాబుల్, జామాయిల్ రైతులకు న్యాయం చేయాలని రైతులందరూ పోరాటాలు చేశారన్నారు. మార్కెటింగ్‌శాఖ సెంట్రల్ ఫండ్ ద్వారా సుబాబుల్, జామాయిల్ రైతులకు అందచేయాలన్నారు. యుపిఏ ప్రభుత్వం రైతులను అంధకారంలోకి నెట్టిందన్నారు. రాష్ట్రంలో ఆరు లక్షల ఎకరాల్లో పంటసాగు చేస్తున్నారని, వర్షాలు సకాలంలో కురవక మూడు సంవత్సరాల్లో చేతికి రావాల్సిన పంట ఐదు సంవత్సరాలకు వస్తోందన్నారు. రైతులకు క్వింటాకు 600 రూపాయల మద్దతు ధర కల్పించాలన్నారు. రైతులు పండించినపంటకు మార్కెట్ యార్డులోనే అమ్మకాలు జరగాలన్నారు. రైతాంగసమస్యల పరిష్కారానికి రైతు లందరూ కలసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సుబాబుల్, జామాయిల్ రైతుల సంఘం ప్రధానకార్యదర్శి వి.హనుమారెడ్డి మాట్లాడుతూ సుబాబుల్, జామాయిల్ పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సిపిఐ జిల్లాకార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రైతులకు మోసపూరిత మాటలు చెబుతూ వారికి తీవ్రఅన్యాయం చేస్తున్నారన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో విఫలమయ్యా రన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నకే అన్నం కరవైందన్నారు. పంట సాగు చేసే రైతులు గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, వర్షాలు లేక, పంటలుపండక అలమటిస్తున్న గ్రామాలను కరవు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు రైతులకు న్యాయం జరగలేదన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంఘటిత సంఘాలు ఉన్నాయని, రైతులందరూ కూడా ఆవిధంగా సంఘాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. నాగార్జునసాగర్ కుడికాల్వ ఆయకట్టు పరిధిలో పంటలు సాగుచేస్తున్న రైతులు మండల కార్యాలయాల వద్ద తమ సమస్యలు పరిష్కారం జరిగే వరకు కార్యాలయాలను దిగ్బంధం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, సుబాబుల్, జామాయిల్, సరుగుడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుండూరు సుబ్బారావు, ముసునూరి రమేష్,సీపీఐ చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి సీఆర్.మోహన్, వలవపూడి రాము, నరసరావుపేట ఏరియా కార్యదర్శి కాసారాంబాబు, అమరలింగేశ్వరరావు, సీనియర్ నాయకులు సీహెచ్‌ఎల్.కాంతారావు, షేక్ బుడే, ఏఐటీయూసీ అధ్యక్షుడు షేక్‌సైదా, ఏఐవైఎఫ్ వైదన వెంకట్, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి సుబాబుల్, జామాయిల్, ఇతర పంటలు సాగు చేసే రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సదస్సులో ఎనిమిది తీర్మానాలను ఆమోదించారు. అనంతరం 11 మందితో సుబాబుల్, జామాయిల్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ✧

జి.ఓ. నెం. 341 ఉపసంహరించాలని కోరుతూ ...



కౌలు రైతులపై ప్రభుత్వ విధానం సరికాదని ఏపీకౌలు రైతుల సంఘం శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు అన్నారు. ఏప్రియల్ 11న పాలకొండ మండలం కొండాపురం గ్రామంలో దేవాదాయ, ధర్మాదాయ భూములను చేస్తున్నటువంటి కౌలు రైతులకు నష్టం వాటిల్లే విధంగా జి.ఒ. నెం.341 ప్రభుత్వం విడుదల చేసిందని, దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన జి.ఒ. కాపీలను ఆ సంఘ జిల్లా కో కన్వీనర్ కిమిడి రామ్మూర్తి ఆధ్వర్యంలో 341 జి.ఒ. కాపీలను రైతులు దగ్ధం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఈ జి.ఒ.ను తక్షణమే వెనక్కు తీసుకోవాలని తీసుకోకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. 1987లో దేవాదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం కౌలు రైతులను తొలగించే ప్రయత్నాన్ని తిప్పి కొట్టేవిధంగా ఉద్యమం చేపట్టామని ప్రస్తుతం ఈ జి.ఒ.ను వెనక్కు తీసుకుని కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవా లని, వడ్డీలేని రుణాలు, గుర్తింపు కార్డులు ప్రతీ ఒక్క కౌలు రైతుకు అందజేయాలని డిమాండ్ చేశారు.

60 ఏళ్ళు దాటిన కౌలు రైతుకు మూడు వేల రూపాయల పించను సదుపాయం కల్పించాలని, ఈ మెయిల్ ద్వారా టెండరు ప్రక్రియ తక్షణమే రద్దు చేయాలని, కౌలు రైతులకాల పరిమితి మూడేళ్ళు కొనసాగించాలని పంట చేతికి అందిన తరువాత రైతుల నుండి కౌలు వసూళ్ళు చేయాలని తదితర అంశా లతో నినాదాలుచేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల బత్తుల రామమూర్తి, నిడగట్ల రామారావు, బి.వి. రమణమూర్తి, మామిడి సత్యం నాయుడు అనేక మంది కౌలు రైతులు పాల్గొన్నారు. ✧

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఏరువాక పనులు ప్రారంభం



ప్రకృతి పరంగా, ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య అన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామంలో ఉగాది రోజు ఏపీ రైతుసంఘం తాలూకా అధ్యక్షులు పెద్ద వీరన్న అధ్యక్షతన ఏరువాక వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తరచూ నష్టాలు రావడంతో వ్యవసాయానికి దూరమవుతన్న రైతులు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్ళి బేల్దార్ పనులు, ప్రైవేట్ కంపెనీలలో వాచ్‌మేన్‌లుగా దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. రైతులకు మేలు చేస్తామంటున్న పాలకుల ఆర్భాటంగా ప్రకటనలు, ఉపన్యాసాలు ఆదుకోలేక పోతున్నాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు ఇతర వృత్తులవైపు మళ్ళుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సమితి పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా ఏరువాక వేడుకలు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజా సాహెబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కారన్న, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు హెచ్ రంగన్న, ఖాజా, రైతులు నాగభూషణం, రంగన్న, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ✧

కౌలురైతుల హక్కులు పరిరక్షించాలని కోరుతూ...

కరవు వల్ల, సాగునీరు అందక పంటలు నష్టపోయిన కౌలు రైతులకు కౌలు రద్దు చేయాలని, 2016-17 సంవత్సరానికి తిరిగి కౌలు చేసుకునే అవకాశం కల్పించాలని, జి.ఓ ఎంఎస్ నెం. 341లో దేవాదాయ భూముల కౌలు రైతులకు నష్టం కలిగించే అంశాలు తొలగించాలని, కౌలు కాలపరిమితి మూడు సంవత్సరాలు ఉండాలని, కౌలు సొమ్ము మూడు దఫాలుగా చెల్లించే వీలు కల్పించాలని, తదితర 15 డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యాన ఏప్రిల్ 18న రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కలెక్టరేట్లు, దేవాదాయ శాఖ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించారు. ఆయా ధర్నాల్లో రైతుసంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు, కౌలుదార్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. శ్రీకాకుళం జిల్లా నుండి కర్నూలు జిల్లా వరకు అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఈ ధర్నాలు జరిగాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, రైతు సంఘం కృష్ణా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలగపూడి ఆజాద్, మల్నీడి యల్లమందరావు, జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షులు రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ దేవాదాయ భూముల కౌలు వేలంలో పాల్గొనేందుకు, సాగు చేసుకునేందుకు హిందూ మతేతరులు అర్హులు కాదంటూ జి.ఓ.లు విడుదల చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. మత ప్రసక్తి లేకుండా కౌలు వేలంలో అన్ని మతాలవారు పాల్గొనే అవకాశం కల్పించాలని డిమాండు చేశారు.

కర్నూలు జిల్లా పత్తికొండలోని చదువులరామయ్య భవన్ నుండి కౌలు రైతులు భారీ ర్యాలీగా వెళ్ళి నాలుగు స్తంభాల కూడలిలో రైతు సంఘం తాలూకా అధ్యక్షులు పెద్ద వీరన్న ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య, కౌలు రైతు సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు కడవల ఖాసీం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ పొలం సొంతదారులకే వ్యవసాయం గిట్టుబాటుగా లేనపుడు ఇక కౌలుదారులకు ఏవిధంగా గిట్టుబాటు అవుతుందని ప్రశ్నించారు. కౌలు రైతులకు బ్యాంకులు స్కేలాఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, ప్రభుత్వమే పూచీకత్తుగా నిలవాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండు చేశారు.

కర్నూలు జిల్లా :

ప్రభుత్వం పూచికత్తుగా ఉండి కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ధర్నానుద్దేశించి కె. జగన్నాథం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న లక్షమంది కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే పూచికత్తుగా ఉండి పంట రుణాలు ఇప్పించటంతో పాటు సబ్సిడీ విత్తనాలు ఎరువులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్సిడీ పథకాలతో పాటు రుణమాఫీని కౌలు రైతులకు వర్తింప చేయాలని కోరారు. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులే వ్యవసాయం మానివేస్తుంటే కౌలు రైతులకు వ్యవసాయం ఎలా గిట్టుబాటు అవుతుందని ప్రశ్నించారు. ఎకరాకు కౌలు రూ॥ 5వేల నుంచి 25 వేల వరకు ఉందని, దేవాదాయ, ధర్మాదాయ భూములను ధనిక రైతులకు అప్పగించకుండా చిన్న, సన్నకారు రైతులకు దక్కేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పెరుగుతున్న కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం. మహేష్, రైతు సంఘం నాయకులు నరసింహులు, జయన్న, బాలరాజు, సి. వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ఆదోని :

కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి కౌలురైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలను అధికారులు అందించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణలు డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలురైతులకు ప్రభుత్వ పథకాలను అందించి కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని ఎమ్మార్వో శ్రీనివాసరావుకు అందించారు. ధర్నాలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు నరసప్ప,జిల్లా కౌన్సిల్ సభ్యులు గుడిసె ఈరన్న, నాయకులు రాము, ఈరన్న, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఈరన్న గౌడ్, డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాశ్, ఈరన్న, సిపిఐ నాయకులు ముక్కన్న, మంజునాథ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ రూరల్‌లో :

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరుచేసి తక్షణమే వారిని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులుఎం. జగదీష్ డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం అరకొరగా కార్డులు మంజూరు చేసిందేకానీ వారికి రుణాలు మంజూరు చేసి ఆదుకోవటంలో విఫలం చెందిందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ తిరుమలవాణికి అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘంజిల్లా నాయకులు శాంతకుమార్, మండల కార్యదర్శి కండప్ప, రాజు, శేఖర్, వెంకటేశ్వర్లు, గోపాల్, వెంకటేష్, మధు, మహేష్, మాదన్న,నరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్‌లో :

కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయంనందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం రైతుసంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు బి.జి.మాదన్న మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు వ్యవసాయాన్ని మానేస్తున్నారని, రైతుల పొలాలను కౌలుకు ఇచ్చేవారి సంఖ్య పెరిగిపోయిందని, కర్నూలు జిల్లాలో దాదాపు లక్షమందికి పైగా కౌలురైతులున్నారని, కౌలు ఒక ఎకరాకు 5వేలనుండి 25వేల వరకు ఉందని, వర్షాలు సకాలంలో రాక పోవడంవలన పంటలు పండక, గిట్టుబాటు ధరలు లేక కౌలు కూడ చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వం కౌలు రైతులకు సబ్సిడి విత్తనాలు, ఎరువులు పంట రుణాలు ఇవ్వడంలేదని, తక్షణమే ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండు చేస్తూ ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యన్న, మునిస్వామి గౌడ్, సోమేశ్వరరెడ్డి, బషీరుఅహమ్మద్, అబ్దుల్, ఆర్.రామచంధ్ర, రంగన్న, ఏసేపు, బాలరాజు, జబ్బర్, రాముడు, కలందర్, మల్లికార్జునగౌడ్‌లు పాల్గొన్నారు.

మద్దికెరలో :

ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల రైతులను ఆదుకోవటంలో విఫలం చెందిందని సిపిఐ మండల కార్యదర్శి హనుమప్ప, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు నెట్టెకంటెయ్య, కోదండరాముడు తదితరులు పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. కరువు బాధితులకు పంట నష్టపరిహారం మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అసైన్డ్ భుములను 192 ఎకరాలు మద్దికెర మండలం బొమ్మనపల్లె గ్రామానికి చెందిన పేదలకు పంపిణీ చేయాలని కోరారు లేని పక్షంలో ఉద్యమిస్తామన్నారు.

దేవనకొండలో :

కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి అదుకోవాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముందుగా సిపిఐ కార్యాలయం నుండి రైతుసంఘం ఆధ్వర్యంలో ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకోని, కార్యాలయం దిగ్బంధించి రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు శాంతికుమార్ అధ్యక్షత వహించగా, జగదీష్, మండల కార్యదర్శి కండప్పలు మట్లాడుతూ జిల్లాలో కౌలురైతులను అన్ని విధాల అదుకోవాలన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలోకి వెళ్ళి, ప్రజాదర్బార్‌లో తహశీల్దార్ తిరుమలవాణి, ఎంపిడిఓ ఉమామహేశ్వరమ్మలకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం, సిపిఐ నాయకులు రాజశేఖర్, శేకర్, వెంకటేశ్, నర్సయ్య, బసవరాజు, పురుషోత్తం, మధు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హాలహర్విలో :

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, దేవాదాయ భూములు సాధారణ గుత్తకే ఇవ్వాలని, జీఓ 425ను రద్దు చేయాలని, పంట బీమాపై ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండు చేశారు. అనంతరం డిప్యూటి తహశీల్దార్ జయరామ్‌కు వినతిపత్రం సమర్పించారు. నాగరాజు, ఎర్రిస్వామి, గాదెలింగప్ప, శేషగిరి, శేకప్ప, మస్తాన్, లాల్‌సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలిలో :

గత రెండు సంవత్సరాల నుండి కరువు కాటకాలతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతులసంఘం జిల్లా నాయకులు ఉమాపతి డిమాండ్ చేశారు. తుగ్గలిలోని తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం నాయకులురాజు, మద్దిలేటి, రామలింగడు, ప్రసాద్, వైఎఫ్ తాలూకా కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హొళగుందలో :

మండలంలోని కౌలు రైతులకు బ్యాంకులద్వారా కొత్తరుణాలు అందించాలని మండల రైతుసంఘం నాయకులు స్థానిక సాయబన్న దర్గానుండి తహశీల్దార్ కార్యాలయంకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైతుసంఘం రాష్ట్ర సమితి సభ్యులు బసాపురం గోపాల్ ఆధ్వర్యంలో తహశీల్దార్ సతీష్‌కు వినతిపత్రం

సమర్పించారు. ఈ కార్యక్రమంలో రంజాన్, మహ్మద్, పీరాసాబ్, సిద్ధబసప్ప, గౌరీష, మల్లి, తిరుపతి, పలు గ్రామాల సిపిఐ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల రూరల్‌లో :

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి మద్దిలేటి నాయుడు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,గుర్తింపు కార్డులు ఇచ్చిన రైతులకు బ్యాంకులో రుణాలు కల్పించాలని, గ్రామాల్లో దేవాదాయ, ధర్మాదాయ భూములలో కౌలును రద్దు చేయాలని, వర్షాలులేక పంటలు పూర్తిగా ఎండిపోవడంతో ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖా కార్యదర్శి జంగం శంకరయ్య, శాంతకుమార్, యేసేన్న, బేతల పెద్దబాషు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరులో :

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలంటూ కౌలు రైతు రాష్ట్ర కమిటి పిలుపుమేరకు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి హనుమంతు, రైతు సంఘం నాయకులు హయత్ పటేల్‌లు మాట్లాడుతూ గతసంవత్సరంలో వర్షాలు పడక కరువు పరిస్థితుల మూలంగా వేసిన పంటలు పండక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు స్కేలాఫ్ ఫైనాన్స్ క్రింద రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులందరికి సబ్సిడి ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని, కౌలురైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నాగరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హుస్సేని, నాయకులు హుస్సేన్‌ఖాజా, మారెప్ప, లక్ష్మన్న, మూకన్న, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి రూరల్‌లో :

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటి పిలుపుమేరకు కోసిగిలోని రైతుసంఘం మండల అధ్యక్షులు తాయన్న అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి గోపాల్, ఓంకారస్వామి తదితరులు హాజరయ్యారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రజనీకాంతరెడ్డికి అందజేశారు. ఎఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు ప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, సిపిఐ, రైతుసంఘం నాయకులు గిరివాసులు, గోవిందు, తిమ్మన్న, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

నందవరంలో :

కౌలు రైతులందరికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వినతులతో కూడిన పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. సిపిఐ మండల కార్యదర్శి పంపన్న గౌడ్, రైతు సంఘం నాయకులు చంద్ర గౌడ్, రమేష్, జలాల్, బడేసాబ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో :

కౌలు రైతుల సమస్యల పరిష్కరించాలంటూ నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రాలయ నియోజక వర్గ కార్యదర్శి డి. విజయభాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ప్రభుత్వ పూచీకత్తుతో పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులను పరిగణలోకి తీసుకుని అన్ని రకాల సబ్సిడీలు ఇవ్వాలని కోరారు. సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లా :

రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.341 ద్వారా దేవాలయ కౌలు రైతులకు ఉన్న కొద్దిపాటి రక్షణ కూడా లేకుండా చేస్తే సహించేది లేదని సీపీఐ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాపర సుందర్‌లాల్, బుడితి అప్పల నాయుడులు అన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన కౌలు రైతుల ధర్నాని ఉద్దేశించి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంకౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణ సదుపాయం కల్పించాలని కోరారు. రైతాంగానికి రుణ మాఫీ, హామీ హామీగానే కొనసాగుతుందని విమర్శించారు. సుందర్‌లాల్ మాట్లాడుతూ ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ వలన సన్న, చిన్నకారు రైతులకు దేవాదాయ భూములు లేకుండా పోతాయని, కార్పొరేట్ శక్తులకు ఈ భూములను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుతంత్రం పన్నుతుందని దాన్ని విరమించుకోకపోతే రైతాంగం బుద్ధి చెబుతుందని అన్నారు. రైతాంగ సమస్యలను పక్కదారి పట్టించడానికి కొత్త కొత్త ప్రకటనలతో దృష్టి మళ్లిస్తున్నారని ఇది దురదృష్టకరమన్నారు. ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని కౌలు రైతులను గుర్తించి, గుర్తింపు కార్డులివ్వాలని, దేవాదాయ భూములను వేలం గ్రామ

సభల్లోనే జరగాలని డిమాండ్ చేసారు. 3 సం.లకు ఒకసారి వేలం ప్రక్రియ ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం జరిగితే ఆ నష్ట పరిహారం కౌలు రైతులకే చెల్లించాలని ప్రభుత్వమే హామీగా ఉండి వారికి రుణాలివ్వాలని కౌలు రైతులకు ప్రభుత్వ వ్యవసాయ సబ్సిడీ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేసారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ రజనీకాంతారావుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో కిమిడి రామ్మూర్తి నాయుడు, కౌలు రైతుల జిల్లా కన్వీనర్ వి. వెంకటరావు, బి.వి. రమణారావు, కె. విష్ణు, ఎ. ధాలినాయుడు తదితరులు రైతాంగ సమస్యలపై మాట్లాడారు. జిల్లా నలుమూలల నుండి కౌలు రైతులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు.

తూర్పు గోదావరి జిల్లా :

దేవాదాయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులసమస్యలపై ఆంధ్రప్రదేశ్రైతుల సంఘం ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

రైతులపట్ల ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా రైతులు చేసిన నినాదాలతో కలెక్టరేట్ హోరెత్తింది. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు మాట్లాడుతూ దేవాదాయ శాఖ భూములను చేస్తున్న రైతులు మూడేళ్ళకోసారి వారు పేద రైతులుగా అధికారులచే ధ్రువీకరణ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం రూ. 36 వేలు సంవత్సర ఆదాయం ఉన్నవారిని పేదలుగా గుర్తిస్తుంటే ఈ రైతులకు మాత్రం రూ. 12 వేలు ఆదాయంఉండాలని జీవో 341, 425 జారీ చేయడం రైతుల పట్ల ప్రభుత్వ తీరుకుఅద్దం పడుతుందన్నారు. వెంటనే అసంబద్ధంగా ఉన్న ఈ జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు కాల పరిమితి సంవత్సరం నుంచి 3 సంవత్సరాలు పెంచాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వై. అయ్యన్న కోరారు. పండ్లతోటలకు వర్తించిన 11 సంవత్సరాల కాల పరిమితిని కొబ్బరికి కూడా వర్తింపజేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ చెల్లుబోయిన కేశవశెట్టి డిమాండ్ చేశారు. జిల్లాలోని సఖినేటిపల్లిలో సముద్రతీర ప్రాంతంలోని భూములను అభివద్ధి చేసుకుని సాగు చేస్తున్న రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులకు వ్యతిరేకంగా విడుదల చేసిన జీవో కాపీలను నేతలు దగ్ధం చేశారు. అనంతరం రైతు సంఘం నేతలు జిల్లా కలెక్టర్ అరుణ్కుమార్ను కలిసి వినతి పత్రం అంద జేశారు. జీవో విషయం ప్రభుత్వానికి తెలియజేస్తామని, తీర ప్రాంతంలో డ్రెజ్జింగ్ నిర్వహిస్తే అక్కడ డీ పట్టా భూమల రైతులకు పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనిపై రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి రెడ్డి సత్యనారాయణ, సఖినేటిపల్లి జెడ్పీటీసీ సభ్యులు రావి ఆంజనేయులు, బెల్లంకొండ సుబ్రహ్మణ్యం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా :

కరువు పరిస్థితుల వలన పంటలు నష్టపోయిన దేవాదాయ భూముల కౌలు రైతుల కౌలును రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరిశేటి గురవయ్య డిమాండ్ చేశారు.



నగరంలోని దేవాదాయ శాఖ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరిశేటి గురవయ్య మాట్లాడుతూ జీవో 341తో పేద కౌలు రైతులను భూముల నుంచితొలగించే ప్రయ్నతం జరుగుతుందని, ఇటువంటి కుటిల ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. కౌలు రైతులకు నష్టం కలిగించే అంశాలను జీవోనుంచి తొలగించాలన్నారు. కౌలు కాల పరిమితి 3 సంవత్సరాలు తప్పక ఉండాలని, దేవాదాయ కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకులలో స్కేల్ ఆఫ్ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. మత ప్రసక్తి లేకుండా వేలంపాటలో అన్ని మతాలకు చెందిన పేద రైతులు పాల్గొనేలా అవకాశం కల్పించాలన్నారు. పేద రైతుల ఆదాయ పరిమితి రూ. 12 వేల నుంచి రూ. 36 వేలకుపెంచాలని డిమాండ్ చేశారు. ఇ-టెండర్ల పేరుతో కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే విధానం విడనాడి పేదలకు భూములివ్వాలన్నారు. అనంతరం దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.వి. శ్రీనివాసరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముసునూరి రమేష్, అధ్యక్షులు ఎం. శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, టి.బాబురావు, వై. వెంకటేశ్వర్లు, ఎం. అమరలింగేశ్వరరావు, కె. విఠల్రెడ్డి, పి. కోటేశ్వరరావు, కె. సాంబిరెడ్డి తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

విశాఖపట్నం జిల్లా :

దేవాదాయ కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆనకాపల్లిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా రైతుసంఘం కార్యదర్శి మేకా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వేచలపు వెంకట రమణ (కాసుబాబు)లు మాట్లాడుతూ జి.వో నెం. 379, 341లో ఉన్న రైతులకు అనుకూలంగా ఉన్న అంశాలను

కొనసాగిస్తూ, కౌలు రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించే అంశాలను తొలగించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి ఒక్కసారి నిర్వహించే వేలం విధానం రద్దు చేయాలని, కరువువల్ల, నీరులేక పంటలు నష్టపోయిన కౌలు రైతులకు కౌలు రద్దు చేయాలని 2016-17 సంవత్సరానికి తిరిగి కౌలు చేసుకొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పట్టణ కార్యదర్శి వై.ఎన్. భద్రం, మునగపాక మండల కార్యదర్శి ఎం.ఎ.మాదవరావు, ఎన్. సత్యనారాయణ, బొడ్డేడ వీరునాయుడు, కొత్తపల్లి అప్పారావు,బోయిన మల్లయ్య, ఆర్. రామచంద్రరావు, కర్రి సూర్యనారాయణ, చెల్లూరి నాగరాజు, అర్జునరావు, మజ్జి అప్పలనాయుడు ఉన్నారు.

విజయనగరం :

రాష్టంలో ఉన్న దేవాదాయ కౌలు రౌతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. గంగాభవాని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఆర్.పుష్పనాధం కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గంగాభవాని మాట్లాడుతూ రాష్టంలో సుమారుగా ఉన్న 16 లక్షల కౌలు రైతులు సాగుచేస్తున్న భూమిని గుర్తించి, వారికి గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. అదే విధంగా వారికి ప్రభుత్వమే బ్యాంకు రుణాలిప్పించి, వ్యవసాయాన్ని ప్రోత్స హించాలని కోరారు. రాష్టంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర, మరియు ప్రకాశం జిల్లాల్లో సుమారు 360 మండలాలను కరువు మండలాలు ప్రకటించింది. దేవాదాయ, ధర్మాదాయ భూముల రైతుల శిస్తును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం జీవో 379 ద్వారా కౌలు రైతులు సాధించుకున్న కొద్దిపాటి రక్షణలను సైతం కాలరాసి, పేద రైతుల భూముల నుంచి తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విడనాడాలని కోరారు. అదేవిధంగా కౌలు కాలపరిమితిని మూడేళ్లపాటు పొడిగించాలని, కౌలు సొమ్మును మూడు దఫాలుగా చెల్లించే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుగత అశోక్, నాయకులు అలమండ ఆనందరావు, కృష్ణ, కోరాడ గురువులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా :

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామ లెక్కదాఖలాకు చెందిన సహస్రలింగేశ్వరాలయ భూములను వేడాం, రామాపురం గ్రామ రైతులకే హక్కు కల్పించాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. భాస్కర్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తి రూరల్ ఎమ్మార్వోకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పి. భాస్కరరెడ్డి మాట్లాడుతూ దేవాలయ భూములు సర్వే నెంబరు 161లో 201 ఎకరాలు, సర్వేనెంబరు 162లో 65 ఎకరాల భూముల్లో 1949 సంవత్సరం నుండి వేడాం, రామాపురం, అబ్బాబట్లపల్లె గ్రామాల్లోని రైతులు సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరంతా కూడా భూమిలేని పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందినవారే ఎక్కువగా వున్నారన్నారు. గత దశాబ్దాలుగా సాగుచేసు కుంటున్నవారికే ఆ భూములు దక్కాల్సిన అవసరముందన్నారు. కావున ఆ భూముల్లోసాగుచేసుకుంటున్నవారికే హక్కు కల్పించాల్సిందిగా రైతు సంఘం తరపున కోరినట్లు తెలిపారు. లేకుంటే న్యాయపరమైన చర్యలుతీసుకోవాల్సి వుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం స్థానిక నాయకులు వెంకటకృష్ణ, సుబ్బరామయ్య,సుబ్బయ్య, వేడాం మల్లి, నాగరాజు, చిరంజీవి, కొండయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లా :

రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కారం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు టి.రామసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. చంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షులు ఏవి రమణలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 360 మండలాల్లో కరువు విలయ తాండవం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇంకా కరువు జాబితాలో చేర్చని ప్రాంతాలు అనేక ఉన్నాయని, కరువు ప్రాంతాల్లో ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టడంతో పాటు రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. అంతేకాక కౌలు రద్దు చేయాల్సిన అవసరమున్నదన్నారు. ఇటీవల ప్రభుత్వంతీసుకు వచ్చిన జీవో 341లో వచ్చిన మార్పులు దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలుదారులను భూమికి దూరం చేసే విధంగా సవరణలు తీసుకువచ్చారన్నారు. దేవాదాయ భూముల ఈ వేలం పేరుతో సంపన్నులకు కట్టబెట్టి గ్రామాల్లో భూమినేనమ్ముకున్న దళిత, బడుగు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వం మొండి చూపించే ప్రయత్నం చేస్తుందన్నారు. కౌలుదారులకు రెవెన్యూ వారు ఋణ అర్హత పత్రం ఇవ్వడంతో పాటు బ్యాంకులతో ఋణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదాయ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్న రైతులకు హక్కు కల్పించి, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులతో సమానంగా కౌలురైతు నష్టపరిహారం ప్రభుత్వం అందించే రాయితీలను అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కౌలుదారుల హక్కులకు భంగం వాటిల్లే విధానాలకు స్వస్తి చెప్పి ఆదుకోకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. శంకర్, బాలచంద్రయ్య, పి. చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, మేకల జయన్న, మనోహర్ రెడ్డి, సుబ్బిశెట్టి, భద్రయ్య తదితరులున్నారు.

Printed and Published by Kolli Nageswara Rao on behalf of Andhra Pradesh Ryotu Sangham, Ryotu Bhavan, 210 Amrutha Estates, Himayatnagar, Hyderabad-29 and printed at Nagarjuna Enterprises, Visalaandhra Building, Chuttugunta, Vijayawada-4, Published at Andhra Pradesh Ryotu Sangham, Ryotu Bhavan, 210 Amrutha Estates, Himayatnagar, Hyderabad-29 Editor : Kolli Nageswara Rao.

చదవండి - చదివించండి - చందాదారులుగా చేరండి - చేర్పించండి!

రైతులకు కరదీపిక రైతులోకం















BC
KLVA106M191

Ryotulokam
R.N.I. 15836/68
May 2016
Regd.No. VJ/119/2015-17



మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M191
పుస్తకం పేరు	రైతులోకం
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	45
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	S.Lakshmi
పరీక్ష చేసినది	hema
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good.